అపరాధ పరిశోధన

రు. 7.50 జులై '88



Blank Page

సంపుటి: 47
సంచిక : 6

ఫోన్ నెం:
64843

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 90 రూపాయలు.
హోమ్ డెలివరీ (సభ్యత్వ రుసుము) 10 రూపాయలు.

జూలై, 1988

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:
వి. ఎస్. చెన్నూరి
ఏ. పీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీద బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-7-'88 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు సెప్టెంబరు '88 నెల సంచికలో ప్రకటిస్తాము. •

మే '88 పోటీ ఫలితాలు

(1) మే '88 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

చేరువలో మృత్యువు!
చెండాడే శత్రువు!!

పంపినవారు: శ్రీ వై. శివశంకర్, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, డివిజనల్ ఆఫీస్, నెం. 1, సీతమ్మపేట రోడ్, విశాఖపట్టణం-530 016.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

దహనం చేసినా వ్యర్థం!
సహనం చూపితే అర్థం!!

పంపినవారు: శ్రీమతి ఆర్. శ్రీజ్యోతి, W/O ఆర్. విశ్వేశ్వరరావు, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, ఏలూరు-534 001.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. నిజం చెప్పే యంత్రం—వసుంధర
24. కిచెన్‌లో హంతకుడు—ఫణిబాబు
34. డైమండ్ నెక్లెస్—వాణిశ్రీ
49. శవం చేసిన హత్య—కె.వి.య్స్.ఎన్. మూర్తి
65. బీజాక్షరాలు (సీరియల్)—వి.యస్. రావ్
98. దెయ్యాలున్నాయి—జొన్నలగడ్డ రామలక్ష్మి
115. మర్మవలయం—చవాన్ సుదర్శనరావు
136. చెడిపోయిన ఫిలిమ్—ఎమ్. రాధిక
163. నగరంలో నేరగాళ్ళు—(సీరియల్) ప్రతాపరవిశంకర్

నవలలు (సప్లిమెంట్)

3. వీలునామా—వసుంధర
42. అద్దం తిరగని కథ—వి. యస్. రావ్
90. తెప్రరణం—బొమ్మిడి అచ్చారావు
134. రాక్షసవేట (సీరియల్)—వాణిశ్రీ

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, కార్టూన్లు,

మరెన్నో ఆకర్షణలు!!!

నిజం చెప్పే యంత్రం

వసుంధర

"స్సుమా! ఈ వాచీ నీకోసం తెచ్చాను. బాగుందా?" అన్నాడు భార్గవ.

సుమలత వాచీవంక చూస్తూ—"నీ ఛాయిస్‌కు తిరుగు లేదు. చాలా చాలా థాంక్స్" అంటూ వాచీ అందుకుని తన ఎడమచేతికి ధరించింది. ఆ వాచీ ఆమె చేతికి నగ కంటే అద్భుతంగా అమిరింది.

"మరి నన్నూ నా స్నేహితుణ్నీ కూర్చోమనవూ?" అన్నాడు భార్గవ.

"అయ్యో! అయాం వెరీ సారీ.... నేను ప్రతి విషయానికీ ఇట్టే ఎక్సయిటైపోయి కర్టెసీ మర్చిపోతూంటాను.." అని వాళ్ళిద్దరికీ సోఫా చూపించింది సుమలత.

కూర్చునేముందు "ఇతడు నా క్లాస్‌మేటు. పేరు సునీల్. వృత్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్. ఏడాదిక్రితం పెళ్ళయింది. ఇక్కడికొచ్చి నెల్లాళ్ళయింది" అన్నాడు భార్గవ.

ముగ్గురూ తలో సోఫాలో కూర్చున్నాక—"సుమా! ఇప్పుడు నేను పెళ్ళికి సిద్ధం. ఇక నీ విషయం చెప్పు.." అన్నాడు భార్గవ మళ్ళీ.

సుమలత నవ్వి "నిజం చెప్పాలంటే నాకు నువ్వంటే అంతిష్టం లేదు నీ పెర్సనాలిటీ నాకు నచ్చలేదు. ఎంతసేపూ ప్రయోగాలంటూ కూర్చుంటావు తప్ప అచ్చటా ముచ్చటా తెలియదు ఆడపిల్లతో ఎలా మాట్లాడాలో కూడా తెలియదు నీకు. నీతో టాపిక్సెంత బోరింగుగా ఉంటాయో చెప్పలేను" అంది.

భార్గవ దెబ్బతిని "ఇన్నాళ్ళూ ఈ విషయ మెందుకు చెప్పలేదు? నువ్వు నా అందాన్నీ, తెలివినీ సంభాషణా చాతుర్యాన్నీ పొగుడుతూంటే అంతా నిజమనుకున్నాను." అన్నాడు.

"అదంతా కర్టెసీ. నాకు భీమారావంటే ఎంతో ఇష్టం. సినిమా హీరోలా ఉంటాడు. సినిమా హీరోలా డైలాగ్స్ చెబుతాడు. అతడినడకలో, పెర్సనాలిటీలో, అభిరుచిలో అన్నీ ప్రత్యేకతతే.... నేను భీమారావుని పెళ్ళిచేసుకుంటానని డాడీకి చెప్పాను. ఆయనకి భీమారావంటే సదభిప్రాయం లేదు. భీమారావు బార్లలోపడి తాగుతాట్ట. నైట్

క్లబ్బులో తిరుగుతాట్ట. అయితేయేం—అదంతా మోడ్రన్ స్టెయిల్ అని డాడీకి చెప్పాను. ఆయన వినలేదు. ఆయనకు నువ్వే నచ్చావు. నిన్ను పెళ్ళి చేసుకుంటే సమాజంలో గౌరవం, హోదా, సుఖజీవితం లభిస్తాయంటారాయన. నాకు చార్మింగ్ లైఫ్ కావాలి. నీ దగ్గరదెక్కడుంది? ఈ పోరాటంతోనే రెండేళ్ళు గడిచాయి...."

"అంటే నువ్వు నా కోసం ఆగలేదన్నమాట. నా ప్రయోగమొకటి పూర్తయ్యేదాకా మనం ఆగాలని నేనంటే అవునన్నావు. ఆగుతానన్నావు...."

"అది మర్యాద....నాకు నీ ప్రయోగాలమీద ఆసక్తి లేదు...." అని "అయినా అందమైన ఆడపిల్ల పక్కనుంటే సైంటిఫిక్ ఎక్స్‌పెరిమెంట్సు గురించి మాట్లాడాలని నీకెవరు చెప్పారు?" అంది సుమలత.

"అయితే నువ్వు భీమారావుని పెళ్ళి చేసుకుంటావా?"

"లేదు. నా కా అదృష్టంలేదు. నా పోరు పడలేక డాడీ భీమారావుని కదిపారు. అతడికి లక్షరూపాయలు కట్నం కావాలిట...."

"అయితే ఇప్పుడు నీ నిర్ణయమేమిటి?"

"నేను నిన్నే పెళ్ళి చేసుకుంటానని డాడీ దగ్గర ఒప్పుకున్నాను. ఆయన నాకోసం ఏ త్యాగమైనా చేసి లక్ష రూపాయలుతెస్తే సంతోషించేవాన్ని. ఆయ నా ఉద్దేశ్యంలో లేరు. ఏ కట్నమూ తీసుకోకుండా పెళ్ళి చేసుకుంటానన్న నువ్వు నాకు నచ్చినందుకు పదేపదే బాధపడుతూంటే చివరకు విధిలేక ఒప్పుకున్నాను."

భార్గవ నిరుత్సాహంగా "మీ నాన్న లక్షరూపాయల కట్నం తేలేక పోవచ్చు. కానీ పాతిక వేలలో నీకు నచ్చే మరో సంబంధం తేలేకపోడు. నన్నే చేసుకుంటానని

ఎందుకు చెప్పావ్?" అన్నాడు.

"నాకు నచ్చినవాణ్ణెలాగూ పెళ్ళిచేసుకోలేను. అలాం టప్పుడు నేను నచ్చానన్న నిన్ను పెళ్ళిచేసుకుంటే జీవి తంలో కొంత సుఖపడవచ్చుగదా! అమ్మకూడా నా కదే చెప్పింది—నువ్వు కంపెనీకి బోర్ అని ఆమెకూడా ఒప్పు కుని—నువ్వంటే యిష్టంకదా. పెళ్ళయ్యాక నీకోసం మారకపోడులే అని ఆశపెట్టింది...."

"సరే—ఈ నిజం తెలిశాక నేను నిన్ను పెళ్ళాడతా ననుకుంటున్నావా?"

"అది నీ యిష్టం. కానీ పెళ్ళికిముందు ఒకరినొకరు అర్థం చేసుకుని—ఒకరి గురించిన నిజాలొకరు తెలుసు కోవడం అవసరం. నేను నీతికి, పవిత్రతకు. సంప్రదా యానికి విలువనిచ్చే మనిషిని. మోడ్రన్‌లైఫ్ నా కిష్టం కావచ్చు. కానీ అది నన్ను మన సంప్రదాయంలోని ముఖ్యాంశాలకు దూరం చేయదు....మన దేశంలో నూటికి తొంభై తొమ్మిది మంది ఆడవాళ్ళు భర్తల ఎన్నికలో సరి పెట్టుకోక తప్పడంలేదు. అయినా కుటుంబాలు ఒడిదుడు కులు లేకుండా నడిచిపోతున్నాయి. మన సమాజంలో ఆడదానికి మగడు నచ్చినా నచ్చకపోయినా మగాడికి భార్య నచ్చితే చాలు—సంసారం పచ్చగా ఉంటుంది. నా విషయంలోనూ అంతే!"

భార్గవ తోటకూర కాడలా వ్రేళ్ళాడిపోయాడు. సుమ లత ఆశ్చర్యపడి "అదేంటలాగైపోయావ్?" అంది.

"వాడు కాఫీగత ప్రాణి. బయల్దేరే ముందు మా యింట్లో కాఫీ తాగుదాంరా అంటే వినలేదు ..." అన్నాడు సునీల్.

"అయ్యో! ఆ విషయమే మర్చిపోయాను. ఇంట్లో

ఎవ్వరూ లేరు. ఒక్క-క్షణం కూర్చోండి. నేను కాఫీ కలిపి తెస్తాను. నిజం చెబుతున్నాను. మర్యాదకు వెడుతున్నాను తప్పితే — కాఫీ తాగడంలో ఉన్న ఆసక్తి నాకు కలపడంలో లేదు ..." అంటూ లోపలకు వెళ్ళింది సుమలత.

2

"ఎలా ఉంది నావాచీ మహిమ?" అన్నాడు భార్గవ.

"సుమలత నీ గురించి చెప్పినదన్నీ నిజాలే! ఆమె నీ గురించిన నిజాలు చెబుతూంటే నువ్వు డల్‌గా అయిపోవడంకూడా నేను గమనించాను. అంత మాత్రాన మీరిద్దరూ కలిసి నాటకమాడ్డంలేదని నమ్మలేను" అన్నాడు సునీల్.

"అంటే?"

"వివరించి చెప్పక్కర్లేదు. ఆలోచించు, నీకే అర్థమవుతుంది?"

ఆలోచించకుండానే అర్థమయింది భార్గవకు.

"ఛా—నేను నిన్ను మోసం చేయడంవల్ల నాకేం ప్రయోగం? సత్ఫలితాల నిచ్చిందన్న రుజువు నా కెంతో ముఖ్యం ...." అన్నాడు భార్గవ.

సునీల్ నవ్వాడు—"డియర్ భార్గవా! మనిషి తన అపజయాన్ని కూడా జయముగా భ్రమించి నవ్వాలనుకుంటాడు. ప్రతిమనిషీ జయాన్ని కోరుకుంటాడు. అపజయాన్ని భరించలేడు. తను భ్రమను నమ్మాలనుకుంటున్నాడన్న విశేషం తెలిసికూడా అందులో నాలాంటి మూడో వ్యక్తి నిరికించి నమ్మించి అతడి నమ్మకంతో తన నమ్మకం బలాన్ని పెంచుకోవా లనుకునే బలహీనత కొందరికుంటుంటుంది. నువ్వలాంటి వాడివి ...."

"అంటే—నేను నమ్మని విశేషాన్ని నీచేత నమ్మించి నీ నమ్మకం కారణంగా నేనూ నమ్మాలనుకుంటున్నానని నీ అనుమానం. ఈ అనుమానం నా శ్రమను, నా ప్రయోగ ఫలితాలను వెక్కిరిస్తోంది. నేను ఫిజిక్స్‌లో డాక్టరేట్ సంపాదించాను. ఎలక్ట్రానిక్స్‌లో నైపుణ్యం సంపాదించాను. అటుపైన మానవశరీరాన్నర్థం చేసుకునేందుకు నలుగురు డాక్టర్లతో రాత్రింబవళ్ళు చర్చలు జరిపాను. మనిషి మెదడెప్పుడేయే అవస్థలకు గురవుతుందో క్షుణ్ణంగా తెలుసుకున్నాను. ఆపైన ఎన్నో పుస్తకాలు చదివాను. అటు వైద్యశాస్త్రాన్నీ, ఇటు మానవ మనస్తత్వాన్ని అర్థం చేసుకునేందుకు కృషి చేసి చేసి —ఇన్నాళ్ళకు మనిషిచేత నిజాన్ని పలికించే యంత్రాన్ని కనిపెట్టాను. కృత్రిమంగా ఓ కంప్యూటర్ మెదడును సృష్టించి దానిపై నా యంత్ర ప్రభావాన్ని పరీక్షించాను. అన్నివిధాలా రూఢి చేసుకున్నాక నా యంత్రాన్ని తొలిసారిగా మనిషిపై ప్రయోగించడానికి నిన్ను సాక్షిగా ఎన్నుకున్నాను...."

"నన్నే సాక్షిగా ఎందుకెన్నుకున్నావు?"

"ఇది నీ డిపార్టుమెంటుకెక్కువగా ఉపయోగపడుతుంది నిత్యజీవితంలో మనిషి సమయానుకూలంగా మాట మార్చుతూ జీవితం సాఫీగా కొనసాగిపోవడానికెన్నో అబద్ధాలు చెబుతాడు. ఆ అబద్ధాల వెనుక నిజం తెలుసుకోవడంవల్ల ఎవరికీ సుఖసంతోషాలుండవు. నాకు సంబంధించి సుమలత ఒక అందమైన అబద్ధం. ఆమెను నేను ప్రేమించాను. ఆమె నన్ను నమ్మించింది తనూ ప్రేమిస్తున్నట్లుగా! నా యంత్రం ఆ అబద్ధాన్ని బయటపెట్టించింది. ఇప్పుడు నాకెంతో బాధగా ఉంది. సుమలతకు నామీదుండే అసలభిప్రాయం తెలిసిపోయాక ఆమెను నేను

నా భార్యగా స్వీకరించలేను. నేనంటే ఇష్టమని చెప్పే మరో అమ్మాయిని చూసుకుని పెళ్ళి చేసుకుంటాను. పొర పాటున కూడా ఆమెపై నేను తయారుచేసిన యంత్రాన్ని ప్రయోగించను.....ఈ యంత్రం కేవలం మీ డిపార్టు మెంటు ప్రయోజనానికే! నీ కెందరో నేరస్థులు తటస్థపడు తూంటారు. వారిచేత నిజం కక్కించడానికి మీరు పడే అవస్థలు వర్ణనాతీతం. ఒకోసారి మీ చేతుల్లో నిర్దోషులు చిత్రహింస లనుభవిస్తారు. ఇలాంటివన్నీ ఆపాలనే నే నీ యంత్రం తయారుచేశాను దీని ప్రభావం నీకే ఋజువు చేసి చూపాలనుకున్నాను....''

ఇన్స్పెక్టర్ సునీల్ సాలోచనగా—''నువ్వు చెప్పింది బాగానే ఉంది. నేను నీ మాటలు నమ్ముతున్నాను. కానీ నీ స్నేహితురాలు సుమలత నిజంగా నిజం చెప్పిందని నమ్మకమేమిటి? ఆమె సరదాగా నా ముందు నిన్ను వేళా కోళం పట్టించిందేమో!'' అన్నాడు.

''సుమలత తత్వం అలాంటిది కాదు. ఆమె షురు కైనది. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఎదుటివారిని నొప్పిం చదు. ఒకరి గురించి పొల్లుమాట చెప్పదు. జోక్స్ ఎంజాయ్ చేస్తుంది. తనూ జోక్సు చెబుతుంది. కానీ ఎప్పుడూ యెదుటివాళ్ళమీద జోక్సు వేయదు....'' అన్నాడు భార్గవ.

''అయితే ఆమె యిక ఎల్లకాలమూ నిజం చెబుతూనే ఉంటుందంటావా?'' అన్నాడు సునీల్ ఆశ్చర్యంగా.

''లేదు. నేనామె కిచ్చినది మామూలు వాచీ. ఆ వాచీని నేను తయారుచేసిన యంత్రంలో రేడియేషన్ ట్రీట్మెం టిచ్చాను. ఫలితంగా ఆ వాచీ శరీరంపై మాత్రమే ప్రభావం చూపగల అయస్కాంత శక్తిని పొందింది. అది

యెవరు ధరించినా—దాని ప్రభావం సుమారు అరగంట సేపు మాత్రం ఉంటుంది. ఆ వాచీనుండి వెలువడే అయస్కాంత తరంగాలు ధరించిన మనిషి నాడీమండలపై నిజం చెప్పే ప్రభావాన్ని చూపిస్తాయి....”

“సరే—కొందరు మనుషులు తమ మెదడును.తద్వారా నాడీమండలాన్ని అదుపుచేయగల్గుతారు. వారిమీద నీ యంత్రం ప్రభావముంటుందా!”

భార్గవ నవ్వి—“ఎంతటి బలమైన వ్యక్తిత్వాన్నీ నా యంత్రం లోబర్చుకోగలదు. తర్వాత దీనిలో మరో విశేషముంది. ఉదాహరణకు సుమలత విషయం తెలుసుకో. ఆమె వ్యక్తిత్వం సామాన్యమైనది కాదు. ఎన్నో విశేషాలను తనలోనే గుంభనగా దాచుకోగల శక్తి ఉందామెకు. కానీ నా యంత్రశక్తి ఆమెను లోబర్చుకుంది. అప్పుడామెకు తనేం మాట్లాడుతున్నదీ తెలియదు. అయస్కాంతశక్తి నశించగానే ఆమె మామూలు మనిషైపోతుంది. తను చెప్పిన నిజాల గురించి ఆమెకు తెలియదు. ఒకవిధంగా ఇది హిప్నోటిజం వంటిది...”

“అయితే కొన్ని నిజాలు బయటపడడానికి అరగంట వ్యవధి చాలదు. అలాంటప్పుడేం చేయాలి?” అన్నాడు సుశీల్.

“అది నేను నా వద్దనున్న యంత్రంలో ఇచ్చే ట్రీట్‌మెంటునుబట్టి ఉంటుంది. రిస్టువాచీలు, హారాలు వగైరా మనిషి ధరించే యంత్రాలు గానీ, ఆభరణాలు గానీ—నా యంత్రంద్వారా అయస్కాంతశక్తిని పొందగలవు. నేనిచ్చిన ట్రీట్‌మెంటునుబట్టి అవి పనిచేసే వ్యవధి నిర్ణయించబడుతుంది. ప్రస్తుతం నేను పదిహేను నిమిషాల నుంచి పన్నెండుగంటల వరకూ వ్యవధి నిర్ణయం చేయ

గలను....” అన్నాడు భార్గవ.

“ఇంట్రస్టింగ్‌గా ఉంది. ఈ యంత్రాన్ని నేను తప్పక ఉపయోగిస్తాను. రేపటికి నీ కోసం నాలుగు గొలుసులు, మూడు వాచీలు తెస్తాను....” అన్నాడు సునీల్.

“థాంక్యూ—” అన్నాడు భార్గవ.

3

మొత్తం ఏడుగురి ఖైదీల వాఙ్మూలాలు తీసుకోబడ్డాయి.

మొదటి ఖైదీ ఓ కాలేజీ కుర్రాణ్ణి హత్యచేశాడు. తనను ఎమ్మెల్యే రాఘవులు పురమాయించాడనీ ఆయన కూతురా కాలేజికుర్రాణ్ణి ప్రేమించడంవల్ల హత్య తప్పనిసరి అయిందనీ ఆ ఖైదీ చెప్పాడు. అంతవరకూ హత్య తను చేశాననే ఒప్పుకోవడం లేదా ఖైదీ.

రెండో ఖైదీ లేబర్ కాలనీలో రెండిళ్ళకు నిప్పంటించాడు. మ్యునిసిపల్ ఛెయిర్మన్ బంగార్రాజు ఎన్నికల కక్షతో అతడిచేత ఆ పని చేయించాడు.

మూడవ ఖైదీ స్మగ్లింగ్ ఆపరేషన్లో పట్టుబడ్డాడు ఎలా మాయమయిందో అతడి దగ్గర్నించి అయిదు లక్షల రూపాయలున్న బ్రీఫ్ కేసు మాయమయింది. అందులో తనకు కానిస్టేబులు జగన్నాయకులు సాయపడ్డాడనీ. ఆ స్మగ్లింగ్ ఆపరేషన్‌లో రెండు లక్షల వాటా డీయస్పీకుందనీ ఆ ఖైదీ చెప్పాడు.

ఒకరుకాదు.... ఇద్దరుకాదు ... మొత్తం ఏడుగురు ఖైదీలు....పోలీసులకు కొరుకరాని కొయ్యలై ఉన్నవాళ్ళు- ఉన్నట్లుండి తమ నేరాలొప్పుకుని ఊళ్ళో, రాష్ట్రంలోని, దేశంలోని — ప్రముఖుల నందులో ఇరికించారు.

ఇనస్పెక్టర్ సునీల్ ఆ స్టేట్‌మెంట్ల వంక భయంగా, దిగులుగా చూశాడు. కేసులన్నీ మంచులా, పువ్వులా విడిపోయాయి. కానీ ఇప్పుడు ముందుకు వెళ్ళేదెలా?

బాగా ఆలోచించి అతడు డీయస్పీని కలుసుకుని జరిగింది చెప్పాడు.

డీయస్పీ ఉలిక్కిపడి. "ఇన్నాళ్ళూ నోరువిప్పని ఆ ఖైదీలొక్కసారి ఎలా నోళ్ళు విప్పారు? ఇందులో ఏదో పెద్ద కుట్రవుంది. డిపార్టుమెంట్లో నా మీదనే పెద్ద కుట్ర జరుగుతోందని విన్నాను. సిన్సియారిటీకీ రోజుల్లో గౌరవం లేదు. రిటర్న్స్ లేవు. నువ్వుకూడా నా మీద కుట్రచేస్తున్న వాళ్ళలో లేవుగదా!" అన్నాడు.

"సర్—మీమీద కుట్ర చేసేవాడినైతే ఈ విషయం ముందు మీకే ఎందుకు చెబుతాను?" అన్నాడు సునీల్.

"గుడ్—నిజమే చెప్పావు. ఖైదీ లిచ్చిన ఈ స్టేట్‌మెంట్సు గురించి మన డిపార్టుమెంట్లో ఎవరెవరికి తెలుసు?" అన్నాడు డీయస్పీ.

"నేను. రైటర్ రామనాధం—అంతే సర్?"

"గుడ్—రామనాధం ఈ విషయం నలుగురికీ చెబుతాడా?"

"లేదుసర్! నిజానిజాలు తేలేవరకూ ఈ విషయం మా యిద్దరిమధ్యనే ఉండిపోవాలనుకున్నాం...."

"వెరీగుడ్! అయాం హాపీ...." అన్నాడు డీయస్పీ.

"ఇప్పుడేం చేయాలి సర్?" అన్నాడు సునీల్.

"ముందు నా ప్రశ్నకు సమాధానంచెప్పు. ఒక్కసారిగా ఏడుగురు మొండి ఖైదీలు నోళ్ళెలా విప్పారు?" అన్నాడు డీయస్పీ.

సునీల్ ముందు తటపటాయించినా తర్వాత భార్గవ

తయారుచేసిన యంత్రంగురించి చెప్పేశాడు.

"హూ యీజ్ దిస్ భార్గవ? సీఐఏ ఏజంటుకాదుగదా!" అన్నాడు డీయస్పీ.

"కాదుసర్—అతనివన్నీ కమ్యూనిస్టు భావాలు...."

"అయితే కేజీబీ ఏజంటేమో?"

"రష్యన్సు మనమిత్రులేకదా సర్...."

"ఏమో—చైనీస్ ఏజంటేమో ఎవరు చూడొచ్చారు? లేకుంటే పాకిస్తాన్ ఏజంటు కూడా కావచ్చు...."

"సర్—భార్గ ను నేను చిన్నప్పట్నించీ ఎరుగుదును. అతగాడు అసలుసిసలు సైంటిస్టు...." అన్నాడు సుశీల్.

"నీకు తెలుసో తెలియదో—బ్రిటిష్ ఇంటెలిజెన్స్‌శాఖ అధిపతిగా కేజీబీ ఏజంటుంటే—ఇంగ్లండ్ ప్రభుత్వానికా విషయం తెలుసుకుందుకు కొన్నేళ్ళు పట్టింది. ఏజంట్ల సామర్థ్యాలు మన ఊహలకందవు. ముందు నా ప్రశ్నలకు సమాధానం చెప్పు. భార్గవ ఫైనాన్షియల్ పొజిషన్ ఏమిటి?"

"అతడికి స్వంతంగా ఒక ప్రయివేట్ టెస్టింగ్ లేబరేటరీ ఉంది. దానిమీద సాలుకు పదిలక్షలకు పైగా ఆదాయం వస్తుందతడికి. అయితే అత డా డబ్బునంతా ప్రయోగాల గురించే వెచ్చిస్తాడు...."

"అంతా త్రాష్....బ్యాంకులో అతడిపేర్న డబ్బెం తుంది?"

"రెండు లక్షలు...."

డీయస్పీ ఉలిక్కిపడి—"డూ యూ గెటిట్....టెస్టింగ్ లాబరేటరీ మీద వచ్చే ఆదాయమంతా—దానిమీదే ఖర్చు పెట్టేస్తే అతడికి బ్యాంకులో రెండు లక్షలెక్కడిది?" అన్నాడు.

"సర్—చదువుకాగానే తండ్రి అయిదు లక్ష లిచ్చా డతడికి. షెప్పింగ్ లాబరేటరీమీద వచ్చే ఆదాయంతో కొంత అతడు తండ్రికి వడ్డీతో సహా తీర్చేస్తున్నాడు. ఆ విధంగా తండ్రి బాకీ యిప్పటికి అయిదింట నాలుగొంతులు తీరిపోయింది. అవసరానికని బ్యాంకులో వేరే డబ్బు వేస్తున్నాడు. అదే రెండు లక్షలయింది...."

"నువ్వు చెప్పే దేదీ నాకు కన్విన్సింగ్‌గా లేదు. ముందుగా లెటజ్ ఇన్వెస్టిగేట్ హిజ్ కేస్...."

"సర్—నా మాటవినండి. భార్గవ కేసును ఇన్వెస్టిగేట్ చేయడంవల్ల మన కేం ప్రయోజనముండదు. అతడిపై ఎలాంటి నేరాలూ లేవు. పైగా అతడిగురించి నాకు బాగా తెలుసు...." అన్నాడు సునీల్.

"అయితే ఇప్పు డేంచేద్దామంటావ్?"

"ఈ ఏడుకేసుల్లో ముందుగా ఒకటి ఇన్వెస్టిగేట్ చేద్దాం...."

డీయస్పీ కోపంగా—"అయితే నువ్వు నన్నే అనుమా నిస్తున్నావా" అన్నాడు.

"లేదుసార్. మీరు నా మాటవింటే అన్నీ అర్థమవు తాయి...."

"ముందా భార్గవ కనిపెట్టిన విశేషం హంబగ్ అని చెప్పు. అప్పుడే నీ మాట వింటాను...."

"భార్గవ యంత్రం హంబగ్ కాదుసర్... అందుకు సాక్ష్యాలున్నాయి..."

"అంటే....అంటే....నేను స్మగ్లింగ్ ఆపరేషన్లో రెండు లక్షలు పుచ్చుకున్నానంటావా?"

"లేదు సర్...."

సునీల్ ఇంకా ఏదో అనబోతూండగా. "రెండూ ఎలా

నిజమవుతాయి? నీకు బుర్ర పనిచేస్తోందా?" అన్నాడు డీయస్పీ.

"మీరు నామాట వింటే అన్నీ తెలుస్తాయిసర్...."

"ఉఁ చెప్పు...." అన్నాడు డీయస్పీ అయిష్టంగా.

"డ్యూటీలో మీరు చూపే శ్రద్ధ అసామాన్యం సర్. మిమ్మల్ని చూసి చాలామంది అసూయపడుతున్నారు. అందుకే మీకు చెడ్డపేరు తేవాలని పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోంది. ఆ కుట్రలో భాగమే యిది! మన డిపార్టు మెంట్లోనే ఎవరో మీ పేరును దుర్వినియోగం చేసుకుంటున్నారుసర్! ఆ ఖైదీని ఎవరో మీ గురించి బాగా నమ్మించారు. ఖైదీ నిజమే చెప్పాడుసర్....కానీ తనకు తెలిసిన నిజం మాత్రమే చెప్పాడు...."

"నాకేం అర్థంకాలేదు. అంతా తికమకగా ఉంది...."

"యంత్రం ఖైదీచేత అతడికి తెలియని నిజాన్ని చెప్పించలేదు సర్....అతడి మనసులో ఏదైతే నిజమనుకుంటాడో ఆ నిజాన్ని వెలికితీస్తుంది. అదే అసలు నిజం కావాలనిలేదు...."

"అలాంటప్పుడు మన కా యంత్రంవల్ల ప్రయోజనమేమిటి?"

"ఉంది సర్! ఆ ఖైదీలో అలాంటి భావం ఎవరు ప్రవేశపెట్టారో తెలుసుకోవాలి. అప్పుడు మీమీద కుట్ర పన్నుతున్న దెవరో తెలిసిపోతుంది."

"అయితే ఏమంటావ్?"

"ఈ ఏడు కేసుల్లో మీ కేసునే శాంపిల్‌గా తీసుకుని నేను ఇన్వెస్టిగేట్ చేస్తాను సర్....మీ అనుమతికావాలి."

"వద్దు...." అన్నాడు డీయస్పీ కంగారుగా.

"ఏమయింది సర్...." వినయంగా అడిగాడు సునీల్.

డియస్పీ మాట్లాడేందు కాలోచించవలసి వచ్చింది. ఆలోచించేః ఆయన - "చూడు సుశీల్! నామీద డిపార్టు మెంట్లో కుట్ర జరుగుతోంది. అది ఈనాటి మాట కాదు. అప్పుడే మూడేళ్ళ నుంచి ప్రారంభమయింది. అయినా కూడా ఆ కుట్రదారు డెవడో నేను తెలుసుకోలేక పోతున్నాను అదీ డీయస్పీగా ఉండి! అంటే ఆ కుట్రదారుడు సామాన్యుడు కాడు. ఆతడి తెలివితేటలు అద్భుతం. అసామాన్యం...." అన్నాడు.

"సర్ - మీరు మన శత్రువుని పొగిడేస్తున్నారు. ఇది నాకు అవమానం...."

"శత్రువును దెబ్బతీయాలంటే ముందు శత్రువు గొప్పతనాన్ని గుర్తించాలి. ఈ ప్రాథమిక సూత్రం నీకు తెలియదా?" గద్దించాడు.

"అయితే ఏమంటారు సర్!"

"ఆ శత్రువు నీ ఇన్వెష్టిగేషన్‌లో బయట పడక పోవచ్చు. ఆ ఖైదీని నమ్మించినట్లే నిన్నూ నమ్మించ వచ్చు. అప్పుడేం చేస్తావు?"

"నా ఇన్వెష్టిగేషన్ మీద నాకు నమ్మకముంది సర్...."

"కానీ నాకు నమ్మకం లేదు...."

"మీకు నమ్మకం కలిగించడానికి నేనేం చేయను సర్...."

"ఈ ఏడు కేసుల్లోనూ సెంట్రల్ మినిస్టర్నిన్వాల్ చేసే కేసొకటుందిగా. అది పట్టుకో. ఓ పట్టు పట్టు...."

"అది కష్టం సార్...."

"కాదితే ఏనుగు కుంభస్థలాన్నే పట్టాలి. నీ దృష్టి ఎప్పుడూ నావంటి చిన్నవాళ్ళమీదే ఉంటుంది."

"అలాగనకండి సార్....మీరు నాకంటే వయసులో, అధికారంలో. హోదాలో, ఆదర్శంలో పెద్దవారు...." అన్నాడు సునీల్.

"అయితే నా మాట విను....వెళ్ళు...." అన్నాడు డియస్పీ.

4

ఇనస్పెక్టర్ సునీల్ చెప్పినదంతా శ్రద్ధగా విని - "అయితే నువ్వే నిర్ణయానికి వచ్చావు?" అన్నాడు భార్గవ.

"మా డియస్పీ నేరస్థుడనడంలో నా కెలాంటి సందేహమూ లేదు. మామూలుగా అయితే ఆయన నాబోటి వాళ్ళను నాలుగు మాటలు కూడా మాట్లాడనివ్వడు. అలాటిది నేను చెప్పేవన్నీ విన్నాడు. నాకంటే చిన్నవాడిలా ప్రవర్తించడమే కాక - మొదటిసారిగా తను చిన్నవాడినని నా దగ్గర ఒప్పుకున్నాడు. అంతకు ముందయితే ఈ ప్రపంచానికే మహారాజులా మాట్లాడేవాడు. నేను తన కేసు ఇన్వెస్టిగేట్ చేస్తానని భయపడుతున్నాడు. పరోక్షంగా డిపార్టుమెంట్‌లో నా గౌరవం పెరిగింది. అది నిలబెట్టుకోవాలంటే నేనాయన కేసు జోలికి వెళ్ళకూడదు" అన్నాడు సునీల్.

"ఇదేనా నీ నిర్ణయం?" అన్నాడు భార్గవ.

"అవును....అయితే ఆ సెంట్రల్ మినిస్టర్ కేసు వదలదల్చుకోలేదు...." అన్నాడు సునీల్.

"ఏమిటా కేసు?"

"ఆయన కిష్టం లేని ఒక జర్నలిస్టు భార్యను నడివీధిలో వస్త్రాపహరణం జరిగింది. నేరస్థు డిప్పుడు నా జ్ఞాతిలోనే ఉన్నాడు. ఇంతకాలం అతగాడు బయటపెట్టని సెంట్రల్ మినిస్టర్ పేరు నా ఖైదీచేత నీ యంత్రం

బయట పెట్టించింది...."

"అయితే?

"ఇక చూడు-నా వేట ప్రారంభమవుతుంది. మొత్తం ఆ కేసంతా తిరగేసి అపరాధిని ప్రజల ముందు నిలబెడతాను...."

"ఇది నీవల్ల నవుతుందా?"

"తెలియని నిజం గురించి నేనేమీ చెప్పలేను. కానీ తెలిసిన నిజాన్ని ఆధారం చేసుకుని ఎలాంటి ఒడిదుడుకుల నయినా ఎదుర్కోగల ధైర్యం నాకుంది...."

"వెరీగుడ్.. విష్ యూ ఆల్ ది బెస్ట్...."

"సరిగ్గా పది రోజుల తర్వాత నా క్కనిపించు. ఆ సెంట్రల్ మినిస్టర్ కథ బయటపెడతాను....అది నీకు వినిపిస్తాను...."

5

సరిగ్గా పది రోజుల తర్వాత భార్గవ సునీల్‌ను కలుసుకున్నాడు.

సునీల్ బాగా ఉత్సాహంగా ఉన్నాడు.

అతడు బయటపెట్టిన కథ ప్రజల్లో ఆవేశం పుట్టించేదిగా ఉంది.

పూర్వాశ్రమంలో సెంట్రల్ మినిస్టర్ ఆ జర్నలిస్టు భార్యకు కాలేజిమేటు. పరీక్షలో తనకు కాపీ కొట్టడానికి పేపరు చూపించలేదని ఆమె నల్లరి చేయబోయి కాలేజి నుంచి డిబారయ్యాడు. ఆ కసికొద్దీ ఆమెమీద పగబట్టి ఆమెను ఒంటరిగా పట్టి రేప్ చేశాడు. ఆమె తండ్రి మినిస్టర్ తండ్రిని కలుసుకుని తన కూతుర్నా యింటి కోడలుగా చేసుకోమని కోరాడు. మినిస్టర్ తండ్రి రెండు లక్షల రూపాయలు కట్నం అడిగాడు. జర్నలిస్టు భార్య తెగించి

మినిస్టర్‌మీద పోలీసు రిపోర్టిచ్చింది. కేసు సగంలో ఉండగా మినిస్టరు తండ్రి కలగజేసుకుని జర్నలిస్టు భార్యకు జర్నలిస్టు సంబంధం చూశాడు. జర్నలిస్టు అసహాయస్థితిలో ఆమెను పెళ్ళి చేసుకున్నా క్రమంగా ఆమెను ప్రేమించాడు. ఆమెకు జరిగిన అన్యాయానికి మినిస్టర్‌పై పగబట్టి సమయం కోసం వేచి ఉన్నాడు.

చాలా ఏళ్ళు గడిచేక జర్నలిస్టు ప్రత్యర్థి సెంట్రల్ మినిస్టరయ్యాడు. జర్నలిస్టు అతడినో కంట కనిపెడుతూ ఒకసారి అతడి గురించిన కొన్ని నిజాలను పత్రికా ముఖంగా ప్రకటించాడు. మినిస్టర్ కోపం వచ్చింది. కొందర్ని పురమాయించాడు. ఫలితంగా జర్నలిస్టు భార్యకు నడివీధిలో వస్త్రాపహరణం జరిగింది.

ఇందులో సెంట్రల్ మినిస్టర్ హస్తమున్నదని ఎవరూ ఊహించలేనంత పకడ్బందీగా ఆ నేరం జరిగింది. అయితే అతడి హస్తమున్నదన్న నిజం బైటపడగానే ఋజువులు, సాక్ష్యాలు చాలా సులభంగా లభించాయి. ఖైదీ యిచ్చిన లింకులందు కెంతగానో సహకరించాయి.

"ఈ కేసు దేశాన్నో ఊపు ఊపుతుంది...." అన్నాడు సునీల్.

"నా యంత్రం ప్రజల్లో, నాయకుల్లో పాపభీతిని సృష్టిస్తుంది...." అన్నాడు భార్గవ సంతోషంగా.

"ఈరోజే మొత్తం కేసు గురించిన రిపోర్టునూ, యంత్రం గురించిన సమాచారాన్ని పై అధికారులకు పంపుతున్నాను...." అన్నాడు సునీల్.

ఆ తర్వాత రెండు వారాలకు సునీల్, భార్గవను మళ్ళీ కలసుకుని - "నేను పంపిన సమాచారం గొప్ప సంచలనాన్నే సృష్టించింది. రాష్ట్రముఖ్యమంత్రులూ, కేంద్ర

మంత్రులు, ప్రధానమంత్రి ఈ యంత్రవిషయమై చర్చి స్తారుట....'' అన్నాడు.

"నిజంగా?'' అన్నాడు భార్గవ్ ఆనందంగా.

"అవును. దేశంలోనేకాక విదేశాల్లో కూడా నేర ప్రవృత్తిని మార్చగల అద్భుత యంత్ర మిది....'' అన్నాడు సుశీల్.

"కానీ దీని గురించి ఎక్కడా పేపర్లలో ప్రచారం రాలేదే?'' అన్నాడు భార్గవ.

"ఇది చాలా ప్రమాదకరమైన విశేషం! ఎన్నో ఊహా గానాలకీ, అవాంఛిత చర్యలకీ దారితీసే ఈ విశేషంపై తుది నిర్ణయం జరిగేవరకూ - బహుశా ప్రచారం జర గదు....'' అన్నాడు సునీల్.

"ప్రచారం గురించి నాకు బాధలేదు. ప్రపంచంలో మంచిని నిలబెట్టి చెడును తుడిచివేసే ఈ యంత్రం కల కాలం చట్టాన్ని పరిరక్షించే నీబోంట్ల చేతిలో ఉండాలని నా ఆకాంక్ష'' అన్నాడు భార్గవ.

"నీది ఉన్నతాశయం. తప్పక నెరవేరుతుంది....'' అన్నాడు సునీల్.

6

మరి రెండువారాలు గడిచాయి. భార్గవ ఆత్రుతగా ఎదురు చూస్తున్నాడు సుశీల్‌నుంచి ఎలాంటి కబురూలేదు. ఉండబట్టలేక ఒకరోజున అతడు స్వయంగా సునీల్ ఇంటికి వెళ్ళాడు.

అప్పుడు సునీల్ ఇంట్లోనే ఉన్నాడు. భార్గవను చూస్తూనే "రా, కూర్చో!'' అన్నాడు నీరసంగా.

"నీనుంచి కబురుకోసం ఎదురుచూస్తున్నాను'' అన్నాడు భార్గవ.

"రెండ్రోజుల్నించి నేను సెలవులో ఉన్నాను."

"ఏం — వంట్లో బాగా లేదా?"

"దెబ్బతిన్నాను గురూ! నిన్ను కూడా దెబ్బ తినిపించాను...."

"ఏమయింది?"

"నీ యంత్రం ఫెయిల్యూర్ అని ఓ హైపవర్ కమిటీ నిర్ణయించింది. అది ఏమాత్రమూ నమ్మతగ్గది కాదనీ— దాన్ని నమ్మడంవల్ల సమాజవిద్రోహకర శక్తులు పెద్ద వాళ్ళని నేరాల్లో ఇరికిస్తాయనీ—అందుకు ఋజువు నేను ఇన్వెస్టిగేషన్ చేసిన సెంట్రల్ మినిస్టర్ కేసేననీ అంతా కలిసి నిర్ణయించారు...."

"ఇలా ఎందుకు జరిగింది?" అన్నాడు భార్గవ.

"భార్గవా! మనచుట్టూ ఉన్నది యంత్రాల్లాంటి ప్రజలు. ఆ యంత్రాల్ని నడిపించే స్వార్థపరులు మనకు నాయకులవుతున్నారు. ఏ పార్టీవారైనా నాయకులందరూ ఒక్కటే! అధికారులైనవారికి నీ యంత్రం ఓ పెద్ద ప్రతిబంధకం అందుకే అది నిజం చెప్పించినా— తన నిజాయితీని నిరూపించుకునేందుకు స్వార్థపరులైన అధికారుల మీదనే ఆధారపడింది. వాళ్ళు దాని నిజాయితీనెందుకొప్పుకుంటారు?"

"ఈ అన్యాయాన్ని నేను సహించను .... ప్రజల ముందుకు నా యంత్రాన్ని తీసుకుని వెళ్ళి దాని గొప్పతనాన్ని ఋజువు చేస్తాను...."

"భార్గవా! యంత్రాల్లాంటి ప్రజలు నీ మాటలు వినరు. వాళ్ళు మనుషుల్లాగే ప్రవర్తిస్తే అప్పుడు నీ యంత్రం అవసరమే ఉండదు...."

"అయితే నా యంత్రం ఫెయిల్యూర్ అని ఋజువయిందంటావ్!"

"అవున్రా—అయాంసారీ....ఈ వార్త రెండ్రోజుల క్రితమే నాకు తెలిసింది... నీకెలా చెప్పాలా అని ఆలోచిస్తున్నా!"

"ఓహ్—నా యంత్రం ఫెయిల్యూర్....అంటే నేను సుమలతను పెళ్ళిచేసుకోవచ్చు...." అన్నాడు భార్గవ సంతోషంగా.

సునీల్ అతణ్ణి పరిశీలించి చూసి ఆశ్చర్యపడ్డాడు.

ఒక ఉన్నతాశయంతో నిజం చెప్పే యంత్రాన్ని కని పెట్టిన భార్గవ—కొందరు స్వార్థపరులా యంత్రాన్ని ఫెయిల్యూర్ అంటే – సుమలతను పెళ్ళి చేసుకోవాలన్న స్వార్థంతో ఆ వార్తకు నిజంగానే సంతోషిస్తున్నాడు.

సునీల్‌కి సంతోషించాలో, బాధపడాలో తెలియలేదు.

భార్గవ మాత్రం అక్కణ్ణించి సంతోషంగా వెళ్ళిపోయాడు.

మనిషిని ఎలాంటి ఫెయిల్యూర్నించీ కూడా నిరుత్సాహ పడకుండా కాపాడేది స్వార్థమే మరి! □

పాకశాస్త్ర ప్రవీణురాలు!



బాల్కానీలో నుండి క్రిందకు చూడసాగాను. ఎదురుగా ప్రహరీగోడపై తెల్లటి పాలరాయిపై బంగారు రంగులో మిలమిలా మెరుస్తున్న అక్షరాలు అందంగా కనిపిస్తున్నాయి.

"శ్రీ సత్య బిల్డింగ్స్"

ఎన్నిసార్లు చదివినా ఎన్నిసార్లు చూసినా ఆ అక్షరాల వైపు మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తుంది. ఖాళీవున్నప్పుడల్లా నేను బాల్కానీలో నిలబడి ఆ అక్షరాలవైపే చూస్తుం

టాను. మా డాడీ స్వయంకృషితో కట్టిన అపార్ట్‌మెంట్స్ అవి. ఆయన పేరుమీదే వాటికి ఆ పేరుపెట్టారు.

క్రిందకు చూశాను.

మూర్తి అంకుల్ చేతిలో ఫైల్స్‌తో వస్తూ కనిపించారు. నవ్వుతూ చేయి వూపాను. ఆయనకూడా అక్కడ నుండే చెయ్యివూపారు.

మూర్తి అంకుల్ వృత్తిరీత్యా లాయర్. మా ప్రక్క పోర్షన్‌లోనే ఉంటున్నారాయన. బ్రహ్మచారి అయినందువల్ల చీకూ చింతా లేకుండా హేపీగా గడుపుతున్నారు ఆయన. ఏ వయస్సువాళ్ళ కంపెనీ అయినా ఆయన ఎంజాయ్ చెయ్యగలరు.

"హలో అంకుల్ ఏమిటి విశేషాలు?" ఆయన దగ్గరకు రాగానే నవ్వుతూ అడిగాను.

"ప్రత్యేకంగా ఏమి లేవు మైబోయ్. కాకపోతే సెంట్రల్‌జైలు నుండి పాత నేరస్థుడొకడు తప్పించుకున్నాడట. వస్తే మనింటికి వచ్చేయవచ్చు." చెప్పారాయన.

నా వయస్సు ఇరవైనాలుగు సంవత్సరాలు. అయినా ఆయనకు చిన్న పిల్లాడినే.

"రానీయండి అంకుల్। చక్కగా భోజనం పెట్టి పంపుదాం."

"ఇటీజ్ నాట్ జోక్ బాయ్! ఆ ఖైదీ పరమదుర్మార్గుడు. వాడి భార్యను నరికి చంపేసాడు. అప్పుడు ఆ అమ్మాయి తండ్రి తరఫున నేనే వాదించి వీడికి శిక్షపడేలా చేశాను."

"అయితే?" అన్నాను. అయన చెప్పేది నాకు పూర్తి అర్థంకాలేదు.

"అందుకే నిన్ను లా చదవమన్నాను. నీవేమో ఏ రక మైన థ్రిలు లేని టీచింగ్ ప్రొఫెషన్‌లోనికి దిగావు."

నేను బి.యిడి. ట్రైనింగ్ అవుతున్నాను. అది డాడితో పాటు అంకుల్‌కి కూడా ఇష్టంలేదు. కాని నాకు చిన్నతనం నుండి టీచింగ్ ప్రొఫెషన్ అంటే ఎనలేని ఇష్టం. అందుకే డిగ్రి పూర్తవగానే బి.ఎల్ చదవమని అంకుల్ ఎంత బ్రతిమాలినా నేను వినలేదు.

"వివరంగా చెప్పండంకుల్."

"ఏముంది వాడిని జైలుకు పంపామని నాపైన, ఆ అమ్మాయి తండ్రిపైనా వాడికి పగ వుంది. బహుశా అందుకే తప్పించుకుని వుండవచ్చును."

"మరి పోలీస్ ప్రొటెక్షన్ అడగవచ్చుకదా?"

"ఎందుకు? వాడు చంపడానికి వస్తాడనా?" అంటూ విచిత్రంగా నవ్వాడంకుల్.

"అదేమిటంకుల్! అంత తేలికగా తీసివేస్తావు. వాడు ప్రాణాలకు తెగించిన మనిషని చెప్పావు" తెల్లబోయి అడిగాను.

"ఆ సంగతి తర్వాత చూద్దాం గాని, మీ డాడి వున్నారా?"

"లేరు అంకుల్! థియేటరుకు వెళ్ళిపోయారు. మమ్మీ కూడా పిక్చరుకు వెళ్ళింది" చెప్పాను. చెబుతూనే అంకుల్ ఫైల్స్‌తోబాటు వున్న పుస్తకాన్ని చూసాను. నేను అడుగుదామని నోరు తెరిచేలోగా అంకుల్ దాన్ని బయటకు తీసారు.

'అపరాధ పరిశోధన' చాలా పాతపుస్తక మది. ఆశ్చర్యంగా అంకుల్ ముఖంలోనికి చూసాను.

"ఒక క్లయింట్ చేతిలో చూసాను ఈ పుస్తకాన్ని.

చదివి యిస్తానని తెచ్చేసాను. నువ్వు చదివిన తర్వాత నా కియ్యి."

తన పోర్షన్ వయిపు వెళ్ళిపోయాడు అంకుల్. ఆ పుస్తకం పేజీలు ఆత్రంగా తిప్పాను. పాతపుస్తకాల నుండి వచ్చే అదోరకమయిన గమ్మత్తయిన వాసన నా ముక్కుపుటాలను తాకింది. ఇంట్లోకి నడిచాను.

ఇంట్లో ఎవ్వరూ లేరు. పనిమనిషి అప్పుడే రాదు. మమ్మీ కూడా సినిమా అయితేగాని రాదు. వంటగదిలోనికి వెళ్ళి గేస్‌స్టౌవ్ వెలిగించి టీ పెట్టుకున్నాను. బుక్సు చదివేటప్పుడు టీ త్రాగుతూ చదవడం నా అలవాటు.

చుట్టూ చూసాను. ఓ మూలగా బామ్మ చక్రాల కుర్చీ నా కంటబడింది. వెళ్ళి దానిలో కూర్చున్నాను. మా బామ్మ నడవలేదు. అందుకోసం ఆమె చక్రాలకుర్చీ ఉపయోగిస్తుంది. ప్రస్తుతం బామ్మ హాస్పటల్‌లో వుండటంవల్ల ఆ కుర్చీ ఖాళీగా వుంది.

చేతిలోని పుస్తకం పేజీలు త్రిప్పి మొదటి కథ చదవసాగాను.

హఠాత్తుగా ఏవో కేకలు. పెద్ద పెద్ద అరుపులు వినబడసాగాయి. ఉలిక్కిపడి తలెత్తాను. బయట వరండాలో ఎవరో అరుస్తూ పరిగెడుతున్నారు. ఏమిటో చూద్దామని లేవబోయాను.

సరిగ్గా అదే సమయంలో ఓ వ్యక్తి నా గదిలోనికి దూసుకువచ్చాడు. అదిరిపడి అతనివేపు చూసాను.

తెల్లగావున్నా ముడికిపట్టిన శరీరం తైలసంస్కారం లేని జుట్టు ఐవడుగుల ఎనిమిది అంగుళాల సాధారణ ఎత్తులో వున్నాడా వ్యక్తి.

అతన్ని చూసి కాదు నేను అదిరిపడింది, అతని చేతి లోని కత్తిని చూసి మాంసం దుకాణాలో ఉపయోగించే కసాయి కత్తది. నిండా రక్తంలో ముంచినట్లు ఎర్రగా మెరుస్తూంది. అతని బట్టలనిండా రక్తం పిచకారీ కొట్టినట్లు వుంది.

అంతకంటే ఎర్రగా మెరుస్తున్న కన్నులతో నన్ను తీక్షణంగా చూస్తున్నాడతను.

"అరవకు మిస్టర్! అరిచి ప్రాణాలు పోగొట్టుకోకు. అసలే అవిటివాడివి...." పళ్ళు బిగించి హెచ్చరించా డతను.

అవిటివాడినా! నేనా? అంత భయాందోళనలలో నా మెదడు పని చేయడం మొదలుపెట్టింది. చక్రాల కుర్చీని చూసి అతడు నన్ను అవిటివాడిగా భావించి వుంటాడు. అదీ మంచిదే. అందుకే నేనేమీ మాట్లాడలేదు. కాని అత నెవరో అనే భయం నా మనస్సులో కదులుతూనే వుంది.

ఇంతలో బయట నుంచి మళ్ళీ కేకలు వినబడు తున్నాయి. 'మూర్తిగారిని చంపేశారు రోయ్' అని అరుస్తున్నారెవరో. దానితోపాటే పరుగెడుతున్న శబ్దం.

అంకుల్ చనిపోయాడా? నా ఫ్రెండ్, గైడ్, ఫిలాస ఫర్ ఇక లేడా?

అతనివైపు చూసాను. నా వంక చూసి శబ్దం కాకుండా నవ్వాడు. ఏదో తెలియని భావనతో నా వెన్ను జలద రించింది.

"కదలకుండా అలాగే కూర్చో మిస్టర్. కాస్సేపటికి నా దారిన నేను వెళ్ళిపోతాను. మీ యింట్లో ఇంకెవ్వరూ లేరు గదా!"

లేరన్నట్లు తల వూపాను.

ఆతను ఒక్కసారి గదంతా కలయజూసి టేబుల్ పైని గ్లాసు అందుకున్నాడు.

"మార్వలెస్" అందులోని టీ చప్పరిస్తూ అన్నాడు.

"ఎవర్నువ్వు?" కోపంగా అడిగాను.

"ఎవరయితేనేం! ప్రస్తుతానికి నాకు కొంత డబ్బు కావాలి నీవి రెండుజతల బట్టలు కూడా కావాలి. లేదా నీవు నాలుగోవాడివి అవుతావు."

"అంటే!"

"ఏంలేదు. ఇప్పటికి నా చేతిలో ముగ్గురు చచ్చారు. ఇలాంటి కత్తితోనే ఆ ముగ్గురి తలలూ నరికాను ఇప్పుడు నేను చెప్పినట్లు చెయ్యకపోతే నీ తల కూడా తెగి పడు తుంది.

అదిరిపడ్డాను. ఒక భయంకరమైన హంతకుడు నా యెదురుగా వున్నాడు. ప్రాణభయం నన్ను నిలువెల్లా ఆక్రమించసాగింది. తలుపు మూయనందుకు నన్ను నేనే తిట్టుకోసాగాను ఆ పాత 'అపరాధ పరిశోధన' చూసిన థ్రిల్‌లో పడి ఆ తలుపు సంగతి మరచిపోయాను.

అపరాధ పరిశోధన!

నాలో యేదో మెరుపు మెరిసింది. సాలోచనగా నా చేతిలోని పుస్తకంవైపు చూసాను. అందులో ఇంతకు ముందు నేను చదివిన కథ నా మనస్సులో కదలాడింది.

"వెల్ మిస్టర్—....?" అడిగా డతను.

"బాబు."

"నా పేరు రత్నాకర్. సరిగ్గా రెండేళ్ళ క్రితం నేను మొదటి హత్య చేసాను. అప్పట్లో నాకు మాధవి అనే అమ్మాయి పరిచయమయింది. మేము ఒకరి నొకరు

గాఢంగా ప్రేమించుకున్నాం. కాని నాకు పెళ్ళయింది. మరి ఎలా? అందుకే చాలా జాగ్రత్తగా ప్లాన్ వేసి నా భార్యను చంపేశాను. అయితే ఆ లాయర్‌గాడు....”

రత్నాకర్ ముఖం కోపంలో ఎర్రబడింది. విపరీతమైన ఉద్రేకంతో అతని పెదాలు అదరసాగాయి. అతనో భయంకరమైన హంతకుడు. ప్రస్తుతం నా యెదురుగా వున్నాడు. పైగా చేతిలో కత్తి వుంది. వేలు కదిపినా చంపడానికి వెనుదీయడు. నా పరిస్థితి నాకు తెలుసు. అయినా ధైర్యం చేసాను.

నాకు అందేటంత దూరంలోనే వుంది గాస్ సిలిండర్. మెల్లిగా ఎడమచేత్తో దాని రబ్బరు ట్యూబ్ లూజ్‌చేసాను. అది అతను గమనించలేదు తన ధోరణిలో తాను చెప్పుకుపోసాగాడు.

“అందుకే అశకాశం దొరకగానే తప్పించుకున్నాను. వచ్చేటప్పుడు జైలరు తల నరికి మరీ వచ్చాను. వచ్చాక లాయరు పని అయిపోయింది. ఇక మిగిలింది నా మామ. నీకు తెలుసో లేదో మిస్టర్ బాబు! మొదటి హత్య చేసినప్పుడు చాలా భయం వేసింది. కాని ఇప్పుడంత భయం లేదు. అలవాటయిపోయింది” అన్నాడు. అంటూనే నవ్వాడు.

రత్నాకర్ మాటలు ముఖ్యంగా అతని నవ్వు వింటుంటే చిక్కబెట్టుకున్న ధైర్యం సడలిపోసాగింది. ఎలాగైనా ఈ ఆపదనుండి బయటపడాలి.

వాడి మాటలు వింటూనే చక్రాల కుర్చీకి కుడివైపు వున్న బోల్టుని లూజ్ చేసాను. హఠాత్తుగా కుర్చీ ఒక వైపుకి కొద్దిగా ఒరిగింది.

"ఏమిటి ఏమైంది?" కత్తి చూపిస్తూ కరకుగా ప్రశ్నించాడు.

"కుర్చీనట్టు లూజైనట్టుంది. అందుకే ఒరిగిపోతోంది." గొంతుకలో భయందాస్తూ చెప్పాను.

అతడు అసహనంగా చూసాడు కుర్చీవైపు. ఆ కుర్చీ ఒక వైపుకి ఒరిగిపోతే పెద్దగా శబ్దం అవుతుంది. ఆ శబ్దానికి బయట తిరుగుతున్న వారంతా లోపలికి రావడానికి ప్రయత్నిస్తారు. అదే జరిగితే వాడి పని అక్కడితో ఆఖరు.

అదే సమయంలో కుకింగ్‌గాస్ వాసన ఆ గదిలో నిండిపోయింది ఆ వాసన ఏమిటో గ్రహిస్తూనే అదిరిపడ్డాడతను.

"గేస్ లీక్ అయినట్టుంది. వెంటిలేటర్లు ఓపెన్ చెయ్యాలి. లేదా మనం ఈ వంటగదిలోంచి ముందు గదిలోనికైనా వెళ్ళాలి" మెల్లిగా చెప్పాను.

"నీవేమి తిక్కవేషాలు వెయ్యడంలేదుకదా?" కళ్ళలో అనుమానం తొంగిచూస్తుండగా అడిగాడతను. "లేదు. కాళ్ళులేని అవిటివాడిని. నేను ఏమ్నేం చేయగలను. ముందు అవతలి గదిలోనికి పోదాంపద." చెప్పాను.

అతను నా వెనుకవైపుగా వచ్చి నా కుర్చీ ముందుకు గెంటబోయాడు. ఆ మాత్రం ఒత్తిడికే అది మరికాస్త శబ్దంచేస్తూ ఒరిగింది.

పామును ముట్టుకున్న వాడికి మల్లే అదిరిపడ్డాడతను. ఆ చక్రాల కుర్చీని అలా తోస్తే ఇంకా పెద్ద శబ్దమయ్యేటట్లుంది. కుర్చీలోని నేను పైకి లేవలేను (అతనిదృష్టిలో) అలాగే కాస్సేపు ఆ గదిలో వుందామంటే గేస్ ఊపిరి

సలపనివ్వడంలేదు.

చేతిలోని కత్తికిందపెట్టి కుర్చీముందు ఒంగి కూర్చు న్నాడు. నట్టు బిగించడాన్కి ఆయుత్తమయ్యాడు.

ఒక్కసారి గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాను. నేను చెయ్యబోయే సాహసం నా గుండె వేగాన్ని రెట్టింపు చేసింది.

ఉల్కాపాతంలా ముందుకు దూకాను. బహుశ ప్రాణ భీతి నాలో ఆ వేగాన్ని తెచ్చివుంటుంది కాలితో నేలపై వున్న కత్తిని దూరంగా పడేలా తంతూ పొయ్యిపై వున్న టీ పాత్రను చేతిలోనికి తీసుకున్నాను.

అదిరిపడి తలెత్తాడతను వేగంగా పైకి లేవబోయాడు.

అయితే అతని ప్రయత్నం పూర్తిగా ఫలించకుండానే నా చేతిలోని గిన్నెతో అతని ముఖంపై బాదాను. వెనక్కు పడి పోయాడతను. వేగంగా ఆ గదిలో నుంచి బయటకు పరిగెత్తి వంటగది తలుపు గడియవేసాను.

అప్పటికే మా పోర్షన్ముందు జనం గుమికూడి వున్నారు. వెళ్ళి తలుపు తెరిచాను. జనం హొలోమంటూ లోపలకు వచ్చేశారు. వాళ్ళలో పోలీసులు కూడావున్నారు. అప్పటికే ఎవరో ఫోన్ చేసి వుండవచ్చును. నిమషాలపైన రత్నాకర్ అరెస్టు అయ్యాడు.

"వెల్ మిస్టర్ బాబు! ఒక హంతకుడిని చేతిలో యే ఆయుధం లేకుండా బంధించ గలిగారంటే మీ ధైర్యానికి అభినందించాలి" ఇన్స్పెక్టర్ చెప్పాడు.

"అపన నాకా ధైర్యాన్నిచింది ఇన్స్పెక్టర్! ఈ రోజు ఈ పుస్తకమే నా ప్రాణాలను కాపాడింది" చేతిలోని అపన అతనికిస్తూ చెప్పాను.

"వాట్?" ఇన్స్పెక్టర్ ఆశ్చర్యంగా అన్నాడు.

"ఎస్ ఇన్‌స్పెక్టర్! అందులోని ఒక కథలో కాళ్ళు లేని అమ్మాయి చిన్న ట్రిక్‌తో శత్రువుల బారినుండి తప్పించుకుంటుంది. అదే ట్రిక్కుతో నేను ఈ హంతకుడి బారినుండి తప్పించుకున్నాను."

నా జీవితంలో యేనాడు యెరుగని ఆ భయంకరమయిన అనుభవం తల్చుకుంటేనే నా ఒళ్ళు జలదరిస్తుంది.

మూర్తి అంకుల్ గుర్తుకు రావడంతో నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. □

నిజం తెలుసుకో!

డి.యస్పీగారి కుటుంబం పెళ్ళికి బయల్దేరడానికి సిద్ధంగా వుంది.

ఆయన భార్య త్రిపురసుందరి, పెద్దకూతురు సునీత తయారైపోయారు. కొడుకు కాలేజీలో హాజరు వేయించుకుని అట్నుంచటే పెళ్ళికి వస్తానన్నాడు.

డియస్పీగారు కేంప్ కెళ్ళేరు.

మిగిలింది చిన్నకూతురు విశాల. ఆమె వూళ్ళోనే

వుంది. అంతేకాదు కాలేజి ఎగ్గొట్టి ఇంట్లోనే వుంది. ఆలస్యం అంతా ఆమెదే. ఆవిడ ఇంకా సింగారించుకో లేదు. పెళ్ళికి రానని మొరాయించింది.

కారణం సునీత కంఠం రాళ్ళనెక్లెస్ ధరించి ధగ ధగ లాడిపోతుంటే, విశాల మెడ సన్నటి సాదా గొలుసుతో వెలవెల పోతున్నది. సునీతకి అది అత్తగారు చేయిం చారు పెళ్ళయిన తర్వాత నీకూ చేయిస్తారు అత్తగారు, అందాక కాస్త ఆగవే అని తల్లి మొత్తుకుంటున్నా విశాల వినడం లేదు. శుభమా అని పెళ్ళికి బయల్దేరితే ఇదెక్కడి గొడవని ఆమెకు చిన్నకూతురు మీద కోపం పీకల వరకు వచ్చి ఆగింది.

"పోన్లేమ్మా. ఈ సారికి పక్కింటి అత్తయ్యగారి నెక్లెస్ అడిగి తీసుకుందాం...." అంది సునీత రాజీమార్గం సూచిస్తూ.

"ఎందుకమ్మా ఎరువు సొమ్ము బరువుచేటని....?" తల్లి గునిసింది.

"అది నాకేం అక్కర్లేదు" అంది విశాల మూతి బిగించి.

"పోనీ, నా నెక్లెస్ వేసుకోవే" అంది సునీత చెల్లెల్ని అనునయిస్తూ.

"నీకు లేకుండా నాకు వద్దు."

"నేను పక్కింటి అత్తయ్యగారిది తెచ్చి వేసుకుంటా లే" అంటూ తన మెడలోంచి నెక్లెస్ తీసి చెల్లెలి మెడకి అలంకరించింది.

విశాల అలక తీరింది.

పక్కింటి రాజమ్మగారు పొగాకు కంపెనీ ప్రొప్రయి టర్‌గారి రెండో పడుచుపెళ్ళాం. సునీత అడగడమే మహా

భాగ్యంగా భావించి. నెక్లెస్ తీసి ఇచ్చింది. తెల్లటి రాళ్ళ మధ్య నీలమణితో మెరిసిపోతూ ఎంతో అందంగా వుంది రాజమ్మ నెక్లెస్.

అక్కా చెల్లెళ్ళూ ఎర్రటి కంచి పట్టుచీరెలు ధరించి, నెక్లెసులు వేసుకుని బయల్దేరి, ఇంట్లోంచి రోడ్ మీదకు వచ్చేసరికి దారిన పోయేవారి కళ్ళు రెప్పలు కొట్టడం మర్చిపోయాయి.

'అబ్బ రుక్మిణీ, సత్యభామల్లా వున్నారా' అని లోలోపలే మెచ్చుకున్నాడు అటుగా పోతున్న కృష్ణమూర్తి అనే కవి.

వారి వెనుకే శ్రీమహాలక్ష్మిలా వుంది త్రిపురసుందరి.

2

ఎక్సైజ్ కంట్రాక్టర్ సుబ్బిరెడ్డిగారి అమ్మాయి పెళ్ళి వెంకటేశ్వర కళ్యాణమండపంలో, భద్రాచలంలో రాముడి పెళ్ళికంటే గొప్పగా జరిగింది.

పురప్రముఖులు, వారి భార్య, పిల్లలు అంతా అక్కడే వున్నారు. సుబ్బిరెడ్డిగారు ఏర్పాటుచేసిన అతిధి మర్యాదలు మెచ్చుకుంటూ, విందులు వినోదాలతో కాలక్షేపం చేశారు.

సినీ నాట్యతార జయ భరతనాట్యం ముగిసేసరికి రాత్రి పదయింది.

కారు ఎక్కబోతూ "అక్కా నెక్లెస్ ఏదే?" అంది విశాల తక్కున ఆగిపోయి.

"ఏ నెక్లెస్?" అంది సునీత తత్తరపాటుతో.

"అదేనే నీ మెడలోది. రాజమ్మగారి నెక్లెసు."

సునీత మెడమీద చెయ్యి వేసింది, బోసిగా తగిలింది. గుండె ఆగినట్లయింది.

"ఏమిటే?" అంది అప్పటికే కారులో కూర్చున్న

త్రిపురసుందరి.

"నెక్లెస్ లేదు."

"ఏమైందే?"

"ఏమో?" ఏడుపుగొంతుతో చెప్పింది సునీత.

"పోయిందా!" ఆందోళనతో అంది తల్లి.

"అక్క మెడలో లేదే" అంది విశాల.

"కొంప ముంచావుగదే" అని కేకలు పెడుతూ కారు దిగింది త్రిపురసుందరి.

డియస్పీగారి అమ్మాయి మెడలో నెక్లెస్ పోయిందని క్షణాల్లో అందరికీ తెలిసిపోయింది. పోలీసు ఇన్‌స్పెక్టర్లు వురుకులు. పరుగులు తీశారు టౌన్‌లో వున్న దొంగల్ని పట్టుకురావడానికి.

అప్పటికే ఆడిటోరియమ్ ఖాళీ అయిపోయింది.

తల్లీకూతుళ్ళు ఏడుపుమొఖాలతో తిరుగుముఖం పట్టారు యింటికి. దారిపొడుగునా కూతుళ్ళని తిడుతూనే వుంది తల్లి.

"అప్పుడే చెప్పానా. ఎరువుసొమ్ము బరువుచేటని. ఇప్పుడు చావండి ఎట్లా చస్తారో? ఆయనొస్తే నేను చస్తాను. నాకు చచ్చే చావొచ్చి పడింది. ఎట్లా చావాలో?"

కూతుళ్ళిద్దరూ లాకప్‌లో పడిన అనుమానితుల్లా గప్‌చిప్‌గా వుండిపోయారు.

3

జగన్. కిషన్‌చంద్ వెంట అతని యింట్లోని పూజ గదిలోకి వెళ్ళాడు ఖరీదయిన కష్టమర్స్‌ని తన పూజగది లోకి తీసుకెళ్ళి వ్యవహారం సెటిల్‌చేస్తాడు. జగన్ అతనికి కొత్తే అయినా క్లాస్ కష్టమర్ అని గ్రహించాడు. తన

అనుభవంతో ఎవరు ఎటువంటి వాళ్ళో అంచనా వెయ్య గలడు అతను.

"నే నెప్పుడూ చూళ్ళేదు నిన్ను" అన్నాడు కిషన్ చంద్ నవ్వుతూ.

"అవును. నేను కొత్తగా వచ్చాను" చెప్పాడు జగన్.

"నా దగ్గరికి రావాలని ఎలా తెలిసింది?"

"చేపపిల్లకి ఈత నేర్పాలా?"

"గడుసువాడివే. ఎన్నాళ్ళుంటావు?" నవ్వాడు కిషన్ చంద్.

"రెండురోజులు."

"అదేం?"

"పనిమీద ఈ వూరొచ్చాను. సెటిల్ కావడానికి కాదు."

"ఏం తెచ్చావు?" ప్రశ్నించాడు కిషన్‌చంద్.

జగన్ నెక్లెసు బయటపెట్టాడు.

కిషన్‌చంద్ నెక్లెస్ తన చేతుల్లోకి తీసుకున్నాడు. బంగారాన్ని పరీక్షించాడు. తూకం వేశాడు.

"చాలా బరువుంది" అన్నాడు తృప్తిగా.

"ఎంత?"

"ముప్పై గ్రాములు."

"పది గ్రాములు మూడువేల చిల్లర వుంది" అన్నాడు జగన్.

"అవును. అది కొత్త బంగారం."

"ఇది పాత బంగారం. పైగా దొంగబంగారంం" నవ్వాడు జగన్.

కిషన్‌చంద్ నవ్వుతూ డబ్బు అందించాడు. జగన్

లెక్క పెట్టుకున్నాడు. అన్నీ వంద కాగితాలే. ఏభై వున్నాయి.

"ఐదువేలు" అన్నాడు జగన్.

"అవును."

"అంతేనా?"

"నీకు ఎక్కువే ఇచ్చాను భాయ్."

"సగానికి సగమా? మరీ అన్యాయం."

"అన్యాయం ఏవుంది? నాకుండే రిస్కు నాకుంది."

జగన్ గొణిగాడు.

కిషన్‌చంద్ మరొక ఐదొందలు చేతిలో పెట్టాడు.

"రాళ్ళ సంగతి ఏమిటి?"

కిషన్‌చంద్ పకపక నవ్వాడు.

"అవేం ఒరిజినల్ డైమెండ్స్ అనుకుంటున్నావా? అవి చెల్లుబాటు కావు భాయ్ నీ కామాత్రం తెలియదా? కావాలంటే వూడదీసి ఇస్తాను పట్టుకుపో" అన్నాడు.

జగన్‌కి తెలుసు. అందరూ వాడేది అమెరికన్ డైమెండ్సే. అవి ధగధగలాడుతుంటాయి అంతే. డూప్లికేట్ వజ్రాలకు రీసేల్ వాల్యూ వుండదు. కాకపోతే కొందరు సేట్‌లు వాటికిగూడా తృణమో ఫణమో విదుల్చుతారు.

జగన్ తర్కించలేదు.

4

సాంబశివరావు వచ్చేసరికి రాజమ్మ ముఖం మబ్బుపట్టిన ఆకాశంలా వుంది ముద్దుల భార్య వదనంపై విచార మేఘాలు కమ్ముకుని వుండడంచూసి ఆందోళన చెందాడు.

"ఏమిటి రాజూ! ఏం జరిగింది?" అన్నాడు.

"పక్కింటి డియస్పీగారి అమ్మాయి నా నెక్లెస్ తీసు

కెళ్ళంది. పెళ్ళికి వెళ్తున్నామంటే పోసి అని ఇచ్చాను."

"వూఁ...."

"పెళ్ళిలో అది పోయింది."

"ఎలా?"

"ఏమో? జారిపడిందో? లేక ఎవడైనా కొట్టేశాడో!" అంది రాజమ్మ.

"ఓస్....అంతేనా?" తేలిగ్గా నిట్టూర్చాడు సాంబశివ రావు.

"మీకేం మీరలాగే అంటారు, పోయిన నగ తిరిగి వస్తుందా?"

"ఎందుకు రాదు?"

"ఏమో? పోలీసోళ్ళతో పని. తిరిగి ఇస్తారంటారా? బుద్ధి తక్కువై ఇచ్చాను. ఇలా జరుగుతుందనుకోలేదు" గద్గదస్వరంతో అంది రాజమ్మ.

"ఏం పోలీసు అయితే? ఎలా తిరికి ఇవ్వరో చూస్తాను? ఆయన డియస్పీ అయితే నాకేం గొప్ప. అవసరం అయితే హోమ్‌మినిస్టర్ దగ్గర కెళ్తాను" సీరియస్‌గా అన్నాడు సాంబశివరావు.

"అయితే వాళ్ళు అలాంటిది చేయించి ఇస్తారంటారా?" ఆశగా అడిగింది రాజమ్మ.

"ఎవడికోసం. చచ్చినట్టు ఇవ్వాలి. లేకపోతే వూరు కుంటామా? డియస్పీ. గియస్పీ మనదగ్గర కాదు. ఆ పప్పులు మనదగ్గిర వుడకవు" అన్నాడు.

భర్త మాటలు వింటూవుండగా రాజమ్మ మనసులో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. వెంటనే ఆమెముఖం మెర్క్యురీ లైట్‌లా వెలిగింది.

"ఏవండీ నాదొక ఐడియా!" అంది.

సాంబశివరావు వింతగా చూశాడు.

"మీరెటూ డైమెండ్ నెక్లెస్ చేయిస్తానంటున్నారుగా?"

"ఆఁ....త్వరలోనే. ఈసారి రష్యానుంచి ఆర్డర్ రాగానే."

"చెప్పేది వినండి."

"చెప్పు."

"మనం డైమెండ్ నెక్లెస్ చేయించుకో నక్కర్లేదు."

"ఏం? వద్దా?"

"వుహూఁ....అదికాదు. మనం పక్కింటి వాళ్ళకి ఇచ్చింది మామూలు రాళ్ళ నెక్లెస్ కాదు. డైమండ్ నెక్లెస్."

భార్య మాటల్లో అంతరార్థం తెలిసి సాంబశివరావు కళ్ళు మెరిశాయి. పక్కింటి డియస్పీ బాగానే సంపాదిస్తున్నాడు. పులిసిపోయున్నాడు కొడుకు. చచ్చినట్లు చేయించి ఇస్తాడు డైమెండ్ నెక్లెస్. భార్య నగ ఎరువు ఇవ్వడం మంచిదే అయింది అనుకున్నాడు.

5

"ఐయామ్ వెరీ....వెరీ....సారీ సాంబశివరావుగారూ! మా అమ్మాయి మీ మిసెస్ నెక్లెస్ తీసుకుని పోగొట్టిందట" అన్నాడు డియస్పీ అతన్ని చూస్తూనే.

"అంత ఖరీదైన నెక్లెస్ నా మిసెసే వేసుకుని ఫంక్షన్సకి వెళ్ళదు. మీ అమ్మాయికి ఎలా ఇచ్చిందో చాలా వండర్‌గా వుంది' అన్నాడు సాంబశివరావు కూర్చుంటూ.

"ఎంతయింది మీరు చేయించి నప్పుడు?"

"నాలుగు లక్షలు."

"వాట్?" కెవ్వున కేకపెట్టాడు డియస్పీ. అతని గుండె రైలింజన్‌లా వేగంగా కొట్టుకుందిధర వినగానే.

"అవును సార్. బంగారం ధర ఎక్కువలేదు. పది వేలు అనుకుంటాను. రేటంతా వజ్రాలదే. అవి డూప్లికేట్ అమెరికన్ డైమండ్స్ కావు ఒరిజినల్ వజ్రాలు. లాస్ట్ ఇయర్ రష్యన్ కన్‌సైన్‌మెంట్‌లో ప్రాఫిట్ వచ్చిందని హేపీగా చేయించాను" చెప్పాడు సాంబశివ రావు.

డియస్పీకి అతను చెప్పే మాటలు బుర్రకి ఎక్కడం లేదు. నాలుగు లక్షలు అనగానే గుండె పగిలినట్లనిపించింది. అతనింకా ఏ పదివేలో అనుకుంటున్నాడు. దొరక్కపోతే ఎలాగో చేయించి ఇచ్చేద్దామని నిశ్చయించుకున్నాడు. కాని .. కాని....నాలుగు లక్షలు బాప్‌రే !

"వజ్రాలు అంత ఖరీదు వుంటాయా?" హీనస్వరంతో అన్నాడు డియస్పీ. పెద్ద పులిలాంటి అంతలావు డియస్పీ పిల్లిలా డీలా పడిపోయాడు.

"మీకు తెలియదా? కోట్లు ఖరీదు చేసేవి వుంటాయి" సాంబశివరావు తనకి తెలిసిన అసలయిన వజ్రాల గురించి చెప్పసాగాడు.

డియస్పీకి శరీరం వణుకుతోంది. ముఖం మీద స్వేద బిందువులు పుట్టుకొస్తున్నాయి.

"మీరు ఎలాగో మేనేజ్ చెయ్యండి. ఆడవాళ్ళకు చెప్పకండి. పాపం కంగారు పడతారు" అన్నాడు సాంబశివ రావు.

"ఊఁ...." అన్నాడు డియస్పీ ఏమనాలో తోచక. అతకి పెళ్ళాం మీద, కూతుళ్ళ మీద అంతులేని కోపం ముంచుకొచ్చింది వాళ్ళకుండే నగల వ్యామోహం మీద అసహ్యం వేసింది. ఈ గండం నుంచి బయటపడేదెలా? దబాయించి తరిమెయ్యడానికి సాంబశివరావు సామాన్యుడు

కాదే. సెంట్రల్ లెవల్లో గూడా పలుకుబడి గలిగినవాడు.

డియస్పీ బుర్ర తిరుగుతోంది.

సాంబశివరావు అక్కడ్నుంచి సెలవు తీసుకుని పొగాకు కంపెనీకి వెళ్ళాడు. అతని అనుమానాలు అతనికి వున్నాయి. తను నెక్లెస్‌లోవి అసలైన వజ్రాలని బుకాయించాడు. కాని వాడు పోలీసోడు. తల్లికి మొగుడు తన మాటలు నమ్మాడా? నమ్మినా అంత ఖరీదు కట్టి ఇస్తాడా? తన భార్య వాళ్ళ అమ్మాయికి నెక్లెస్ ఇచ్చినట్లు రుజావులు, సాక్ష్యాలు ఏమున్నాయి? మీరిచ్చింది మామూలురాళ్ళ నెక్లెసే అని దబాయిస్తే? లేదా అసలు మీ దగ్గర నెక్లెసే తీసుకోలేదంటే ఏం చేసేట్టు?

"ఏం సార్ అలా వున్నారు?"

సాంబశివరావు ఆలోచనల్లో నుంచి తేరుకున్నాడు. ఎదురుగా కూర్చున్నది కిశోర్. అతను పత్రికా విలేఖరి.

"మీరా?" అన్నాడు.

"మీ కంపెనీ పొగాకు రష్యాకు ఎప్పుడు వెళుతుంది? ఆర్డర్ వచ్చిందా? కనుక్కుని పోదామని వచ్చాను. ఏదైనా శుభవార్త వుంటే పేపర్లో వేద్దామని" అన్నాడు పత్రికా విలేఖరి.

"ఇంకా ఆర్డర్ రాలేదు. ఆ ట్రైల్స్‌లోనే వున్నాను" అన్నాడు సాంబశివరావు.

"ఏమిటి డల్‌గా వున్నారు?" ప్రశ్నించాడు విలేఖరి.

"పెద్ద చిక్కొచ్చి పడింది."

"ఏమిటి?"

సాంబశివరావు తన భార్య డియస్పీగారి అమ్మాయికి నెక్లెస్ ఎరువు ఇవ్వడం, ఆ అమ్మాయి పెళ్ళికి వెళ్ళి పారేయడం, అంతా చెప్పాడు. అయితే అందులోవి అస

లైన సిసలైన వజ్రాలనే చెప్పాడు. తనకు వున్న అను మానాలన్నీ వివరించాడు. విలేఖరి కొత్త బుర్రున్నవాడు గదా ఏదైనా ఐడియా చెప్తాడేమోనని ఆశ.

"అయ్యయ్యో అంత ఖరీదయిన నెక్లెస్ ఎందుకిచ్చా రండీ మీ మిసెస్?" అని విచారం వ్యక్తపరిచాడు విలేఖరి.

"ఎందుకిచ్చిందంటే ఏం చెప్పను? కర్మ అంటారే అది."

"పాపం మీ మిసెస్ చాలా వర్రీ పడుతూ వుండాలి."

"వర్రీ ఏమిటండీ బాబూ! కూడూ నీళ్ళూ లేకుండా అంటారే అట్లా ఏడుస్తూ పడుకుంది."

"చ్....చ్ ..."

"ఇప్పుడేం చెయ్యాలో అర్థం కావటం లేదు."

"డియస్పీగా రేమంటారు?"

"ఏమీ అనడం లేదు నోరెళ్ళబెట్టాడు."

"అవును గదా! అంత ఖరీదు నగ మరి?"

"మేమసలు ఇవ్వలేదంటే ఏం చెయ్యాలి?"

"పెద్దమనిషి అలా అంటాడంటారా?"

"అంతా పెద్దమనుషులే. అందులోను పోలీసోడు."

"అవు నవును...."

"ఏదయినా ఉపాయం చెప్పండి."

"మీరేం వర్రీ కాకండి. మీ మిసెస్ ఆ నెక్లెస్ డియస్పీగారి అమ్మాయికి యిచ్చినట్లు, అది పోగొట్టినట్లు, దాని ఖరీదుతో సహా పేపర్లో న్యూస్ ఐటమ్ వేయిస్తాను. అది రికార్డుగా వుంటుంది. డియస్పీగారు దాన్ని ఖండిస్తే గదా!" నవ్వాడు కిశోర్.

"అయితే మీ వాళ్ళందర్నీ పిలిపించండి. ప్రెస్

కాన్ఫరెన్స్ పెట్టి స్టేట్‌మెంట్ ఇస్తాను" అన్నాడు సాంబ శివరావు.

కిశోర్ ఫోన్ ఎత్తి డయల్ చెయ్యసాగాడు.

6

ఎక్సైజ్ కంట్రాక్టర్ సుబ్బిరెడ్డిగారి అమ్మాయి పెళ్ళిలో డియస్పీగారి అమ్మాయి మెడలోని వజ్రాల నెక్లెస్ దొంగిలించడం గురించి న్యూస్ అన్ని పేపర్లలో ప్రముఖంగా పడింది. ఆ నెక్లెస్ ఖరీదు, అది టొబాకో కంపెనీ ప్రొప్రయిటర్ సాంబశివరావుగారి భార్య దగ్గర అరువు తీసుకున్న వైనం గూడా ప్రచురించారు.

"హమ్మ....జా....కొడకా!" అని కిషన్‌చంద్‌ని నోటికి వచ్చినట్లు తిట్టాడు ఆ వార్త చదివిన జగన్. ఆ మార్వాడీ ఎదురుగా లేడుగాని, వున్నట్లయితే పీక పిసికి చంపాలన్నంత కోపం వచ్చింది.

నాలుగు లక్షలు ఖరీదుచేసే వజ్రాల్ని, ఆర్టిఫిషియల్ అమెరికన్ డైమండ్స్ అని చెప్పి వుట్టినే కొట్టేశాడు.

తనని ఫూల్ చేశాడు.

ఇప్పుడేం చెయ్యడం?

జగన్ తీవ్రంగా ఆలోచించాడు ఏం చెయ్యాలా అని. లక్షలు ఖరీదుచేసే వజ్రాలు చెయ్యి జారిపోయాయనే దిగులుకన్నా, కిషన్‌చంద్ తనని దారుణంగా మోసం చేశాడనే నిజం అతన్ని మండించి వేసింది.

కిషన్‌చంద్‌కి మూడొందల కిలోమీటర్ల దూరంలో చాలా ముఖ్యమయిన పనిమీద ఎంగేజ్ అయి వున్నాడు జగన్. వారం రోజులవరకు అక్కడ్నుంచి కదలలేని పరి స్థితి. వెంటనే వెళ్ళి దబాయిస్తే ఏమయినా రాల్చుకోవచ్చు.

ఏమో? ఏం చెప్పగలం? దొంగసొమ్ము కొనేవాడికి ఎన్ని లావాదేవీలు వుంటాయో? ఈపాటికే దాన్ని రాష్ట్ర సరిహద్దులు, లేదా దేశ సరిహద్దులు దాటించాడేమో? ఒకవేళ వజ్రాలు వాడి దగ్గరే దాచుకున్నా తనకి లొంగుతాడా? నువ్వెవిడివో నాకు తెలీదు అనవచ్చు. దొంగసొమ్ము అమ్మిన తను వాడిని పట్టిగ్గా ఏం చెయ్యలేడు.

జగన్ బుర్ర వేడెక్కిపోయింది. కిషన్‌చంద్ మీద కసి తీర్చుకోవాలి. మళ్ళీ వాడిని కలుసుకుని మరొక నగ అమ్మడానికి తెచ్చానని చెప్తే? తనని లోపలకు తీసుకెళ్తాడు. గది తలుపులు మూసి రాంపూర్ చాకుని గుండెల్లోకి దించితే?

జగన్‌కి ఆ ఐడియా నచ్చలేదు. తను ఆవేశంలో పొడిచి చంపినా తర్వాత ఏం జరుగుతుంది. తను కటకటాలు లెక్కపెట్టాలి. తను ఇరుక్కోకుండా కిషన్‌చంద్ మీద పగ తీర్చుకోవాలి?

జగన్ చాలాసేపు ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చాడు. డియస్పీ ఫోన్ నెంబర్ సంపాదించాడు. పోస్టాఫీస్‌కి వెళ్ళి యస్.టి.డి.లో ఆయనతో స్వయంగా మాట్లాడాడు.

"హలో డియస్పీగారా?"

"యస్."

"మీ అమ్మాయి మెడలో నెక్లెస్ కొట్టేసిన వాడు నాకు తెలుసు."

"వాట్?"

"అవును."

"ఎవరు?"

"ఎవరో తెలుసుకుని లాభం ఏవుందిప్పుడు?"

"వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్? హూ ఆర్ యూ?"

"ఆవేశపడకండి. నెక్లెస్ ఎక్కడుందో చెప్తాను. వెళ్ళి కలెక్ట్ చేసుకోండి."

"ప్లీజ్ చెప్పు."

"షరాబ్ బజార్లోవున్న కిషన్‌చంద్‌కి ఆ నెక్లెస్ అమ్మాడు దొంగ. అయితే ఆ బజార్లోవున్న షాపులో ఆ నెక్లెస్‌లేదు కొత్తపేటలో వున్న అతని బిల్డింగ్‌లో దొరుకుతుంది. వాడు కాలాంతకుడు. అంత తేలిగ్గా మీ నెక్లెస్ దొరకనీడు. సెంట్రల్ ఎక్సైజ్ వాళ్ళతో కలిసి రెయిడ్ చేస్తే దొరకొచ్చు."

"ఎవరు మీరు? ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నారు?"

లైన్ కట్‌అయింది.

7

కిషన్‌చంద్ ఇంటిమీద, షాపుమీద ఏకకాలంలో రెయిడ్ జరిగింది.

లెక్కలో చూపని బంగారు నగలు, వెండి సామాను, వగైరాలతో పాటు వజ్రాల నెక్లెస్ ఒకటి దొరికింది. బంగారు నియంత్రణ చట్టంకింద ఎక్సైజ్ వాళ్ళు అతన్ని అరెస్ట్ చేశారు.

వజ్రాల నెక్లెస్ తనదేనని కిషన్‌చంద్ మొత్తుకున్నాడు. అది దొంగల దగ్గర కొన్నావనీ, పొగాకు వ్యాపారి సాంబశివరావుదనీ, తన కూతురి మెడలో నుంచి కొట్టేసింది ఇదేననీ డియస్పీ దబాయించాడు. ఆ దొంగ ఎవడో చెప్పమని వాయించాడు.

కిషన్‌చంద్ బెయిల్‌మీద రిలీజ్ అయ్యాడు.

దొంగల దగ్గర్నుంచి వజ్రాల నెక్లెస్ కొన్నందుకు కోర్టులో పోలీస్ కేసు పెట్టారు కిషన్‌చంద్‌మీద. లెక్కలో చూపని బంగారం, వెండి, వజ్రాలు వగైరా కలిగివున్న నేరంమీద అతన్ని సెంట్రల్ ఎక్సైజ్ వాళ్ళు ఎడా పెడా వాయించారు. రకరకాల చట్టాలక్రింద కేసుల్లో ఇరుక్కున్న కిషన్‌చంద్ పోలీసులచుట్టూ, కోర్టులచుట్టూ, ప్లీడర్లచుట్టూ, ఎక్సైజ్‌వాళ్ళ ఆఫీసుల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరుగుతున్నాడు.

నకిలీ వజ్రాల నెక్లెస్‌కు బదులు, అసలు వజ్రాల నెక్లెస్ కొట్టెయ్యాలని ఆశపడ్డ సాంబశివరావు తను తీసుకున్న గోతిలో తనేపడ్డాడు. కుడితిలో ఎలుకలా వూపిరాడక వుక్కిరి బిక్కిరయ్యాడు. నాలుగు లక్షలు ఖరీదు చేసే వజ్రాల నెక్లెస్ ఎప్పుడు కొన్నావు? ఏ సంవత్సరం, ఏ నెల, ఏ తేదీన కొన్నావు? అంత లాభం ఏ సంవత్సరంలో వచ్చింది? అసలా నెక్లెస్ ఏ జ్యూవెలరీ షాపులో కొన్నావు? చెప్పునాయానా? చెప్పుతండ్రీ చెప్పు? అంటూ ఇనకమ్‌టాక్స్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు తగులుకున్నారు.

ఇందులోనుంచి ఎట్లా బైటపడాలిరా దేవుడా? రాముడా? అని నెత్తినోరూ బాదుకుంటూ ఇనకమ్‌టాక్సు అధికారుల చుట్టూ, తనని కాపాడే నాయకులచుట్టూ, ఢిల్లీచుట్టూ, పిచ్చికుక్కలా రౌండ్లు కొడుతున్నాడు సాంబశివరావు.

డియస్పీ అతని పెళ్ళాం, పిల్లలు — ఇక జన్మలో ఎరువు నగలు తెచ్చుకోకూడదని గట్టిగా ఒట్టేసుకున్నారు. □

శవం చేసిన హత్య

కె.వి.యస్.యస్.మూర్తి

బీచ్ రోడ్ ప్రక్కగా విసిరివేసినట్లున్న చిన్న బంగళా యిల్లు.

రాత్రి పదిగంటలయింది.

ఆ యింటిముందు పోలీసు వ్యాన్నూ, అంబులెన్సూ వచ్చి ఆగాయి. మరో నిముషం వ్యవధిలో వాటి వెనుక పోలీసు జీపువచ్చి ఆగింది. జీప్‌లోంచి ఇన్‌స్పెక్టర్

సుందరం దిగాడు. హుందాగా అడుగులు వేస్తూ యింటి లోపలకు వెళ్ళాడు.

మిగిలిన బృందం అతడిని అనుసరించింది.

హాలులో పాతిక సంవత్సరాల యువతి వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆమెను దాదాపు ఆ వయసు స్త్రీలే నల్గురు ఓదారుస్తోన్నారు. ఆ నల్గురు స్త్రీలూ లోపలకు వచ్చిన ఇన్‌స్పెక్టర్‌ను చూసి లేచారు. వాళ్ళల్లో ఒక స్త్రీ ముందుకు వచ్చి "రండి యిన్‌స్పెక్టర్!" అంది.

యిన్‌స్పెక్టర్ ఆమె వయిపు చూసి "మీరేనా ఫోన్ చేసింది?" అన్నాడు.

ఆమె అవునన్నట్లు తలవూపింది.

"హత్య ఎక్కడ జరిగింది?"

ఆమె మేడమీదకు చూపించింది. "పైగదిలో!" అంది.

హాలులోవున్న మెట్లమీదనుండి యిన్‌స్పెక్టర్ ఆమె చూపించిన గదిని చేరుకొన్నాడు.

అది చాలా పెద్దగది. డ్రాయింగ్ రూమ్.

గది మధ్య గుండ్రటిబల్ల. దాని చుట్టూ నాలుగుకుర్చీలు. ఒక కుర్చీలో వెనక్కు వాలిపోయి వున్నాడు హతుడు. ముప్పయి వుంటుంది అతడి వయసు. మనిషి అంద వికారం నే చెప్పొచ్చు. అసలే కళలేని మొహం ప్రేతకళ రావటంతో మరీ వికృతంగావుంది. బల్లమీద రెండు గ్లాసులూ, విస్కీసీసా, మిగిలిన సరంజామావుంది.

ఛాతీలోంచి దూసుకుపోయి వుంది కత్తి.

ఇన్‌స్పెక్టర్ సుందరం శవాన్ని ఒక్కసారి చూసి పోలీస్ సర్జన్ వయిపు చూశాడు.

సర్జన్ శవాన్ని పరీక్షచెయ్యటంలో మునిగిపోయాడు.

వేలిముద్రల నిపుణుడు బాబూరావు తన పని మొదలు

పెట్టాడు. ఫొటోగ్రాఫర్లు శవాన్నీ, ఆ పరిసరాలనూ వివిధ కోణాలలోంచి ఫొటోలు తీస్తోన్నారు.

"మరణం ఏడున్నర, ఎనిమిది మధ్యలో జరిగి వుండొచ్చు." అన్నాడు పరీక్ష పూర్తిచేసి—సర్జన్.

"హత్యకు కారణం ఆ కత్తిపోటేనా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ సుందరం - శవం ఛాతీలోవున్న కత్తిని చూపించి.

"అవును. కత్తి సరిగ్గా గుండెల్లోకి దిగింది. క్షణాల్లో ప్రాణంపోయి వుంటుంది. బాగా ఆరితేరిన హంతకుడు ఈ పని చేసుండాలి. అంత సూటిగా గుండెల్లో కత్తి దిగేటట్లు పొడవటానికి నేర్పరితనమయినా కావాలి, అవయవ నిర్మాణం బాగా తెలిసేనా వుండి వుండాలి" అన్నాడు సర్జన్.

"హంతకుడు! అంటోన్నారు, ఏ ఆధారం వలన?"

"సారీ! హంతకురాలయినా కావచ్చు!"

ఇన్‌స్పెక్టర్ తలవూపాడు.

"సార్ గ్లాసుల మీద యిద్దరి వ్రేలిముద్రలున్నాయి. ఒక వ్రేలిముద్రలు హతుడివి. మరోరకం వ్రేలిముద్రలూ, హత్యాయుధం మీద వ్రేలిముద్రలూ ఒకరివే" అన్నాడు బాబూరావు.

మరో పావుగంటలో శవాన్ని మార్చురీకి తరలించారు.

ఇన్‌స్పెక్టర్ హాలులోకి వచ్చాడు.

"మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తూన్నందుకు క్షమించండి!" అంటూ తన రొటీన్ ఇన్వెస్టిగేషన్ ప్రారంభించాడు.

హతుడి పేరు రంగధామారావు. కాంట్రాక్టులు చేస్తూ వుంటాడు. విక్టరీ సినీమాహాలులో పార్ట్‌నర్. ఆయన భార్యపేరు సుధ. మంచి అందగత్తె. కాకి ముక్కుకు

దొంగపండు.

"జరిగిందేమిటో చెప్పండి?" సుధవయిపు చూసి అడిగాడు సుందరం.

సుధ ఒక నిముషం ఏడుపు ఆపుకునే ప్రయత్నం చేసింది. తర్వాత కళ్ళు తుడుచుకొంటూ "మేము అయిదుగురం ఫస్టుషో సినీమాకు వెళ్ళాం. వద్దంటోంటే వీళ్ళు నన్ను బలవంతంగా లాక్కుపోయారు. నేను వెళ్ళకపోయినా బావుణ్ను! సినీమా నుంచి వచ్చి చూసేటప్పటికి...." వెక్కిళ్ళ మధ్య మాటలు ఆగిపోయాయి.

"సారీ!" అన్నాడు సుందరం. "ఏ సినీమాకు?"

సుధ బదులుగా యిందాకా ఇన్‌స్పెక్టర్‌కు స్వాగతం పలికిన అమ్మాయి సమాధానం చెప్పింది. "విక్టరీలో ఖుర్బానీ ఆడుతోంది. దానికి వెళ్ళాం" అంది.

"మీరు బయటకు వెళ్ళేటప్పుడు ఇంట్లో రంగధామారావుగారు ఒక్కరే వున్నారా?"

"లేదు. ఆయన స్నేహితుడు మాధవరావుగారు కూడా వున్నారు. ఇద్దరూ కలసి డ్రింక్సు తీసుకుంటోన్నారు. ఎలానూ అది ముగిసేటప్పటికి ఆలస్యం అవుతుంది కదా. అని, వీళ్ళంతా బలవంతం చేస్తే సినీమాకు వెళ్ళాను" చెప్పింది సుధ.

తను హత్యా సమయంలో యింట్లో లేనట్టూ, అందుకు తన నల్గురు స్నేహితురాళ్ళూ సాక్ష్యం అన్నట్టూ వున్నాయి ఆమె మాటలు. ఆ అర్థాన్ని గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు ఇన్‌స్పెక్టర్‌కు.

ఇన్‌స్పెక్టర్ తలవూపి "మీవారికి ఎవరయినా విరోధులు వున్నారా!"

సుధ మాట్లాడలేదు.

"మీరు మౌనంగా వుంటే హంతకుడు దొరకడు. దయచేసి సహకరించండి" రెట్టించాడు ఇన్‌స్పెక్టర్ సుందరం.

"నాకు తెలిసినంతవరకు ఆయనకు ఎవరూ విరోధులు లేరు. ఆయన చాలా మంచివారు" చెప్పింది సుధ.

"మీవారితో డ్రింక్ చేసిన మాధవరావు ఎలాంటి వాడు?"

సుధ మొహం అప్రసన్నంగా మారిపోయింది. "అతడి గురించి నాకు అట్టే తెలియదు" అంది.

ఆమె ఏదో దాస్తోందనిపించింది ఇన్స్పెక్టర్‌కు. "రంగ ధామారావును మనకు తెలుసున్నంతలో ఆఖరుసారిగా చూసినవాడు మాధవరావు. మేము అతడిని కల్సుకోవాలి. దయచేసి అతడి అడ్రస్ చెప్పండి" అన్నాడు.

"మహారాణిపేట. పంజారోడ్డు. నాలుగో యిల్లు."

ఇన్‌స్పెక్టర్ సుందరం—సార్జంటు వయిపు చూసి "నువ్వు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణను తీసుకుని ఆ యింటికి వెళ్ళు. మాధవరావును అరెస్టుచేసి తీసుకురండి. బాబూరావును అతడి వ్రేలిముద్రలు తీసుకోమను. బహుశ, అవే వ్రేలిముద్రలు మన హత్యాయుధంమీద వుంటాయి. నేను ఈ చుట్టుప్రక్కల యిన్వెస్టిగేట్ చేసి వస్తాను. ఎంత లేటయినా సరే మాధవరావును మాత్రం రాత్రికిరాత్రే అరెస్టు చెయ్యండి. నేను వచ్చేదాకా ఇన్‌స్పెక్టర్ సత్య నారాయణను స్టేషన్‌లోనే వుండమను" అన్నాడు.

సార్జంటు స్వామి, అతడికి సెల్యూట్ చేసి వెళ్ళి పోయాడు.

ఇన్‌స్పెక్టర్, సుధ స్నేహితురాళ్ళ గురించి తెలుసు కున్నాడు. వారితో విడివిడిగా మాట్లాడాడు.

ఆ నల్గురి పేర్లూ శ్యామల, దీప్తి, రాణి, సరోజ.

శ్యామల భర్త మెడికల్ రిప్రజంటేటివ్.

సరోజ, ఎమ్మార్వో భార్య.

దీప్తికి, రాణికి పెళ్ళిళ్ళు కాలేదు. రాణి, జి. హెచ్‌లో నర్స్‌గా పనిచేస్తోంది. దీప్తి కాన్వెంటులో పనిచేస్తోంది.

ఆ నల్గురు చెప్పిందీ ఒక్కలాగానే వుంది.

"మాధవరావు మంచివాడు కాదు. అతడికన్ను సుధ మీద పడింది. స్నేహితుడి భార్య అని అయినా ఆలోచించకుండా, ఆమెతో రెండుసార్లు అసభ్యంగా ప్రవర్తించాడు. సుధ భర్తతో ఆ విషయం చెప్పుకోలేక స్నేహితురాళ్ళ వద్ద చెప్పుకుని కుమిలి కుమిలి ఏడ్చింది ఇటువంటివి ఆట్టేకాలం దాగవు. బహుశః, రంగధామారావుకు తెలిసి వుంటుంది. మిత్రుడిని మందలించి వుంటాడు. మాటా మాటా పెరిగి వుంటుంది. దాంతో రంగధామారావుని మాధవరావు చంపేసి వుంటాడు."

వాళ్ళు చెప్పిందీ విని ఇన్‌స్పెక్టర్ సుందరం ఒక నిశ్చయానికి వచ్చేశాడు.

మరో రెండు గంటలు ఖర్చుచేసి ఆ చుట్టుప్రక్కల యిళ్ళలో ఇన్వెస్టిగేట్ చేసి యింకా విలువయిన సమాచారాన్ని సేకరించాడు.

"రంగధామారావుకు, సుధకు అసలు పడదు. చాలాసార్లు యిద్దరూ పెద్ద గొంతుకలతో అరుచుకొన్నారు. నన్ను చంపి నీ యిష్టమున్న వాడితో కులుకుదామని నీ వుద్దేశ్యం - అని భార్యను చితకబాదేవాడు. సుధకు మాధవరావుతో అక్రమ పరిచయం వుంది."

రాత్రి రెండవుతూండగా ఇన్‌స్పెక్టర్ సుందరం స్టేషన్‌కు తిరిగి వచ్చాడు.

అక్కడ సార్జంట్ స్వామి అతడికోసం ఎదురుచూస్తు న్నాడు.

"అరెస్టు చేశారా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ సుందరం.

"లేదు సార్! మనకు ఆ అవకాశం లేదు" అంటూ తను మాధవరావు గురించి వెళ్ళిన దగ్గరనుండి జరిగిన విషయాలన్నీ వివరించాడు స్వామి.

అదంతా విన్న ఇన్‌స్పెక్టర్ భృకుటి ముడిపడింది.

"నువ్వు చెప్పిన విషయం ఎవరికి తెలుసు?" అన్నాడు.

"ఎక్కువ మందికి తెలిసే అవకాశం లేదు సార్."

"సత్యనారాయణ ఎక్కడ వున్నాడు?"

"అక్కడే వున్నారు సార్."

"రేపు మధ్యాహ్నం వరకు విషయం బయటకు పొక్క కూడదు" అని "యింతకూ అతడిగురించి ఏమయినా వివ రాలు సేకరించారా?" అన్నాడు.

"పూర్తిగా తెలియదు సార్! కానీ అతడికి, రంగ ధామారావు—బలరామరాజు—ఈ యిద్దరే బాగా స్నేహి తులు సార్. బలరామరాజు విక్టరీ సినీమాహాలు ప్రొప్రయి టర్. వీళ్ళిద్దరికీ కూడా దానిలో షేర్లున్నాయి" అన్నాడు.

"పద. మనం అక్కడకు వెళదాం!" అంటూ జీపెక్కాడు సుందరం.

2

కాలింగ్‌బజర్ చప్పుడయ్యేటప్పటికి విసుక్కుంటూ ప్రక్కమీద నుండి లేచింది శ్యామల. బద్ధకంగా వళ్ళు విరుచుకొని తలుపుతీసింది. ఎదురుగా నిలబడి వున్న ఇన్‌ స్పెక్టర్‌ని చూడగానే ఆమె బద్ధకమంతా ఎగిరిపోయింది.

"గుడ్‌మార్నింగ్! మిమ్మల్ని డిస్టర్బ్ చేశానా?"

అన్నాడు ఇన్‌స్పెక్టర్ సుందరం.

శ్యామల మొహానికి నవ్వు పులుముకుంది. "రండి! ఫర్వాలేదు" అంది.

ఇన్‌స్పెక్టర్ సుందరం లోపలకు వచ్చి కూర్చొన్నాడు.

"ఏమిటి ఇంత ఉదయాన్నే ఇలా వచ్చేశారు!" అంది శ్యామల.

"ఏమీలేదు. రంగధామారావు హత్య విషయంలో మరికొంత ఇన్‌ఫర్మేషన్ కావలసి వచ్చింది."

"ఏం మాధవరావును అరెస్టు చెయ్యలేదా?"

"అరెస్టు చేశాం!"

"మరి?"

"మాధవరావుకు మీ సుధ యేమయినా సహాయపడిందేమోనని?"

శ్యామల మొహం ఎర్రబడింది "మీకా అనుమానం ఎందుకు వచ్చింది?" అంది కోపంగా.

"ఆ చుట్టుప్రక్కలవారు ఆమె గురించి చెప్పింది, మీకు భిన్నంగా వుంది. అందుకని.........క్లారిఫికేషన్‌కు వచ్చాను" అన్నాడు సుందరం.

"అడగండి!"

"ఆ భార్యాభర్త లిద్దరూ అన్యోన్యంగానే వుండేవారా!"

"సుధ చాలా మంచిపిల్ల. బీద కుటుంబం నుండి వచ్చింది. పెళ్ళిచేసే స్తోమతులేక ఆమెను అంద వికారి అయిన రంగధామారావుకు యిచ్చి చేశారు. ఆమె తనను ప్రేమించటం లేదేమో—అన్న అనుమానం అతడికి వుంది. రానురానూ అది ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుగా

మారిపోయి, అతడు సుధను అనుమానపడుతోన్నాడు. అందుకే మాధవరావు వేసే వెలికివేషాలను ఆమె తన భర్తకు తెలుపలేకపోయింది. ఇంటి చుట్టు ప్రక్కలవాళ్ళు సుధకు మాధవరావుకూ అక్రమసంబంధాన్ని అంటగట్టి చెవులు కొరుక్కొంటున్నారని సుధ నాతో చెప్పి ఏడ్చింది."

సుందరం తలవూపాడు. "మీ స్నేహితురాళ్ళు ముగ్గురూ ఎటువంటివారు?" అని అడిగాడు.

"చూడండి ఇన్‌స్పెక్టర్‌గారూ! మా అయిదుగురికి దాపరికాలు లేవు. ఒకరి విషయాలను మరొకరితో—కొంచెం సిగ్గువిడిచి చెబుతున్నాని మరోలా అనుకోకండి—పడకటింటి రహస్యాలను కూడా చెప్పుకొంటాం!"

ఇన్‌స్పెక్టర్ చిన్నగా నవ్వి "సరే మరో ప్రశ్న. బాగా ఆలోచించి చెప్పండి. నిన్న సినీమాహాల్లో మీరు అయిదుగురూ చివరిదాకా వున్నారా? మధ్యలో ఎవరయినా బయటకు వెళ్ళారా? తొందరపడకండి. నిదానంగా ఆలోచించి చెప్పండి" అన్నాడు.

శ్యామల రెండుక్షణాలు కళ్ళు మూసుకుని ఆలోచించింది. "అవును, మీరు అడుగుతోంటే గుర్తొచ్చింది. ఇంటర్వెల్ పదినిముషా లుండనగా రాణి బయటకు—ఐమీన్—టాయిలెట్‌కు వెళ్ళింది" అంది.

"మళ్ళీ ఎప్పుడు వెనక్కువచ్చింది?"

"సరిగా గుర్తులేదు. మళ్ళీ తిరిగి వచ్చేసినట్లుంది. కానీ ఇంటర్వెల్‌లో మాకు లోపలకు అయిదు డ్రింకులు వచ్చాయి. వాటివెనుకే బలరామరాజుగారు వచ్చి సుధను పలకరించారు. తిరిగి డ్రింకులు బయటకు వెళ్ళిపోతోన్నప్పుడు కాటిలు చూశాను, ఒక సీసాలో అడుగున డ్రింకు మిగిలిపోయి వుంది. అలా త్రాగటం రాణి అలవాటు.

కాబట్టి రాణి లోపలకు వచ్చిందనే అనుకొంటాను....”
అంది.

ఇన్‌స్పెక్టర్ సుందర్ గమ్మత్తుగా తలెగరేశాడు. “మిగిలిన మీ ముగ్గురు స్నేహితురాళ్ళూ రాణి గురించి ఇలానే చెప్పారు. అంటే రాణి బదులుగా ఇంటర్వెల్‌లో ఆమే తాగింది—అని మిమ్మల్ని భ్రమింప చెయ్యటానికి మీ కందరికీ కనిపించేలా ఆ డ్రింకు బాటిల్ని ప్రదర్శించారన్నమాట” అన్నాడు.

“అయితే రాణి....?” ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టింది.

“ఏ విషయం ఇప్పుడు చెప్పలేను. మీరు రాణిని నిశ్చయంగా ఎప్పుడు చూశారు?”

“ఇంటర్వెల్ అయిన తర్వాత పదినిముషాలకు అనుకుంటా. తెగ వాగటం మొదలు పెట్టింది. అనవసరం లేని వాటికి కూడా తెగ కామెంట్ చేసింది—” అంది.

ఇన్‌స్పెక్టర్ సుందరం ఆమెకు కృతజ్ఞతలు చెప్పి, అక్కడనుండి తిన్నగా విక్టరీ సినిమాహాలుకి వెళ్ళాడు.

ఏదో క్రొత్త సినీమా కాబోలు. మార్నింగ్‌షోకు జనం ఎగబడుతోన్నారు.

జీపును పార్కింగ్ స్పేస్‌లో ఆపి మెయిన్ ఎంట్రన్స్ వయిపు వెళ్ళాడు సుందరం.

సుందరాన్ని చూడగానే అప్పటివరకూ గేటు దగ్గర వున్న మనిషి చటుక్కున ప్రక్కకు తప్పుకున్నాడు.

“మీ ప్రొప్రయిటర్‌గారున్నారా?....” అడిగాడు సుందరం.

“ఉన్నారు.”

సుందరం తిన్నగా ‘ప్రొప్రయిటర్’ అని వ్రాసివున్న

గదిలోకి వెళ్ళాడు.

"నమస్కారం సార్! రండి ఎన్ని టిక్కెట్లు?" అన్నాడు బలరామరాజు

"టిక్కెట్ల కోసం నేను రాలేదు. రంగధామారావు హత్య గురించి పరిశోధన చేస్తోన్నాను" అన్నాడు సుందరం.

బలరామరాజు విచారంగా మొహం పెట్టాడు."నిజంగా అతడు పోవటం చాలా దురదృష్టం. అవును. మాధవ రావును అరెస్టు చేశారటగా?" అన్నాడు బాధగా.

సుందరం తలవూపాడు.

"రంగధామారావు పోయాడన్న బాధకన్నా, వాడిని మాధవరావు చంపాడన్న బాధ నన్ను పిచ్చివాడిని చేస్తోంది. ఒక మిత్రుడు పోయాడు. మరో మిత్రుడు చట్టం సంకెళ్ళలో ఇరుక్కున్నాడు" బలరామరాజు కళ్ళలో నీళ్ళు తిరిగాయి

"వాళ్ళిద్దరూ మీ హాలులో పార్టనర్సటగా?"

"అవును."

"మీరు నిన్న రాత్రి ఏడూ ఎనిమిది మధ్య ఎక్కడ వున్నారు?"

"రాత్రి ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్లు వచ్చారు. ఆరున్నర దగ్గర నుండి తొమ్మిది వరకు వాళ్ళతోనే ఈ గదిలోనే వున్నాను" ఇన్స్పెక్టర్‌వయిపు అదోలా చూస్తూ చెప్పాడు బలరామరాజు.

"మధ్యలో ఎక్కడకూ కదలలేదా?"

"ఫస్టుషో ఇంటర్వెల్‌లో ఒకసారి హాలులోకి వెళ్లాను. రంగధామం భార్య ఆమె స్నేహితురాళ్ళు మరో నల్గురూ సినీమాకు వచ్చారు. వాళ్ళకు డ్రింకులు సర్వ్ చేయిం

దాను."

"ఆ టయిములో ఆ అయిదుగురూ హాలులోనే వున్నారా?"

"ఆ! హాలులోనే వున్నారు."

"థాంక్యూ వెరీమచ్!" అంటూ సుందరం బయటకు వచ్చేశాడు. మళ్ళీ అయిదు నిముషాల్లో లోపలకు వచ్చాడు.

అప్పుడే బలరామరాజు ఎవరితోనోమాట్లాడుతున్నాడు. ఇన్‌స్పెక్టర్ని చూసి ఫోన్ కట్ చేశాడు.

"సారీ ఫర్ ది ఇన్‌కన్వీనియన్స్. మిమ్మల్ని అసలు విషయం అడగటం మర్చిపోయాను...." అన్నాడు సుందరం.

"ఫర్వాలేదు అడగండి."

"మాధవరావు ఎటువంటివాడు?"

"స్వతహాగా మంచివాడే! కానీ రంగధామంతో ఈ మధ్య కొంచెం డిఫరెంటుగా వుంటున్నాడు."

"ఎందుకో తెలుసా?"

"మామూలుగా అయితే చెప్పకపోదును. కానీ యిది పోలీసు వ్యవహారం. పయిగా హత్య జరిగింది. అందుకు మీకు వున్న విషయం వున్నట్టుగా చెబుతాను."

"థాంక్స్! చెప్పండి."

"వాళ్ళిద్దరూ సుధ విషయంలో ఘర్షణ పడినట్లున్నారు."

"రంగధామారావును మాధవరావు హత్యచేసి వుండొచ్చా?"

"ఏం చెప్పగలం సార్! అయినా హత్యాయుధం మీద వేలిముద్రలు మాధవవేట కదా?" అన్నాడు బలరామరాజు.

"అఫ్‌కోర్స్! కేసు బలంగా వుండటానికి సాక్ష్యాలు సేకరిస్తున్నాను" అని చెప్పి, అతనికి మరోసారి కృతజ్ఞతలు చెప్పి బయటకు వచ్చి జీపు ఎక్కాడు ఇన్‌స్పెక్టర్ సుందరం

అతడి దృష్టి గేటువద్ద వున్న మనిషి మీద పడింది. అతడిని దగ్గరకు రమ్మని పిలిచాడు. అతడు భయపడుతూ ఇన్‌స్పెక్టర్ వద్దకు వచ్చాడు దాదాపు అరవయి సంవత్సరాలు వుండొచ్చు.

"నీ పేరేమిటి?" అడిగాడు సుందరం.

"వీరయ్య సార్!"

"నిన్న ఫస్టుషోకు గేటు దగ్గిర నువ్వే వున్నావా?"

"వున్నాను సార్!"

"ఇంటర్వెల్‌లో జనం బయటకు వెళ్ళటానికి గేటు తలుపులు తీస్తారా?"

"తియ్యం సార్!"

"నిన్న ఏడు గంటల తర్వాత ఎందుకయినా గేటు తీశావా?"

వీరయ్య రెండు నిముషాలు ఏదో గుర్తు చేసుకొన్నాడు. "అవును సార్. ఇంటర్వెల్‌కు పదినిముషాల ముందు ఎవరో ఒక ఆవిడ బయటకు వెళ్ళారు సార్!" అన్నాడు.

"ఆమె ఎలా వుంది?"

"ఆమె కారులోవుంది సార్. నేను సరిగ్గా చూడలేదు. గేటు దగ్గిరకు వచ్చి అర్జంటుగా యింటికి వెళ్ళాలి. మళ్ళీ ఓ పావు గంటలో వస్తాను" అంది సార్.

"మళ్ళీ ఎంతసేపట్లో వచ్చింది?"

"ఇంటర్వెల్ అయిపోయాక సినిమా స్టార్టయ్యాక

వచ్చింది సార్."

"అప్పుడయినా ఆమెను చూశావా?"

"ఆమెను చూడలేదు సార్. కారు పార్కు చేసి గబ గబా లోపలకు వెళ్ళిపోయింది సార్."

"పోనీ ఆమె కట్టుకున్న చీర?"

"ఎర్రచీర సార్!"

"సినీమా అయ్యాక ఆమె అదే కారులో బయటకు వెళ్ళిందా?"

వీరయ్య ఆశ్చర్యంగా మొహం పెట్టాడు. "అదే విచిత్రం సార్! సినిమా అయ్యాక ఆ కారులో యిద్దరు వెళ్ళారు సార్. ఆయనది పెద్ద వయసు. ప్రక్కన ఆయన భార్య కాబోలు. లావుగా వుంది సార్. ఆమెకూ ఈమెకూ అసలు పోలికే లేదు."

"వెరీ గుడ్! నేను ఈ విషయం అడిగేనని ఎవరికీ చెప్పకు" అంటూ జీప్ స్టార్ట్ చేశాడు.

3

ఇన్‌స్పెక్టర్ సుందరం స్టేషన్‌కు వచ్చేటప్పటికి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అతడి గురించి ఎదురు చూస్తు న్నాడు.

"ఎనీ న్యూస్?" అడిగాడు సుందరం.

"చాలా విషయాలు తెలిసాయి సార్! ఆ నర్సురాణికీ, విక్టరీ బలరామరాజుకీ పరిచయం వుంది సార్! పెళ్ళి చేసుకోకపోయినా భార్యాభర్తలలాగే ప్రవర్తిస్తారట. రాణి మాధవరావు చేతిలో భంగపడింది. మాధవరావు సుధను నిజంగానే ప్రేమించాడట. కానీ దురదృష్టం కొద్దీ ఆమె పెళ్ళి ఒక కురూపితో జరిగింది. బలరామరాజు థియేటర్ అకౌంట్సు విషయంలో స్నేహితులిద్దర్నీ మోసం చేశాడట.

ఆ విషయంలో మొన్న వాళ్ళ మధ్యన ఘర్షణ జరిగింది" అన్నాడు గుక్క తిప్పుకోకుండా

"అంతే కాదు. అతడు రాణిని బాగా వాడుకున్నాడు. రాణికి మాధవరావు మీద బాగా కోపం. అందుకని ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టు - బలరామరాజు, మాధవ రావు వ్రేలిముద్రలున్న కత్తిని సంపాదించాడు. రాణి రబ్బర్ గ్లవుజ్ చేతులకు వేసుకుని తిన్నగా రంగధామా రావు యింటికి వెళ్ళి కత్తిమీద వ్రేలిముద్రలు పడకుండా అతడి గుండెల్లో దింపింది. తనకున్న పరిజ్ఞానం ఆమెకు అందుకు పని చేసింది. గుండె ఎక్కడుంటుందో కచ్చిత మయిన అంచనా ఆమెకు తెలుసు. అందుకు ప్రతిగా రాణిని పెళ్ళి చేసుకొంటానన్నాడు బలరామరాజు. ఇందుకు నేను బలమయిన సాక్ష్యాలు సంపాదించాను" ఒక్క నిముషం చెప్పటం ఆపాడు సుందరం.

సత్యనారాయణ మౌనంగా అతడు చెప్పింది వింటు న్నాడు.

"రాణి నిన్న ఎర్రచీర కట్టుకుంది; గేట్ మాన్ వీరయ్య ఆ సంగతిని బలపరిచాడు। ఆమె తీసుకెళ్ళిన కారు మరో థియేటర్ ఓనర్ది. బలరామరాజు అతడిని ఒకసారి కారడిగి రాణిని ఆ కారులో పంపాడు. రాణికి డ్రయివింగ్ వచ్చు. కారు ఓనరు ఈ విషయంలో మనకు సాక్ష్యం యిస్తాడు" అన్నాడు సుందరం.

మరో అయిదు నిముషాలు పోయాక సుందరం తన బలగంతో బలరామరాజు యింటికి బయలుదేరాడు.

ముందు బలరామరాజు బుకాయించాడు.

"సారీ రాజూ। నువ్వు ప్లాన్ బాగానే వేశావు. కానీ దురదృష్టం నిన్ను వెంటాడింది. మాధవరావు గుండెల్లో

నొప్పిగా వుందని రంగధామారావు యింటి నుండి బయటకు వచ్చేశాడు. ఇంటివరకూ వెళ్ళకుండానే బీచ్ రోడ్‌లో మరణించాడు. రాత్రి మావాళ్ళు అతడి శవాన్ని కనుగొన్నారు. అతడి మరణం అరున్నరకు గుండె ఆగిపోవటం వలన సంభవించింది. రంగధామారావు హత్య ఏడున్నర తరవాత జరిగింది. శవాలు హత్యలు చెయ్యవుగా. అందులోనూ ఆరుంబావుకు అతడు బయటకు వస్తోంటే పక్కింటివాళ్లు చూశారు" అంటూ వివరించి చెప్పాడు సుందరం.

బలరామరాజు మవునంగా తలవంచుకొన్నాడు.

"రండి! అక్కడ లాకప్‌లో రాణి మీ కోసం ఎదురు చూస్తూ వుంటుంది!" అంటూ అతడి చేతులకు బేడీలు వేసి జీపెక్కించాడు ఇన్‌స్పెక్టర్ సుందరం. □

నేరస్థుల లీలలు!!



మినీ సీరియల్

వి.యస్.రావ్

బీజాక్షరాలు

కృత్తివాసరావు తాళంతీసి. తలుపుతోసి లోపలికి ప్రవేశించాడు. వెనక్కి తిరిగి తలుపుమూసి లోపల్నుంచీ తాళంవేశాడు. చీకటి నల్లటి దుప్పటిలాగా అతన్ని చుట్టేసింది. అయిదుగంటలనుంచీ తలుపులూ, కిటికీలూ, అన్నీ

మూయబడిన హాల్లో వెచ్చగావుంది. కాసేపట్లో ఆ వెచ్చదనం వేడిగా మారుతుంది....

కృత్తివాసరావు పక్కకి జరిగాడు. అతని చెయ్యి, చీకట్లో గురి తప్పకుండా స్విచ్చిని తాకింది. క్షణకాలం కన్నుగీటి ఫ్లోరసెంట్ ట్యూబు వెలిగింది. అతను ఒకసారి హాలుని కలయజూశాడు. రెండువేపులా వరసలుగా పెట్టిన పన్నెండు కుర్చీలు ఖాళీగావున్నాయి. వాటి ముందున్న పన్నెండు టేబుల్స్‌మీదా 'ఇన్' 'ఔట్' ట్రేలున్నాయి. ఉదయం పదినుండీ సాయంత్రందాకా అలజడితో నిండి సజీవంగా అవుపించే ఆఫీసు ఇప్పుడు స్మశానంలా వుంది.

గుమ్మానికి కుడివైపునవున్న తన సీటువైపు అతను కదిలాడు. టేబుల్‌ముందు కుర్చీలో కూచోబోతూ, ఆగి గోడకివున్న ఫ్యాన్ స్విచ్చినొక్కాడు. సీలింగ్‌ఫ్యాన్ తిరగడం ప్రారంభించింది. అతను కుర్చీలో కూచున్నాడు. వారం రోజులుగా తనులేడు. ఎవరో తన టైప్‌రైటర్ని బల్లమధ్యకి తోశారు. ముందుకి వొంగి అతను టైప్ రైటర్ని దగ్గరగా లాక్కున్నాడు.

టేబుల్ సొరుగు లాగాడు. శలవులో వెళ్ళేముందు తను ఒకరీము పేపర్లబొత్తిని సొరుగులో వుంచాడు. అయితే, ఇప్పుడు రెండు డజనులకన్నా తక్కువగానే వున్నాయి పేపర్లు. ఆఫీసులో అన్నిసీట్లకన్నా తనసీట్లో, రెండో టైపిస్టు రజనిసీట్లో వైట్‌పేపర్స్ ఎక్కువగా ఖర్చవుతాయి. అయినా ఆఫీసులో స్టేషనరీ అందరికీ పుష్కలంగా సప్లై చేయబడుతుంది. అయినా తన కోటా పేపర్లని ఎవరో కాజేశారు; తను లేనప్పుడు!

కృత్తివాసరావు నిట్టూర్చాడు. పేపర్లు ఎవరు కొట్టేశారో అతనికి తెలుసు. గుమాస్తా గురుమూర్తి. తన కోటా

పేపర్లనేకాకుండా, ఏమరుపాటునవున్న ఉద్యోగుల కోటాని అతను గుట్టుచప్పుడు కాకుండా కొట్టుకుపోతాడు. ఆరో క్లాసు చదువుతున్న కొడుక్కి నోట్ బుక్కులుగా కుట్టిస్తాడు. కొడుకు ఆ పుస్తకాల్లో పెన్సిల్ గీతలు పెట్టి, బజ్జీలకొట్లో అమ్మేస్తాడనీ కృత్తివా రావుకి తెలుసు!

నవ్వుకుంటూ అతను నాలుగు వైట్ పేపర్ల మధ్య మూడు కార్బనులు సర్ది జాగ్రత్తగా టైప్‌రైటలోకి జొప్పించి, లెవెల్ సరిచేశాడు. సాలోచనగా కుర్చీలో వెనక్కివాలాడు....

తను టైప్ చేయబోయే రిపోర్టు దాదాపు పదిహేను పేజీలవుతుంది. 1 + 3 అవుతే, తనకి సుమారు అరవై పేపర్లుకావాలి. ఎంతో ఆలోచించి. ఎంతో తెగించి తను తయారుచేయబోతున్న రిపోర్టుమీద కొంతమంది జీవితాలు ఆధారపడి వున్నాయి. ముఖ్యంగా ఆ వ్యక్తి భవిష్యత్తు దానిమీద బాలెన్సవుతుంది. అయినా తప్పదు....

కృత్తివాసరావు ఆలోచిస్తూ టైప్‌రైటర్ పక్కనే తను తీసి వుంచిన తెల్లకాగితాల్ని లెక్కపెట్టాడు. పద్దెనిమిది. టైప్‌రైటర్లో పెట్టినవాటితో కలిపి ఇరవైరెండు. తన కింకా ముప్పైఎనిమిది షీట్లు కావాలి. గురుమూర్తిలాగే తనిప్పుడు ఇతర్ల సొరుగుల్లో పేపర్లని తీసుకోవాలి నవ్వుకుంటూ అతను లేచాడు. అప్రయత్నంగా గురుమూర్తి టేబుల్ వేపు నడిచాడు

సొరుగులాగాడు. తెల్లకాగితాల దొంతర అతనికి దర్శనం ఇచ్చింది. ఇవాళ గురుమూర్తి సంచీ తెచ్చుకున్నట్టులేదు. తెచ్చుకునివుంటే ఈ కాగితాలు ఇక్కడ వుండేవికావు! ఎంత చదువుకున్నా ఎంత ఉద్యోగంచేసినా, ఎంత జీతం తీసుకున్నా, మనుషులు ఎదగాల్సినంతగా

ఎదగరు. తేరగా వస్తూంటే తమకి అవసరంలేని వస్తువుల్ని కూడా దోచుకుని, దాచుకుంటారు! నవ్వుకుంటూ అతను తెల్లకాగితాల్ని అందుకుని తన టేబుల్‌వైపు— నడిచాడు. కుర్చీలో కూచుని సాలోచనగా కళ్ళు మూసుకున్నాడు.

తను రిపోర్టులో రాయాల్సిందంతా బుర్రలో సుళ్ళు తిరుగుతోంది. ఏ కాగితాన్నీ రిఫర్ చేయాల్సిన అవసరం లేదు. మొత్తం తన బుర్రలోంచీ వేళ్ళ కొసల్లోకి దూసుకుంటూ వెళ్తుంది. అక్షరాలుగా మారి కాగితాలమీద ప్రత్యక్షమవుతుంది!

ఈ రిపోర్టువల్ల తను సాధించబోయేదేమిటో అతనికి తెలీదు ఉద్యోగపరంగా. ఆర్థికంగా తనకి ఏమేలూ జరక్కపోవచ్చు. కానీ తనికి ఆ రెంటింటికన్నా అమూల్యమైంది దొరుకుతుంది: మనశ్శాంతి!

కృత్తివాసరావు కళ్ళు మూసుకున్నాడు. రిపోర్టులో మొదటిపేరాని నెమ్మదిగా నెమరువేసుకున్నాడు. మెల్లిగా కళ్ళుతెరిచి టైప్‌రైటర్ని పేపర్ని చూశాడు. అతని రెండు చేతులూ టైప్‌రైటర్ కీస్ వైపుకదిలాయి....

కృత్తివాసరావు ఉలిక్కిపడ్డాడు. అతని చేతులు వాళ్ళోకి జారాయి. అతని చూపులు హాలు చివర ఎదురుగా వున్న మూసిన తలుపుమీద పడ్డాయి. ఆ తలుపు తెరుచుకుని డైనింగ్ రూమ్‌కీ, లావెటరీస్‌కీ, స్టేషనరీ స్టోర్ చేసిన రూమ్‌కీ, స్టాఫ్ రిక్రియేషన్ క్లబ్‌గా వున్న మరో చిన్న హాలుకీ వెళ్ళొచ్చు.

తలుపు మెల్లిగా వెనక్కి జరుగుతోంది. కృత్తివాసరావు గుండె దడదడ కొట్టుకుంది. ఎవరేనా తలుపుని

లాగుతున్నారా? వెనకవైపున్న హాలూ, రూములూ — అన్నింటినీ మూసేసి, ఆ గుమ్మం తలుపుని ముందుకిలాగి, గొళ్ళెం బిగించి, మెయిన్‌డోర్ లాక్‌చేసి వెళ్తారు మామూలుగా. అతను కళ్ళు చిట్లిస్తూ కదుల్తున్న తలుపువయిపు చూశాడు. ఇవాళ ఆ తలుపు గొళ్ళెం బిగించినట్టులేదు ...

తటాలున తలుపు పూర్తిగా తెరుచుకుంది. మూసుకుంది. కృత్తివాసరావు ఊపిరి బిగబట్టాడు మూసిన తలుపుకి గొళ్ళెంపెట్టి ఆ వ్యక్తి వెనక్కి తిరిగాడు. నల్లటి పాంటు, నల్లటి జుబ్బా తలమీద నల్ల టోపీ. మెళ్లో రుద్రాక్షలు తగిలించి. నుదురుకి ఇంత గంధం పట్టిస్తే 'అయ్యప్ప వ్రతం' పట్టిన భక్తుడై పోతాడతను.

అతను .... అతను .... ఎలా లోపలికి వచ్చాడు? ఎందుకు? ఇంతకీ అతను అతనేనా? అతనిలాగా అవుపిస్తున్న దెయ్యమా? కృత్తివాసరావు శరీరం ఒక్కసారిగా చల్లబడింది. వొళ్లో వున్న అతని చేతులు వణికాయి. ఆరిపోతున్న అతని పెదవులు కదిలాయి.

భయంనుండీ, ఆశ్చర్యం నుండీ అతను కోలుకునేసరికి నల్లటి ఆకారం అతని టేబుల్‌కి అయిదడుగుల దూరంలోకి చేరుకుంది. అప్పటికి తను చూస్తోంది దయ్యాన్ని కాదనీ, మనిషినే అనీ కృత్తివాసరావుకి నమ్మకం కలిగింది. అయితే మనిషైతే మూసిన ఆఫీసు వెనక గదుల్లోంచీ ఇక్కడికి ఎలా వచ్చాడు? ఎందుకు?

"వాటీస్‌దిస్? ఎలా వచ్చారు? భయంతో చచ్చిపోయాను!" కృత్తివాసరావు నవ్వే ప్రయత్నంచేస్తూ అన్నాడు.

పాంటు జేబుల్లోకి రెండు చేతులూ దోపుకున్న ఆ వ్యక్తి

టేబుల్ పక్కగా ఆగాడు. మాట్లాడకుండా పళ్ళికిలించాడు. కత్తివాసరావు ఆశ్చర్యంగా చూశాడు.

"ఓవర్‌టైమ్?" ఆ వ్యక్తి బొంగురుగా అన్నాడు.

"లే....దు....కొంచెం పని వుంది, వచ్చాను. మీరు" కృత్తివాసరావు తటాలున ఆగాడు.

ఆ వ్యక్తి జేబుల్లోంచీ రెండు చేతులూ తటాలున ఇవతలికి వచ్చాయి. రెండుచేతులూ నల్లగ్లవ్స్‌లో దాక్కున్నాయి. కుడిచేతిలో ఏదో మెరిసింది. ఫ్లోరసెంట్ కాంతి కత్తి పదనుమీద నాట్యంచేసింది. ఆ వ్యక్తి ఇంకా దగ్గిరగా నడిచాడు. కృత్తివాసరావు ఏదో అడిగే ప్రయత్నం చేశాడు. ఆ వ్యక్తి కళ్ళల్లో తన కళ్ళల్లోకే తదేకంగా చూస్తున్న కళ్ళల్లో ఏదో రాక్షస వాంఛ అవుపిస్తున్నట్టనిపించింది కృత్తివాసరావుకి.

అసంకల్పితంగా అతను కుర్చీలోంచీ లేచబోయాడు. ఆ వ్యక్తి ఎడమచెయ్యి మెరుపులా కదిలింది. గ్లవ్‌లో దాగిన అరచెయ్యి ఉక్కుపళ్ళెంలా కృత్తివాసరావు నోటిని కర్కశంగా, బలంగా నొక్కింది. కృత్తివాసరావుకి మెడ విరిగినట్టనిపిస్తోంది. వెనక్కి బలంగా తోయబడుతున్న తలని కంట్రోల్ చేయడానికి విశ్వప్రయత్నం చేశాడతను. అతని మెడ కుర్చీ వెనక భాగానికి నొక్కబడుతోంది. మెడ విరిగిపోతుంది. అతని లోపల్నుంచీ దూసుకొస్తున్న కేక పెదవుల వెనకనుంచీ మళ్ళీ గొంతుకలోకి, లోపలికి వెళ్ళిపోయింది.

వశం తప్పి అటూ ఇటూ కదులూ కృత్తివాసరావు రెండు చేతుల్తో తన నోటిని కప్పిన చేతిని పట్టుకున్నాడు. శక్తికొద్దీ దూరంగా లాగడానికి ప్రయత్నించాడు.

నల్లటి దుస్తుల్లో వున్న వ్యక్తి పళ్ళికిలిస్తూ నవ్వు

కున్నాడు. తనకి కావాల్సిందీ అదే! పిచ్చికుక్కను చంపే ముందు మనిషి గుడ్డలు చుట్టిన ఎడమచేతిని దాని నోటికి అందిస్తాడు. కుడిచేత్తో కత్తితో పొడిచి, కుక్కను హత మారుస్తాడు!

అతని కుడిచెయ్యి ముందుకి దూసుకెళ్ళింది. పదునైన కత్తి కృత్తివాసరావు ఛాతీలోకి దూరి మాయమైంది....

కృత్తివాసరావు లోపల ఏదో పగిలినట్టనిపించింది. ఆ వ్యక్తి ఎడమచేతిని తియ్యలేదు. అతని కుడిచెయ్యి కత్తిని ఒకసారి అటూ ఇటూ తిప్పి, సర్రున ఇవతలికి లాగింది. రక్తం తనమీదికి చిమ్మకుండా, అతను దూరంగా జరిగాడు.

కృత్తినివాసరావు తల కుర్చీకి ఆనుకునే పక్కకి వాలింది. చేతులు టేబుల్‌మీద పడ్డాయి. అతను ఇంకొంచెము వెనక్కి జరిగి, తను చిత్రించిన ఆయిల్ పెయింటింగ్‌ని చూస్తున్న ఆరితేరిన చిత్రకారుడిలా కృత్తివాసరావుని పరిశీలనగా చూశాడు.

కృత్తివాసరావు కళ్ళు ఎటో చూస్తున్నాయి. గెడ్డం అతని ఛాతీమీదికి వాలింది. చలనంలేని అతని శరీరం, నిజంగా పెయింటింగ్‌లాగే వుంది. గుండెప్రాంతం నుంచీ రక్తం చిమ్ముతోంది. చొక్కా రక్తంతో తడిసిపోతోంది. టేబుల్‌మీద నిశ్చలంగా పడున్న అతని చేతివేళ్ళని ఆ వ్యక్తి చిరునవ్వుతో చూశాడు.

"ఎక్స్‌పర్ట్ టైపిస్ట్! బాస్టర్డ్, ఇప్పుడు టైప్‌చెయ్!" తగ్గు స్వరంలో అన్నాడతను. తన మాటలు కృత్తివాసరావుకి వినిపించవని అతనికి తెలుసు.

అతను రెప్పలుఆడించి చేతిలోని కత్తిని తృప్తి

కరంగా చూశాడు. కత్తికి ఉదయం తనే స్వయంగా పదను పెట్టాడు ప్రేల్చే తన పిస్టల్‌కి తనే గుళ్ళు నింపాలి. పొడిచే తన కత్తికి తనే పదను పెట్టాలి! నవ్వుకుంటూ అతను కత్తికి అంటిన రక్తాన్ని కృత్తివాసరావు చొక్కాకి తుడిచాడు. కత్తిని పాంట్ జేబులో పడేశాడు.

అతని కళ్ళు టైప్‌రయిటర్‌ని చూశాయి. అందులో ఇరుక్కున్న కాగితాల్ని తీసి ముక్కలు చేశాడు. ముక్కల్ని జాగర్తగా జుబ్బాజేబులో పడేసుకున్నాడు. తను ముట్టుకున్న ప్రదేశాల్లో వేలిముద్రలు వుండవు! తనొచ్చిన ఆనవాళ్ళు వుంటాయని తను కంగారు పడక్కర్లేదు.

కృత్తివాసరావు బల్లమీద జాగర్తగా వుంచుకున్న తాళంచెవిని అతను చిరునవ్వుతో చూశాడు. ఆ తాళం చెవి అక్కడే వుండటం మంచిది! అతను గుమ్మం వైపు కదలబోతూ. చిన్నగా చప్పుడు చేస్తూ తిరుగుతున్న సీలింగ్ ఫాన్ని చూశాడు. దాని పని అది చేసుకుపోతే తనకి నష్టమేం లేదు... అతను కదిలాడు.

జుబ్బా జేబులోంచి తాళంచెవిని తీశాడు. తలుపుకి బిగించబడిన కన్నంలోకి దూర్చాడు. క్లిక్‌మంటూ తాళం తెరుచుకుంది తలుపు కొద్దిగా తెరిచి, తల ఇవతలకిదూర్చి గుడ్లగూబలా చీకట్లోకి చూశాడు. చిరునవ్వుతో అతని పెదవులు విచ్చుకున్నాయి. వరండాలోకి జరిగి తలుపుని మూయబోతూ ఆగాడు. అప్రయత్నంగా తలవాల్చి కృత్తివాసరావుని చూశాడు కత్తివాసరావు తల ఇంకొంచెం వాలింది. అతని పెదాల మధ్య నుంచి రక్తం సన్న గీతలా సాగుతోంది. రెప్పపాటు లేని అతని కళ్ళు తన వయిపు చూస్తున్నాయి....నిర్జీవంగా.

అతను తలుపు లాగాడు. తాళం చిన్నగా చప్పుడు చేసింది అతడు వెనక్కి తిరిగాడు తనలో నవ్వుకుంటూ పొడుగాటి వరండా గుండా వేగంగా నడిచాడు. మెట్లు దిగబోతూ ఉలిక్కిపడి ఆగాడు. అతని గుండె దడదడ కొట్టుకుంది. రెండో మెట్టు మధ్యలో కూచున్న నల్లపిల్లి అతన్నే చూస్తూ 'మ్యావ్!' అంది....

2

అద్దంలో తన ప్రతిబింబాన్ని వోసారి చూసుకుని అతను వెనక్కి తిరిగాడు. వేగంగా గుమ్మం వయిపు నడిచాడు. తలుపు తెరవబోతున్న అతన్ని టెలిఫోన్ మోత తటాలున ఆపింది. సిగరెట్ వెలిగిస్తూ అతను టేబుల్ దగ్గిరగా అడుగు లేశాడు ఎడంచేత్తో రిసీవర్ని ఎత్తాడు.

"యస్."

"హెంపో, పృథ్వీరావ్...." ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ కంఠం అటువేపు నుంచీ అంది.

"పొద్దుటే ఫోన్ చేశావ్. శుభవార్త చెప్పు!" డిటెక్టివ్ హెంపో నవ్వుతూ అన్నాడు.

"పోలీసులూ. డిటెక్టివ్‌లూ శుభవార్తలు వింటానికి లేరు!" పృథ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

"ఆల్‌రైట్. వార్త చెప్పు!"

"అలా అన్నావ్; బావుంది. టూటౌన్ చీఫ్ ఇంజనీర్స్ ఆఫీస్. టేబుల్ ముందు కుర్చీలో కూర్చున్న వ్యక్తి... అతనిలో ప్రాణంలేదు. గుండెప్రాంతంలో కత్తి చేసిన రంధ్రం గుండా ప్రాణం పారిపోయినట్టుంది...."

"పృథ్వీ, అయాంసారీ....నిద్ర లేవగానే పోలీసుల మొహాల్ని శవాల్ని చూపిస్తున్నావ్!" హెంపో నవ్వుతూ అడ్డు తగిలాడు.

"రెండూ ఉభళకునాలే అనుకో. గురూ, తయారుగా వుండు. అయిదు నిముషాల్లో అక్కడికి కొస్తున్నా. ఇదంతా చూస్తుంటే తల తిరిగిపోతుంది...."

"తయారుగానే వున్నా."

"డాక్టర్, ఫింగర్ ప్రింట్ ఎక్స్పర్ట్, ఫోటోగ్రాఫర్ వగయిరా మందీమార్బలం వస్తున్నారు. ఈలోగా...."

"పృథ్వీ, ఫోన్ పెట్టేయ్. కారెక్కు. దార్లో అంతా వివరించు!" టెంపో నవ్వుతూ రిసీవర్ పడేశాడు....

* * *

"తొమ్మిదిన్నరకి ఆఫీసు అటెండర్ తాళం తీసి లోపల కెళ్ళాడు. గావు కేకలు పెడుతూ ఇవతలికి పరుగెత్తాడు. పక్క గదిలో వున్న టెలిఫోన్ ఉపయోగించి, చీఫ్ ఇంజనీర్కి విషయం తెలియజేశాడు. చీఫ్ ఇంజనీర్ మాకు రిపోర్ట్ చేశాడు...." కార్ని వేగంగా పోనిస్తున్న ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ ఆగి, మలుపు తిప్పాడు.

"తరవాత నువ్వు నాకు తెలియజేశావు...." అతని పక్కనే కూచున్న టెంపో నవ్వుతూ అన్నాడు "మనకి కావాల్సింది...."

"గురూ, యూ ఆర్ రాంగ్! చీఫ్ ఇంజనీర్ రిపోర్ట్ అందగానే హత్యాస్థలానికి దూసుకెళ్ళాను. అన్నీ పర్యవేక్షించిన తరవాత నీకు తెలియజేశాను...." పృథ్వీరావ్ అడ్డొస్తూ అన్నాడు.

"ఆల్ రైట్! యూ ఆర్ రైట్! హతుడు ఎవరు? హత్య ఎప్పుడు జరిగి వుండొచ్చు? ఆ వివరాలు చెప్పు!"

"అతని పేరు కృత్తివాసరావు. టైపిస్టు - సీనియర్. నలభయి అయిదేళ్ళు వుంటాయి. హత్యా సమయం డాక్టర్ చెప్తాడు. గదిలో లయిటు వెలుగుతోంది. అంటే

రాత్రెప్పుడో అతను మరణించి వుండాలి...."

"రాత్రే జరిగి వుండాలని ఎందుకనుకుంటున్నావ్?" డిటెక్టివ్ టెంపో ప్రశ్నించాడు.

"లైటు వెలుగుతూ, ఆ మాట చెప్తోంది'" పృథ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

"మై డియర్ పృథ్వీరావ్, ఆఫీసుల్లో వెలుతురున్నా కూడా పగలంతా ఫ్లోరసెంట్ ట్యూబులు వెలుగుతూనే వుంటాయ్. ఆ కరెంట్ ఖర్చు ఏ ఉద్యోగీ భరించడుగా!" టెంపో నవ్వుతూ అన్నాడు.

పృథ్వీరావ్ నవ్వుతూ కార్ని మరో మలుపు తిప్పాడు. "కరక్టే. అయితే, హతుడు కృత్తివాసరావు సీటుకి దగ్గిరగా వున్న లయిటు మాత్రమే వెలుగుతోంది. అతని పైనున్న ఫ్యాన్ ఒక్కటే తిరుగుతోంది. అంటే...."

"అర్థమయింది!" టెంపో నవ్వుతూ అడ్డు తగిలాడు. "కృత్తివాసరావు గురించి...."

"ఇంకా ఏమీ కనుక్కోలేదు. మనం వెళ్ళేసరికి ఆఫీసు సిబ్బంది పూర్తిగా వచ్చివుంటారు. ప్రశ్నించి, ప్రశ్నించి మనం కనుక్కోవాలి?" ఇన్‌స్పెక్టర్ అడ్డొస్తూ అన్నాడు.

మరో మలుపు తిరిగి కారు సడన్ బ్రేకుతో ఆగింది.

3

వరండాలో గుంపుగా నించున్న పదిమందీ తగ్గు స్వరాలతో మాట్లాడుకుంటున్నారు. మెట్ల దగ్గిరగా నిటారుగా నిలబడ్డ కానిస్టేబుల్ పృథ్వీరావ్‌కీ, టెంపోకీ జాయింటుగా సెల్యూట్ చేశాడు.

"అంతా వచ్చారా?" పృథ్వీరావ్ అతన్ని ప్రశ్నించాడు.

"వచ్చారుసార్ ....ఆ గదిలోవున్నారు."

"మనవాళ్ళు సరే. ఆఫీస్ సిబ్బంది...." పృథ్వీరావ్ అన్నాడు.

"వాళ్ళేసార్ ...." కానిస్టేబుల్ గుంపుగా నిలబడ్డ వాళ్ళని చూపిస్తూ అన్నాడు.

డిటెక్టివ్ టెంపో, ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ వరండా చివరున్న గదివేపు నడిచారు. గుసగుసలు మానేసి, గుంపుగా నిలబడ్డ వ్యక్తులు పక్కకి తప్పుకుని, దారి చ్చారు.

మూసిన గదిముందు నిలబడ్డ కానిస్టేబుల్ సెల్యూట్ చేసి. తలుపు తెరిచాడు. డిటెక్టివ్ టెంపో, ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ లోపలికి ప్రవేశించారు. తలుపు మూసుకుంది. పృథ్వీరావ్ ఎదురుగావున్న గుమ్మందగ్గర నుంచున్న ఇన్స్పెక్టర్ కుమార్వైపు అడుగులేశాడు.

డిటెక్టివ్ టెంపో ఆగి. గదిని కలయజూశాడు. ఫింగర్ ప్రింట్ ఎక్స్పర్ట్ గదిలోని ఫర్నిచర్ మీద పౌడర్ డస్ట్ చేస్తున్నాడు. ఫ్లాష్ తళుక్కుమంది. గోడవారగా లాగిన టేబుల్ మీంచి పోలీస్ ఫోటోగ్రాఫర్ మరో శ్నాప్‌తీశాడు.

డిటెక్టివ్ టెంపో పక్కకి తిరిగి శవంముందు ఆగాడు. శవంతలకొద్దిగా ముందుకి వాలింది. కళ్ళు టెంపోవైపు చూస్తున్నాయి. నోట్లోంచీ కారిన రక్తం పెదవి చివర్నుంచీ గెడ్డం కిందిదాకా గడ్డకట్టింది. అతని దుస్తులమీదా, నేల మీదా గడ్డకట్టిన రక్తం ఛాతీమీద గాయాన్ని అతని ఎడమ చెయ్యి దాచిపెట్టింది. చెయ్యంతా రక్తసిక్తంగావుంది. కుడిచెయ్యి కిందికి వాలింది. వేళ్ళకొసలు టేబుల్ అంచు

మీదున్నాయి. రెప్పవేయకుండా తనవేపే చూస్తున్న అతని కళ్ళల్లోకి టెంపో క్షణకాలం విచారంగా చూశాడు.

మెల్లిగా వెనక్కి తిరిగి, తన దగ్గిరగా ఆగిన ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్‌ని చూశాడు. పృథ్వీరావ్ పక్కనే నించున్న డాక్టర్ వీరేశలింగాన్ని ప్రశ్నార్థకంగా చూశాడు.

"గురూ, రాత్రి పదకొండూ, పదకొండున్నర మధ్య మరణం సంభవించిందంటున్నారు డక్టర్" పృథ్వీరావ్ అన్నాడు.

"పోస్టుమార్టమ్ జరిగాక ఖచ్చితంగా చెప్పగలను" అన్నాడు "అతని చేతికింద, ఛాతీమీద అయిన గాయం మూలంగా మరణం సంభవించింది."

టెంపో మాట్లాడకుండా తలాడించాడు. "పృథ్వీరావ్, ఆ గుమ్మం అవతల యేముందో చూద్దాం...."

"స్టోర్ రూమ్సూ, రిక్రియేషన్ రూమ్, లావెటరీస్ వున్నాయి. వెనక తలుపు పర్మనెంట్‌గా లాక్ చేయబడింది. తలుపుకి అడ్డంగా ఇనుపరాడ్ బిగించబడింది. కిటికీలన్నిటికీ ఊచలూ, తలుపులూ వున్నాయి. అటువైపు నుండీ యెవ్వరూ లోపలికి రాలేరు. ముందు గుమ్మం ఒక్కటే........"

"అంటే హతుడూ, హంతకుడూ ఒకే గుమ్మంగుండా లోపలికి వచ్చారంటావ్?" టెంపో ప్రశ్నించాడు.

"అంతేగా?" ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ నవ్వుతూ అన్నాడు.

డిటెక్టివ్ టెంపో మూసిన గుమ్మంవైపు కదిలాడు. తలుపుకి బిగించిన తాళాన్ని క్షణకాలం చూశాడు.

"పృథ్వీరావ్, తాళంచెవి కృత్తివాసరావు టేబుల్‌మీద

వుంది. లోపలికి ప్రవేశించి అతను తలుపు తాళంవేసి వుండాలి....''

''అయితే హంతకుడు లోపలికి ఎలా వచ్చాడు?'' ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ అడ్డు తగిలాడు.

''అతను మరో తాళంచెవి ఉపయోగించి వుండొచ్చు. కృత్తివాసరావే అతనికోసం లోపల్నుంచీ తలుపు తెరిచి వుండొచ్చు!'' టెంపో నవ్వుతూ అన్నాడు.

''కృత్తివాసరావే తెరిచాడనుకుందాం. అలా అయితే అతను మళ్ళా తాళాన్ని వేసివుండాలి. వేసివుంటే, హత్యానంతరం హంతకుడు తెరిచివుండాలి. తాళం తెరిచాక, తాళంచెవిని మళ్ళీ యథాస్థానంలో పెట్టేసి. తాళం బటన్ని 'లాక్' వైపు పక్కకి తోసేసి తలుపుని మూసుకుంటూ వెళ్ళిపోయి వుండాలి. ఎందుకంటే తాళంచెవి ఆటోమేటిగ్గా పడిపోతుంది.''

''కృత్తివాసరావు. హంతకుడికోసం తలుపు తెరిచాక తాళం వేయకుండా తలుపుని దగ్గరగా మూసివుండొచ్చు. పని ముగించి హంతకుడు తలుపు లాక్ అయ్యేలా మూసి జారుకుని వుండొచ్చు'' ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ అడ్డొస్తూ అన్నాడు.

''పృథ్వీరావ్, మూసినగదిలో హత్య జరిగింది. హత్య జరిగాక తలుపులు మళ్ళీ మూయబడ్డాయి. ఈ ఆఫీసుగది తాళాలు ఎవరెవరి దగ్గరున్నాయో కనుక్కోవాలి....''

''ఎస్....''

''ఒక్క అంగుళం ప్రదేశాన్ని కూడా వదలకుండా వేలిముద్రంకోసం ప్రయత్నించమని మీ వాళ్ళకి చెప్పు. ముఖ్యంగా తలుపు. తాళంచెవి. కృత్తివాసరావు టేబుల్ వగైరా....''

"ఇందాకే చెప్పాను."

"శవాన్ని ఇక్కణ్నుంచీ తరలించాక, గదిని లాక్ వేసి సీల్ వేయించు. ఇదేదో తేలేదాకా గది 'ఇలాగే ఉండాలి" టెంపో నవ్వుతూ అన్నాడు.

"అఫ్‌కోర్స్!"

"చీఫ్ ఇంజనీర్‌నీ, సిబ్బందినీ కలుసుకుందాం. కృత్తివాసరావు గురించీ, అతని గుండెలో కత్తి గుచ్చిన వ్యక్తి గురించీ తెలుసుకుందాం....కనీసం, తెలుసుకునే ప్రయత్నం చేద్దాం!" అంటూ గుమ్మంవైపు తిరిగాడు.

4

కృత్తివాసరావు బ్రహ్మచారి. రెండు గదులున్న వాటాలో అద్దెకి వుంటున్నాడు. తనూ, తన టైప్‌రైటరూ, టైపింగ్ తప్ప మరో వ్యాపకం వుండేదికాదు అతనికి. ఆఫీసులో ఎవ్వరితోనూ అతనికి శతృత్వంలేదు. అందరితోనూ స్నేహంగా వుండేవాడు. అయితే మెడలు రాసుకుంటూ తిరిగేవాడు కాడు. అతన్ని చంపాల్సిన అవసరం, అంత కసీ సిబ్బందిలో ఎవ్వరికీ లేవు....

చీఫ్ ఇంజనీర్ చెప్పిందంతా డిటెక్టివ్ టెంపో, ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ మౌనంగా విన్నారు. కాఫీకప్పు కిందపెట్టి. టెంపో సిగరెట్ ముట్టించాడు. పృథ్వీరావ్ వైపు ఓసారి చూసి బయటికి వెళ్ళాడు.

"కృత్తివాసరావు ఆదివారం రాత్రి ఆఫీసుకి వచ్చాడు. ఎందుకు!" టెంపో చీఫ్ ఇంజనీర్‌ని ప్రశ్నించాము.

"అదే అర్థంకావడం లేదు. అతను పోయినవారం శలవుపెట్టాడు. అతని వర్క్ పెండింగ్ వుంది. అయితే ఆ విషయం ఎవ్వరూ అతనికి చెప్పలేదు. ఎందుకంటే అతను ఎవ్వరికీ కనిపించలేదు...." చీఫ్ ఇంజనీర్

ఆగాడు.

"ఆఫీసు తాళంచెవులు సాధారణంగా ఎవరిదగ్గరుం టాయి?" టెంపో ప్రశ్నించాడు.

"నా దగ్గరే ఆఫీసు మూసేయగానే ఫ్యూన్ తాళం చెవిని మా ఇంట్లో పెట్టేస్తాడు...."

"అయితే ఆదివారం రాత్రి కృత్తివాసరావుకి తాళం చెవి ఎక్కణ్నుంచీ వచ్చింది?" టెంపో ప్రశ్నించాడు.

చీఫ్ ఇంజర్ అర్థంకానట్టు చూశాడు. "అదే అర్థం కావడంలేదు. ఇంట్లో ఫ్యూన్ పెట్టిన తాళంచెవి ఇంట్లోనే వుంది!"

"సాధారణంగా ప్రతి తాళానికీ రెండు తాళంచెవు లుంటాయి. రెండో తాళంచెవి ఎక్కడుంది?" టెంపో అతన్నే చూస్తూ ఆడిగాడు.

"మా ఇంట్లో, నా గదిలో బీరువాలో దాచాను; జాగ్రత్త కోసం...."

"అది మీరు దాచినచోటే ఉందేమో చూశారా?" అడి గాడు.

"....లేదు. ఫ్యూన్ ఫోన్‌లో కృత్తివాసరావు గురించి చెప్పగానే ఆదరా, బాదరా పరుగెట్టుకొచ్చాను. ఆ ఆలో చనే రాలేదు నాకు...."

"ఇంటికి ఫోన్ చేయండి. తాళంచెవి ఉందేమో తెలుసుకోండి .." అంటూ టెంపో పచార్లు ప్రారంభిం చాడు. ఆలోచనల్లో మునిగిపోయిన అతనికి ఇంజనీర్ టెలిఫోన్ సంభాషణ వినబడలేదు.

"మిస్టర్ టెంపో...."

టెంపో పచార్లు మాని, ఇంజనీర్‌వైపు ప్రశ్నార్థ కంగా చూశాడు.

"బీరువాలో తాళంచెవి లేదు!" ఇంజనీర్ మొహం ఆశ్చర్యానికి పట్టిన అద్దంలా వుంది.

"ఐసీ...." టెంపో సాలోచనగా అన్నాడు. "ఇప్పుడు లేదు. ఎప్పుడు ఉందో మీరు చెప్పగలరా?"

ఇంజనీర్ అర్థం కానట్టు చూశాడు.

"బీరువాలో తాళంచెవి ఉండటాన్ని ఎంతకాలం క్రితం మీరు చూశారు?" టెంపో నవ్వుతూ అడిగాడు.

ఇంజనీర్ తల అడ్డంగా ఊగించాడు. "దానికోసమని ప్రత్యేకంగా నేను ఎప్పుడూ చూడలేదు. ఎందుకంటే దాని అవసరం కలగలేదు. అయితే ఆర్నెల్లక్రితం అనుకుంటాను. దేనికోసమో బీరువాలో చూస్తూంటే తాళంచెవి కనిపించింది."

"అంటే కృత్తివాసరావు మీరు దాచిన స్పేర్ కీని ఉపయోగించాడన్నమాట. మిస్టర్ రాజూ, అతని టేబుల్ మీద పడున్న తాళంచెవి మీరు బీరువాలో దాచిందేనా?" టెంపో ప్రశ్నించాడు.

ఇంజనీర్ రాజు ఇబ్బందిగా చూశాడు...."ఖచ్చితంగా చెప్పలేను. ఎందుకంటే దాచినచోట ఉన్నంతకాలం స్పేర్ కీని పోల్చగలం. దాచిన చోట్నుంచీ తీసి మరో తాళం చెవితో కలిపితే రెండింటినీ విడదీసి పోల్చడం కష్టం!"

"ప్రయత్నించుదాం!" అంటూ టెంపో గుమ్మంవైపు వెళ్ళాడు. పక్క గదిముందు ఆఫీసు సిబ్బంది నిలబడ్డారు. లోపల ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ ఒక్కొక్కర్నే ప్రశ్నిస్తున్నాడు. ఇంకా లోపలికి వెళ్ళనివాళ్ళ మొహాల్లోని కంగారూ, వెళ్ళి, ఇవతలికి వస్తున్నవాళ్ళ మొహాలమీది చెమటా పృథ్వీరావ్ ఇంటర్వ్యూ పద్ధతిని గ్రాఫుల్లా చూపి

స్తున్నాయి. పృథ్వీరావ్ వాళ్ళని ప్రశ్నల్తో చెడుగుడాడించేస్తున్నట్టున్నాడు! టెంపో నవ్వుకుంటూ ఆ గదిలోకి దూరాడు.

ఎదురుగా కూచుని చెమటలు కక్కుతున్నవ్యక్తిని ఏదో అడగబోయిన పృథ్వీరావ్ మానేసి ప్రశ్నార్థకంగాచూశాడు టెంపో అతని ముందుకి వంగి తగ్గు స్వరంలో ఏదో చెప్పాడు. వెనుదిరిగి ఇవతలికి నడిచాడు....

కసేపట్లో ఒక కానిస్టేబుల్ ట్రే పట్టుకొని గదిలోకి ప్రవేశించాడు. టెంపో ముందు ట్రే పెట్టి' దూరంగా జరిగాడు టెంపో ట్రేవి ఇంజనీర్ రాజువైపు తోశాడు. అందులో పక్క పక్కనే పెట్టబడిన రెండు తాళాల్ని రాజు కళ్ళు చిట్లిస్తూ చూశాడు.

"రెండింటిలో మీరు బీరువాలో దాచిన స్పేర్‌కీ ఏదో పోల్చుకోగలరేమో చూడండి." టెంపో సిగరెట్ ముట్టిస్తూ అన్నాడు.

"ఇదే అనుకుంటాను...." కుడివైపున్న తాళాన్ని వేలితో చూపిస్తూ రాజు అన్నాడు.

"మిస్టర్ రాజూ, ఎలా పోల్చారు?" టెంపో ప్రశ్నించాడు.

"ఇది పాలిష్‌తో తెల్లగా మెరుస్తోంది. రెండోది అంతగా మెరవడంలేదు...." రాజు మెల్లగా చూపుల్ని టెంపోవైపు తిప్పాడు.

టెంపో చిన్నగా నవ్వాడు, "రోజూ ఉపయోగిస్తున్న తాళంచెవి పేళ్ళమధ్యా, తాళం కన్నంలో తిరిగి తిరిగి నల్లబడింది. ఉపయోగించకుండా బీరువాలో వుంచేసింది కొత్తగానే వుంది. అంటే దాచిన తాళంచెవిని మరోదాన్నుండీ వేరుచేసి పోల్చడం అంత కష్టం కాదన్నమాట! అవు

నంటారా?"

రాజు నవ్వేప్రయత్నం చేశాడు.... "యస్. యూ ఆర్ రైట్!"

"సో, మిస్టర్ రాజూ, మీ గదిలో మీరు స్వహస్తాల్తో బీరువాలో భద్రంగా దాచిన తాళంచెవి కృత్తివాసరావు చేతికి ఎలా వచ్చింది?" టెంపో తటాలున ప్రశ్నించాడు. అతని సైగతో కానిస్టేబుల్ ప్రేని పట్టుకెళ్ళిపోయాడు.

"అర్థం కావడంలేదు—నేను ఇవ్వలేదు...."

"మరెవ్వ రిచ్చారు! మీ యింట్లో ఎవరెవ రున్నారు?" టెంపో అతని మొహంలోకే చూస్తూ ప్రశ్నించాడు.

"నా భార్యా నేనూ. మాకు....పిల్లల్లేరు."

"ఆమె ఇచ్చారేమో కనుక్కున్నారా?"

"ఇందాకే అడిగాను. తనెవ్వరికీ ఇవ్వలేనందామె...."

"ఎవ్వరూ ఇవ్వకపోతే, అతను తీసుకుని వుండాలి!" టెంపో నవ్వుతూ అన్నాడు. "మిస్టర్ రాజూ, కృత్తివాస రావు ఈ మధ్య మీ ఇంటికి వచ్చారా?"

"లేదు. ఈ మధ్య రాలేదు."

"ఆ మధ్య వచ్చాడా?"

రాజు కళ్ళు చిట్లించాడు.

"మిస్టర్ రాజూ, మీరు ఆర్నెల్లప్పుడు బీరువాలోని తాళంచెవిని చూశారు. తరవాత ఇప్పుడు చూస్తున్నారు. అంటే ఆర్నెల్లనుంచీ, నిన్నటిలోగా ఎప్పుడో అప్పుడు కృత్తివాసరావు తాళంచెవిని తీసేసుకునివుండాలి. అందుకే అడుగుతున్నా: కృత్తివాసరావు ఆర్నెల్లలోగా ఎప్పుడేనా మీ ఇంటికి వచ్చాడా?"

"లేదు. మిస్టర్ టెంపో, అతను ఒక్కసారి కూడా మా యింటికి రాలేదు!" రాజు జవాబిచ్చాడు.

"కృత్తివాసరావు స్టెనో అనుకుంటాను...." జెంపో సిగరెట్‌ని యాష్‌ట్రేలో నొక్కుతూ ఆర్పేశాడు.

"ఔను...."

"మీరు చీఫ్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. ఆఫీసు లోనే కాకుండా, అత్యవసర సందర్భాల్లో మీరు యింట్లో కూడా అఫీషియల్ డ్రాఫ్ట్‌ని డిక్టేట్ చేసివుంటారు...." అవునా?"

"ఆఫ్‌కోర్స్...."

"ఆ సందర్భాల్లో స్టెనో టైపిస్ట్ కృత్తివాసరావు మీ ఇంటికి వచ్చివుండాలిగా?" జెంపో చిరునవ్వుతో ప్రశ్నించాడు.

రాజు నవ్వలేదు. "అతనెప్పుడూ రాలేదు."

"ఎందుకు? అతను రాలేదా? మీరు పిలిపించుకో లేదా!"

"మిస్టర్ జెంపో, ఆఫీసులో మరో స్టెనో టైపిస్ట్ వుంది. అత్యవసర పరిస్థితుల్లో నేను ఆమె సర్వీసెస్‌ని ఉపయోగించుకుంటాను. ఆమె—రజని—నా క్యాంప్ క్లర్క్‌గా కూడా పని చేస్తోంది...." రాజు మెల్లగా ఆగాడు.

"ఐసీ...." జెంపో సాలోచనగా అన్నాడు.

"మిస్టర్ రాజూ, ఆమె....రజనీ, కృత్తివాసరావూ స్నేహంగా వుండేవారా? ఐ మీన్ అతను రజనితో స్నేహంగా వుండేవాడా?" జెంపో ప్రశ్నించాడు.

"మిస్టర్ జెంపో, నా సెక్షన్‌లో అందరూ అందరితో స్నేహంగా వుంటారు. ఉయ్ ఆర్ ఆల్ గుడ్ ఫ్రెండ్స్!" రాజు సగర్వంగా అన్నాడు.

"గుడ్. సాధారణంగా ఒక ఆఫీసులో అలా స్నేహం వుండదు! ఆల్ రైట్ ....మిస్టర్ రాజూ, రజని మీ బీరువా లోని తాళంచెవిని తీసుకునివుంటుందా?"

రాజు ఆశ్చర్యంగా చూస్తూ రెప్పలు టపటపలాడించాడు. "దేనికి? ఆ తాళం ఆమె కెందుకు?"

"కృత్తివాసరావుకి ఇవ్వడానికి...." టెంపో మరో సిగరెట్ ముట్టిస్తూ అన్నాడు.

రాజు నిట్టూర్చాడు. "మిస్టర్ టెంపో, రజని మంచి పిల్ల. ఆమె నా బీరువాలోంచీ తాళంచెవి దొంగిలించదు!"

టెంపో తల పంకించాడు. "మిస్టర్ రాజూ, కృత్తివాసరావుకి మీరు తాళం యివ్వలేదు. మీ భార్యా ఇవ్వలేదు. అడపాదడపా మీ యింటికి వచ్చే సి.సి. రజనీ ఇవ్వలేదు. అయితే కృత్తివాసరావు చేతికి తాళంచెవి ఎలా వచ్చింది?"

"దటీజ్ ది మిస్టరీ!" ఇంజనీర్ రాజు నవ్వే ప్రయత్నం చేశాడు.

"కృత్తివాసరావు ఎవరికీ తెలియకుండా మీ యింట్లో ప్రవేశించి, మీ బీరువా తెరిచి ఆ తాళంచెవి తీసుకుని వుండాలి...." టెంపో సాలోచనగా అన్నాడు.

"ఆలోచిస్తూంటే అదే జరిగివుండాలనిపిస్తోంది...." రాజు మెల్లగా అన్నాడు.

డిటెక్టివ్ టెంపో కుర్చీలోంచి లేచాడు. కోటుజేబులోంచి సిగరెట్ పాకెట్ తీశాడు. సాలోచనగా సిగరెట్ వెలిగించి పొగ ఊదాడు. కిటికీవైపునుండి చూపుల్ని తటాలున ఇంజనీర్ రాజువైపు తిప్పాడు.

"మిస్టర్ రాజూ, కృత్తివాసరావుకి ఆ తాళంచెవి దేనికి?"

"దేనికి? తెలుస్తోందిగా! ఆఫీసుగది తెరవడానికి!" రాజు నవ్వుతూ అన్నాడు.

"ఆఫీసుగది తెరవడం దేనికి?" టెంపో అతన్ని తదేకంగా చూస్తూ అడిగాడు.

ఇంజనీర్ రాజు అర్థంకానట్టు చూశాడు. "....ఆలోచించాను. అర్థం కావడంలేదు."

"శలవులో వెళ్ళిన కృత్తివాసరావు ఇవాళ ఆఫీసుకి వచ్చివుండొచ్చు. పెండింగ్ వర్క్ ఎంతవున్నా ఒక్క రాత్రిలో అతను పూర్తి చేయలేడు. అయితే రాత్రి అతను ఆఫీసుకి ఎందుకు వచ్చాడు?" టెంపో ప్రశ్నించాడు.

"మిస్టర్ టెంపో, అయాం సారీ. మీ ప్రశ్నకి నేను సమాధానం ఇవ్వలేను" రాజు మెల్లగా అన్నాడు.

"ఆఫ్‌కోర్స్ కృత్తివాసరావు ఎవరికీ తెలియకుండా ఆఫీసుకి వచ్చి ఏదో చేయాలనుకున్నాడు. అందుకే రాత్రి ఒంటరిగా ఆఫీసుకి వచ్చాడు—అని మనం అనుకోవాలి. అంతేగా?" టెంపో ప్రశ్నించి పచార్లు ప్రారంభించాడు.

జవాబుగా ఇంజనీర్ రాజు బుర్ర ఆడిస్తూ వుండిపోయాడు. డిటెక్టివ్ టెంపో తటాలున ఆగి అతన్ని సూటిగా చూశాడు.

"మిస్టర్ రాజూ, రాత్రిగానీ, మరెప్పుడేనాగానీ అతను అడిగివుంటే మీరు కృత్తివాసరావుకి తాళంచెవి ఇచ్చేవారేగా?"

"తప్పకుండా ఇచ్చేవాణ్ణి."

"అయితే అతను మిమ్మల్ని ఎందుకు అడగలేదు?" టెంపో ఠపీమని ప్రశ్నించాడు.

రాజు కంగారుగా చూశాడు. క్షణంలో సర్దుకుని టెంపో వైపు కళ్లు చిట్లిస్తూ చూశాడు. "ఆ ప్రశ్నకి కృత్తివాస రావు సమాధానం చెప్పాలి!"

డిటెక్టివ్ టెంపో నవ్వుతూ కుర్చీలో కూచున్నాడు. "అతను చెప్పే స్థితిలో లేడు. అందుకే మిమ్మల్ని అడిగాను!" అన్నాడు నవ్వుతూ.

"మిస్టర్ టెంపో. మీరు అడిగారు. గంటన్నరనుంచీ నన్ను ప్రశ్నలు అడుగుతూనే వున్నారు! నాకు తెలిసిందంతా చెప్పేశాను ..."

"కానీ నాకు తెలియాల్సిందంతా మీరు చెప్పలేదు!" టెంపో అద్దొస్తూ అన్నాడు.

"మీకు తెలియాల్సిందంతా నాకు తెలుసని మీ రెందుకనుకుంటున్నారు?" ఇంజనీర్ రాజు విసుగ్గా ప్రశ్నించాడు తన పరిశోధన అతనికి చిరాకు తెప్పిస్తోందని టెంపో అర్థంచేసుకున్నాడు. చిరునవ్వుతో అతని మొహంలోకి చూశాడు.

"బికాస్ యూ ఆర్ ది హెడ్ ఆఫ్ దిస్ ఆఫీస్!" టెంపో నవ్వుతూ అన్నాడు.

టేబుల్ మీదున్న రాజు చేతులు పిడికిళ్ళుగా బిగుసుకున్నాయి. అతను బరువుగా నిట్టూర్చి టెంపో వైపు అదోలా చూశాడు. "మిస్టర్ టెంపో. అయామ్ సారీ. ఈ ఆఫీసులో నేను బాస్ కావొచ్చు. సిబ్బందిలో ఒకవ్యక్తి నా ఇంట్లోంచీ తాళంచెవి ఎందుకు దొంగిలించాడో, అర్ధరాత్రి ఆఫీసుకి ఎందుకు వచ్చాడో, ఎందుకు హత్య చేయబడ్డాడో నేను చెప్పలేను!"

"అదంతా మీరు నాకు వివరించి చెప్పాలని నేను మిమ్మల్ని అడగలేదు!" టెంపో నవ్వుతూ అన్నాడు.

"కృత్తివాసరావు ఆఫీసు తాళంచెవికోసం మిమ్మల్ని ఎందుకు అడగలేదో చెప్పమన్నాను. మీ ఆఫీసులో, మీ కిందపని చేసే ఒక ఉద్యోగి మీకు తెలీకుండా ఆదివారం రాత్రి ఏదో చేయడానికి వచ్చాడు. అందుకు కారణం నా కంటే మీరే బాగా ఊహించవచ్చు...."

"మీరెంత ఊహించగలరో, నేనూ అంతే ఊహించ గలను!" ఇంజనీర్ రాజు అద్భుతగుల్తూ అన్నాడు.

టెంపో అతన్ని చిరునవ్వుతో చూశాడు. తన ప్రశ్నలు అతన్ని ఇబ్బందిపెడుతున్నాయి. తన ఆఫీసులో జరిగిన హత్య అతన్ని సహజంగా భయపెడుతోంది....

టెంపో మెల్లిగా పైకిలేచాడు. "ఓకే మిస్టర్ రాజూ, థాంక్యూ. వెళతాను...."

ఈసారి ఇంజనీర్ రాజు అర్థమైనట్టు చూశాడు. మెల్లిగాలేచి నిలబడ్డాడు. బాధ నిండిన కళ్ళతో టెంపో మొహంలోకి చూశాడు.

"మిస్టర్ టెంపో, కృత్తివాసరావు మంచి మనిషి. ఒకరి జోలికి వెళ్ళకుండా, అందరితో కలుపుగోలుగా వ్యవహరించేవాడు. అతని దుర్మరణానికి కారకులెవరో కనిపెట్టండి! ఏ ఇన్‌ఫర్మేషన్ కావాల్సినా అడగండి; నాకు తెలిసిందంతా చెప్తాను."

టెంపో అతన్ని నవ్వుతూ చూశాడు. తల ఆడిస్తూ వెనక్కితిరిగి గుమ్మంవైపు నడిచాడు. మూసిన తలుపు ముందు ఆగి తటాలున వెనక్కి తిరిగాడు. ఇంజనీర్ రాజు ప్రశ్నార్థకంగా చూస్తున్నాడు.

"మిస్టర్ రాజూ, మీ ఆఫీసు ప్రాపర్టీ ఏదేనా పోయిం దేమో కనుక్కున్నారా?"

రాజు ఇబ్బందిగా చూశాడు. "లేదు. పోలీసులు ఆ గదిని మా స్వాధీనం చేశాక ఇన్వెంటరీ ప్రారంభించాలి."

టెంపో తలపంకించాడు. "కృత్తివాసరావు రహస్యంగా ఆఫీసుకి వచ్చాడు. అయితే ఆ సంగతి మరో వ్యక్తికి తెలుసు...."

మిస్టర్ టెంపో, "ఎవరా వ్యక్తి?" ఇంజినీర్ రాజు అర్థోక్తిగా ప్రశ్నించాడు.

"హంతకుడు."

ఇంజినీర్ రాజు బుర్ర వెనక్కీ ముందుకీ ఆడింది.

"కృత్తివాసరావు ఎందుకు ఆఫీసుకి వచ్చాడో తెలిస్తే, ఎవరు అతన్ని ఫాలో చేశారో సులభంగా తెలుసుకోవచ్చు." టెంపో సాలోచనగా అన్నాడు.

"మిస్టర్ టెంపో, ఆఫీసులో పనిచేసేవ్యక్తి ఎవరో హత్యచేసి వుండొచ్చన్న భావం మీ మాటల్లో ధ్వనిస్తోంది. మరేదో వ్యక్తిగతమైన కారణంతో అతన్ని తుదముట్టించాలనుకున్నవ్యక్తి అతన్ని వెంబడించి, ఒంటరిగా ఆఫీసులోవున్న కృత్తివాసరావుని హతమార్చి వుండొచ్చుగా?" ఇంజినీర్ రాజు ప్రశ్నించాడు.

టెంపో అతన్ని తదేకంగా చూశాడు. "ఉండొచ్చు."

"అదే జరిగివుంటుందని నేను అనుకుంటున్నా...."

టెంపో చిన్నగా నవ్వాడు. "అసలు విషయం తెలిసేదాకా మీరు ఏదేనా అనుకోవచ్చు!"

5

"తలాతోకా తెలీడంలేదు...." ఇన్స్పెక్టర్ పృథ్వీరావ్ నిరుత్సాహంగా అన్నాడు.

టీ తాగేసి. సిగరెట్ వెలిగించి డిటెక్టివ్ టెంపో అతన్ని చిరునవ్వుతో చూశాడు. "ఆఫీసు సిబ్బందిని

రెండు గంటలు గానుగాడేశావ్‌గా?"

"ఆడేశాను. అయినా చమురు దొరకలేదు!" పృథ్వీరావ్ విరక్తితో నవ్వాడు. "టెంపో, ఒంటరిగా ఆఫీసులో వున్న వ్యక్తి గుండెలో కత్తి గుచ్చి, అమానుషంగా చంపివేసిన వ్యక్తి తెలివిగా జారుకున్నాడు. నా కడుపు మండుతోంది!" అతని కంఠంలో కసి ధ్వనించింది.

"పృథ్వీ, ఆ కడుపుమంట నీ కళ్ళల్లో అవుపిస్తోంది! ఆధారాలు వదిలేసి వెళ్ళిపోయిన హంతకుణ్ని పట్టుకోడంలో థ్రిల్ లేదు అపరాధంచేసి, అడుగుజాడలు చెరుపుకుంటూ అతితెలివిగా అంతర్థానమైనవాణ్ని పట్టుకోడంలో థ్రిల్‌వుంది; తృప్తివుంది!" డిటెక్టివ్ టెంపో నవ్వుతూ అన్నాడు.

పృథ్వీరావ్ నిట్టూర్చాడు. "ఆఫ్‌కోర్స్....అయితే."

"పృథీరావ్, డాక్టర్ ఏమంటాడు?" టెంపో అడ్డొస్తూ ప్రశ్నించాడు.

"అప్పుడు చెప్పిందే చెప్పాడు. లేకపోతే మెడికల్ పరిభాషలో, టెక్నికల్ పరిభాషలో మామూలు మనిషికి బొత్తిగా అర్థంకాకుండా చెప్పాడు!" ఇన్‌స్పెక్టర్ పృథ్వీరావ్ చిన్నగా నవ్వాడు.

"ఫింగర్ ప్రింట్స్?"

పృథ్వీరావ్ మళ్ళీ నిట్టూర్చాడు. "ఫింగర్‌ప్రింట్స్.... ఆ గదిలో అవి తప్ప మరేంలేవు. ఇసుకలో బాతుల గుంపు కాళ్ళ గుర్తుల్ని వదిలేసినట్టు సిబ్బంది అంతా తమ వేలి ముద్రల్ని పుష్కలంగా వదిలేశారు! శతకోటి లింగాలు. మనక్కావాల్సిన లింగం ఏదో, ఎక్కడుందో తెలీదు! తాళంచెవి మీద మాత్రం కృత్తివాసరావు వేలి ముద్రలున్నాయి...."

"అందరి వ్రేలిముద్రలూ తీసుకున్నారనుకుంటాను.." టెంపో అన్నాడు

"ఆ.....అందరివీ" పృథ్వీరావ్ అన్యమనస్కంగా అన్నాడు. వెనకా ముందూ ఎవ్వరూలేని బ్రహ్మచారి కృత్తివాసరావు హత్య, ఛాలెంజ్‌గా మారిన హత్య ఇన్‌స్పెక్టర్ని ముల్లులా గుచ్చుతోంది. టెంపో చిన్నగా నవ్వుతూ పైకిలేచాడు. పృథ్వీరావ్ అతన్ని అదోలా చూశాడు.

"గురూ. కూచో. లెట్స్ సాల్వ్ ది కేస్?"

టెంపో చిన్నగా నవ్వాడు. "పృథ్వీ ఆఫీసులో పాత వేలిముద్రలు చాలా ఎక్కువగా వుంటాయి. తాజాగా ఏర్పడ్డవి కొద్దిగ వుంటాయి; అవి హతుడివీ, హంతకుడివీ, పొద్దుటే తలుపులు తెరిచిన జవానువీ అయివుంటాయి. ఫ్రెష్ ఫింగర్ ప్రింట్స్‌ని జాగ్రత్తగా విడదీసి చూడాలి."

"అఫ్‌కోర్స్...."

"స్పేర్ కీ కృత్తివాసరావుకి ఎలా వచ్చింది?" టెంపో ప్రశ్నించాడు.

పృథ్వీరావ్ రెప్పలెత్తి టెంపో కళ్ళల్లోకి చూశాడు. "టెంపో. ఇదే ప్రశ్నను చాలాసార్లు. చాలామందిని మనం అడిగాం. స్పేర్ కీ కృత్తివాసరావు చేతికే వచ్చిందన్న గ్యారెంటీ ఏమిటి? అతనే తాళం తెరిచాడని మనం ఎందుకనుకోవాలి? హంతకుడు తాళం తెరిచాక, కృత్తివాసరావు లోపలికి వెళ్ళివుండకూడదా?"

టెంపో చిరునవ్వుతో చూశాడు. "నీ ఆర్గ్యుమెంట్ బావుంది. అలా జరిగివుంటే. సిబ్బందిలో ఎవరు ఇంజనీర్ రాజు ఇంటికి వెళ్ళారో కనుక్కుంటే చాలు! అయితే మై డియర్ పృథ్వీరావ్, అలా జరగలేదు!"

"వాట్! నీకెలా తెలుసు?" పృథ్వీరావ్ అరిచాడు.

డిటెక్టివ్ టెంపో చిన్నగా నవ్వాడు. "పృథ్వీరావ్, ఇంటికెళ్ళు. స్నానంచేసి, వేరే దుస్తులేసుకో. విశ్రాంతి తీసుకో. నీలో వేరేమనిషి నిద్రలేస్తాడు. అప్పుడు ఆలోచించు!"

"గురూ, సతాయించకు! చెప్పు!"

"పృథ్వీరావ్ తాళం మీదా, తాళంచెవిమీదా కృత్తివాసరావు వేలిముద్రలే వున్నాయి! అంటే తాళంచెవి ఉపయోగించి, తాళం తెరిచింది అతనే; హంతకుడు కాడు!"

పృథ్వీరావ్ కళ్ళార్పకుండా టెంపోని క్షణకాలం చూశాడు.

"టెంపో...."

"యస్?"

"మనిద్దరం ఆఫీసుకి వచ్చాం. తాళంచెవి నా దగ్గరుంది. గుమ్మం ముందుకి రాగానే నేను తాళంచెవిని నీకు అందిస్తాను. నువ్వు తాళంతీసి. తలుపు తెరుస్తావు. అప్పుడు నీ వేలిముద్రలే వుంటాయి; నావి కావు!" పృథ్వీరావ్ తీక్షణంగా అన్నాడు.

డిటెక్టివ్ టెంపో అతన్ని తదేకంగా చూశాడు. "యూ హేవ్ ఎ పాయింట్ దేర్! అంటే కృత్తివాసరావూ; అతన్ని ఖూనీచేసిన వ్యక్తి కలిసి ఆఫీసుకి వెళ్ళారంటావు...."

"అనడంకాదు........అనుకోడంలో తప్పులేదుగా?" పృథ్వీరావ్ అడ్డుతగిలాడు.

"అనుకోవాలి కూడా! ఆల్‌రైట్ పృథ్వీ, ఫింగర్ ప్రింట్స్ గురించి ఫుల్ రిపోర్టు కావాలి మనకి....నీ ఇంటరాగేషన్‌లో కృత్తివాసరావు సహోద్యోగులు

చెప్పింది ఏదేనా ఉపయోగిస్తుందేమో బుర్రతో తిరగ దోడుతూ చూడు. ఈలోగా నేను ఒక చోటికి వెళ్ళొస్తా."

"గురూ, ఎక్కడికి?" పృథ్వీరావ్ ఆత్రుతగా అడిగాడు.

"ఎక్కడికేనా వెళ్ళేప్పుడు 'ఎక్కడికి?' అని అడగడం అపశకునం అని నీకు తెలీదా?" టెంపో నవ్వుతూ అన్నాడు. అతనివెనకే మూసుకున్న తలుపునిచూస్తూ పృథ్వీ రావ్ కాలింగ్‌బెల్ నొక్కి, కుర్చీలో వెనక్కివాలాడు....

6

మెయిన్ రోడ్‌లో కారాపి డిటెక్టివ్ టెంపో కుడి వేపున్న సందువేపు నడిచాడు. సందులోకి తిరగబోతూ తటాలున ఆగాడు. తనకి కావాల్సిన ఇంటికోసం కాసేపు వెతకాల్సి వుంటుందన్న అతని ఆలోచన క్షణంలో ఎగిరి పోయింది. తనకి ఆ ఇంటిని చూపించడానికే అన్నట్టు ఆ వ్యక్తి టాక్సీలోంచి దిగి, గేటువేపు నడుస్తున్నాడు....

టెంపో తటాలున వెనక్కి జరిగి పక్కనే ఉన్న కాంపౌండ్ గోడచాటుకి తప్పుకున్నాడు. తల కొద్దిగావాల్చి చూశాడు. గేటులోపలికి తోస్తూ అతను అటూ ఇటూ చూశాడు. గేటుమూసేస్తూ లోపలికి అదృశ్యమయ్యాడు....

టెంపో ఆలోచిస్తూ క్షణకాలం నిలబడ్డాడు. తను ఒక క్షణం ముందుగా వచ్చి వుంటే? ఆలస్యంగా రావడం మంచిదయిందా? టెంపో కోటుజేబులోంచి పాకెట్‌తీసి సిగరెట్ వెలిగించాడు. అప్రయత్నంగా వెనక్కి తిరిగి కారువేపు నడిచాడు.

కూచుని. డోర్ని లాగి కళ్ళు మూసుకున్నాడు. అతను ఈ సమయంలో ఇక్కడికి ఎందుకొచ్చాడు? టెంపోవేళ్ళు స్టీరింగ్‌మీద తబలా వాయించడం ప్రారంభించాయి. టెంపో తటాలున కళ్ళు తెరిచాడు. అతను ఉన్నచోటుకి తను

వెళ్ళడం అంత మంచిదికాదు....అతను లేనిచోటుకి వెళ్తే?

ఆలోచిస్తూ షెంపో కార్ని స్టార్టు చేశాడు.

*　　　　*　　　　*

పావుగంట తరవాత అతను కార్ని ఆపాడు. కాంపౌండు లోపల అందంగా నించున్న ఇంటిని క్షణ కాలం పరీక్షగా చూస్తూ ఉండిపోయాడు. 'అతను లేని చోటికి తను వెళ్ళబోతున్నాడు. ఆ తరవాత, తను ఉన్న చోటికి అతను వస్తే? షెంపో చిన్నగా నవ్వుకున్నాడు. అది అతని తలనొప్పి!

షెంపో కిందికి దిగి గేటుతోసుకుని వేగంగా నడిచాడు. వరండా మీదికి ఎక్కాడు. కాలింగ్ బెల్ బటన్ మీదున్న గంటని చూపుడు వేలితో నొక్కాడు. ఛెయిమ్స్ ధ్వనించాయి. మెత్తటి అడుగుల చప్పుడు మూసిన తలుపు వెనక ధ్వనించింది.

"ఎవరు?" తలుపు తెరిచిన స్త్రీ ప్రశ్నార్థకంగా చూస్తూ అంది.

"మీరే!" షెంపో నవ్వుతూ అన్నాడు. పసుపుపచ్చ దుస్తుల్లో ఆమె అందంగా వుంది.

ఆమె కళ్ళు చిట్లించింది. "మీరెవరు?"

"డిటెక్టివ్ షెంపో."

చిట్లించిన ఆమె కళ్ళు విశాలంగా అయ్యాయి. "ఆయన లేరు...."

"ఆయన వచ్చేదాకా మీతో మాట్లాడుతూ కూచుంటాను...." షెంపో చొరవగా కదిలాడు. ఆమె వెనక్కి జరిగింది.

డిటెక్టివ్ షెంపో తలుపుని మూస్తూ, దానికి వీపు ఆనించి నిలబడ్డాడు. ఆమె అర్థంకానట్టు చూస్తోంది.

తలుపు మూసి తను అలా నుంచోడం ఆమెకి కంగారు పుట్టిస్తోందని అతనికి తెలుసు. కొంచెం ఎర్రబారిన ఆమె కళ్ళల్లోకి అతను రెప్పపాటుకాలం చూశాడు.

"కృత్తివాసరావు హత్యచేయబడ్డాడు. ఆ విషయం గురించి పరిశోధనచేస్తూ ఇలా వచ్చాను" అన్నాడు.

ఆమె మొహాన్ని ఏదో భావం తెరలా కప్పేసింది. మెల్లిగా వెనక్కి తిరిగి ఆమె అతనికి సోఫా చూపించింది. "కూచోండి....ఆయన ఎప్పుడొస్తారో తెలీదు...."

టెంపో సోఫాలో కూచుని ఆమెవైపు చిరునవ్వుతో చూశాడు. ఆమె లోపలి గదివైపు తిరిగి, కదిలింది.

"మీ పేరు...."

టెంపో కంఠం ఆమెని ఆపింది.

"సుధ" వెనక్కి తిరిగి అందామె. (సశేషం)

తారుమారైన పని!



జొన్నలగడ్డ రామలక్ష్మి

దెయ్యాలున్నాయి

నాకు దెయ్యాలంటే ఏ మాత్రం నమ్మకంలేదు. నా స్నేహితుడు రఘునాధ్‌కి మాత్రం అవంటే పిచ్చినమ్మకం. వాడెప్పుడూ రాత్రిళ్ళు ఒంటరిగా వుండడు. ఎవరో ఒకరు తోడు కావాలి. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యేదాకా నేనే ఆ తోడుగా వుండేవాణ్ణి.

మా యిద్దరివీ పక్కపక్క యిళ్ళు. మేమిద్దరం ఒకే

క్లాసు. తరచుగా కంబైన్డ్ స్టడీస్ చేసేవాళ్ళం.

ఉద్యోగా లొచ్చేక ఎద్దరం విడిపోయాం. ఉన్న ఊరు వదులుకుని పొరుగు రాష్ట్రాల్లో ఉంటున్నాం. అయినా మా మధ్య తరచుగా ఉత్తరాలు నడుస్తున్నాయి.

రఘునాథ్ ట్రైబల్ ఏరియాలో ప్రభుత్వోద్యోగి. ప్రభుత్వం ప్రజలకిచ్చే సదుపాయాలేమిటో వారికి తెలియ జెప్పడం. ట్రైబల్స్కున్న మూఢవిశ్వాసాలను తొలగించి, వారి మానసిక వికాసానికి తోడ్పడడం వాడి బాధ్యతలు. ఉద్యోగం వాడికి నచ్చినట్లే వుంది.

దెయ్యాల్ని నమ్మే రఘునాథ్ ఆదిమవాసుల మూఢ విశ్వాసాలను తొలగించగలడా అని నేను వేళాకోళం చేస్తూండేవాణ్ణి. దానికి బదులుగా వాడు—"మానవాతీత శక్తుల్ని విశ్వసించడంలో తప్పులేదు. ఆ విశ్వాసం మూఢాచారాల నరికట్టడానికి అడ్డురాదు" అనేవాడు.

"ఆదిమవాసుల మూఢవిశ్వాసాలకు మానవాతీత శక్తుల్ని విశ్వసించడం కూడా ఒక కారణం కాదం టావా?" అన్నానొకసారి.

"మూఢవిశ్వాసాలు రెండు రకాలు. ఇతరులకు హాని కలిగించేవి, కలిగించనివి. సర్వమానవ సమానత్వాన్ని గుర్తించకుండా సాటి మనిషిని హీనపరిచి కించపరిచేవీ, నరబలులకు దారితీసేవి అయిన మూఢవిశ్వాసాల్ని ప్రతి ఒక్కడూ ఖండించాలి. ఇక మానవాతీత శక్తుల్ని నమ్మడ మంటావా—ఎంతోమంది తప్పులు చేయడానికి సంకో చిస్తున్నారంటే అందుక్కారణం ఉన్నాడో లేడో తెలి యని దేవుడికి భయపడడమే కదా!" అన్నాడు రఘునాథ్.

వాడు చెప్పింది అక్షరాలా నిజం.

నేను నీతినీ, నిజాయితీనే తప్ప దేవుణ్ణి కూడా నమ్మను. ఇప్పుడు నా ఉద్యోగం నాకు సవాలయింది. నగరంలో ప్రముఖులందరూ నా చుట్టూ తిరక్క తప్పదు. నేను సాధారణ గుమాస్తాని.

ఊళ్ళో కనస్ట్రక్షన్‌కి సంబంధించిన ఫైల్సన్నీ నా ద్వారానే వెడతాయి. వాటిలో లొసుగులు లేకుండా చూడాలి నేను అలా చూసినందుకు ప్రభుత్వం నాకు నెలకు పదిహేనువందల రూపాయల జీతమిస్తుంది. ఎందరో పూట తిండికి అల్లాడుతున్న ఈ దేశంలో నాకది చాలా పెద్దజీతమే అనిపిస్తుంది. కానీ—

ఫైల్సులో లొసుగుల గురించి మాట్లాడకపోతే, వాటిని చూసి కూడా చూడనట్లు నటిస్తే, లొసుగుల కారణంగా ఫైల్సును ఆపకపోతే కొందరు నాకు నెలకు అయిదారు వేలదాకా యిస్తారు. నాకా డబ్బుమీద ఆశ లేదు, మోజులేదు. అందుకే నేను ఆరంభంలో నీతి, నిజాయితీల కోసం ఫైల్సును శ్రద్ధగా చూసేవాణ్ణి.

ఉడతాభక్తి మంచిదే! కానీ ఉడతాభక్తివల్ల ఉడతకు శ్రమే తప్ప సాధించగలిగినదేమీ వుండదు.

నాకైతే ఇంకా ప్రమాదాలు కూడా ఎదురొచ్చాయి.

మా సంస్థ మొత్తంమీద నేనొక్కణ్ణీ ఒకటి—మిగతా అందరూ ఒకటి!

ఫైల్సులో లొసుగులు చూడడంవల్ల బయట కొందరికే కాక ఆఫీసులో అందరికీ శత్రువునయ్యాను నేను.

ఒకసారి బాస్ నన్ను పిలిచాడు.

"మిస్టర్ రావ్! నేను నీ శ్రేయోభిలాషిని" అంటూ ప్రారంభించాడాయన.

నేనాయన చెప్పేది శ్రద్ధగా విన్నాను.

"ఈ దేశ మొక విషవలయం. ఇందులో ప్రతిమనిషీ తన్ను తాను రక్షించుకునేందుకు ప్రయత్నించాలి తప్ప పక్కవాడి క్షేమం గురించి ఆలోచించకూడదు. అర్థమయిందా?"

"నా బాధ్యతల్ని నేను సక్రమంగా నిర్వహించకపోతే నన్ను నేను రక్షించుకోగలనా?" ఎదురుప్రశ్న వేశాను.

"నీ బాధ్యతలు నువ్వు సక్రమంగా నిర్వహించకపోతే మేమందరం నిన్ను రక్షిస్తాం. నీ బాధ్యతల గురించే ఆలోచించావంటే నిన్ను రక్షించాలనుకునేవాడు ఒక్కడు కూడా వుండడు."

"ఎందుకని?"

"వరద లొచ్చాయనుకో. ఆ వరదల్నాపడానికి నువ్వొక్కడివే మాత్రం ప్రవాహానికి ఎదురునిలిస్తే ఏమవుతుంది? ఆ వరదల్లో నువ్వు కొట్టుకునిపోతావు."

"వరదల్నాపడానికి ప్రయత్నించకపోతే మొత్తం మానవాళికే ప్రమాదం కదా!"

బాస్ నవ్వాడు ఆ నవ్వులో నా అమాయకత్వంపట్ల జాలి స్పష్టంగా కనబడింది—"డియర్ రావ్! ప్రపంచంలో కొన్ని వేలయేండ్లుగా వరద లొస్తూనే వున్నాయి. మానవాళి నాశన మయిందా? వరదలు, క్షామం ప్రకృతి సహజం ఒకోసారి అవి మానవ కల్పితాలు కూడా! నీకు తెలుసో తెలియదో—గత సంవత్సరం వచ్చిన వరదలు ప్రకృతిసహజం కాదు...."

"అంటే?"

"ప్రజల్లో తమకు పలుకుబడి తగ్గుతోందనిపించి నప్పుడు ప్రభుత్వం తన యంత్రాంగా న్నుపయోగించి వరదల్ని సృష్టించి—తర్వాత తన యంత్రాంగంతోనే

వరద బాధితులకు సాయపడి పేరు తెచ్చుకుంటుంది. అలాంటి ప్రభుత్వాలను మళ్ళీ మళ్ళీ ఓట్లేసి ఎన్ను కుంటారు ప్రజలు. దీన్నిబట్టి నీకేం తెలిసింది? వరదల కెదురు నిలవడమంటే ప్రభుత్వాని కెదురు తిరగడమే అన్నమాట! అంటే నువ్వు ప్రభుత్వోద్యోగిగా ఉంటూ వ్యతిరేకి వవుతున్నావు. ఇదేనా నీ బాధ్యత!"

ఈ విపరీత తర్కానికి తెల్లబోయాను.

నాకు తెలుసు. మా ఊరి మునిసిపల్ చెయిర్మన్ మురికివాడలో ఇళ్ళన్నీ తనే అంటింపజేసి ఆ తర్వాత వాళ్ళకు నష్టపరిహారం అందజేసి—ఆ కారణంగా ఎన్ని కల్లో నెగ్గాడు.

బాస్ మాటలు నాపై ప్రభావం చూపుతున్నాయి.

"నీ కారణంగా ఇబ్బందిపడే ఆ కొందరూ ఎవరను కుంటున్నావ్? వాళ్ళు ప్రభుత్వ పక్షానికి దగ్గర బంధువులు. ఆ విధంగా ప్రజాబంధువులు. నేనీవిధంగా నీకు చెబు తున్నానని నువ్వు గొప్పవాడిననుకోకు. క్షణాలమీద నిన్ను నల్లిలా నలిపేయొచ్చు. నేను నీ శ్రేయోభిలాషిని. అంతే!"

ఆ తర్వాత బాస్ నా కింకేమీ చెప్పలేదు. ఆయన నా కింకేమీ చెప్పాల్సిన అవసరమూ రాలేదు.

"దెయ్యాలున్నాయి. వాటికి భయపడాలి" అన్న నిర్ణ యానికి వచ్చాను. దెయ్యాలకు భయపడ్డంవల్ల నా ఆర్థిక పరిస్థితి మెరుగవుతోంది. అది మెరుగవుతున్నకొద్దీ నాలో పాపభీతి పెరిగి—క్రమంగా నేను దేవాలయానికి వెళ్ళడం ప్రారంభించాను.

నాకు దెయ్యాలపై నమ్మకం కుదిరినట్లూ, దేవాలయా నికి వెడుతున్నట్లూ రఘునాధ్ కు త్తరం రాశాను.

వాడినుంచి వెంటనే బదులు వచ్చింది.

"నువ్వు నిజంగా దెయ్యాల్ని నమ్మితే నాకు సంతోషమే! కానీ నువ్వు వ్రాసిందాన్నిబట్టి నువ్వు మనుషుల్లో దెయ్యాల్ని చూస్తున్నట్లు కనబడుతోంది. ఆ భయంతో నువ్వు దైవభక్తిని పెంపొందించుకుంటే అది విచారించవలసిన విషయం. మానవాతీత శక్తులు నిజంగా ఉన్నాయి. అందుకు సంబంధించి నాకు కొన్ని విచిత్రానుభవాలయ్యాయి. అవన్నీ నీకు మనం కలుసుకున్నప్పుడు చెబుతాను. అన్నింటికీ మించిన అపూర్వానుభవమొకటి రేపే పొందనున్నాను. ఆ వివరాలు వచ్చే ఉత్తరంలో రాస్తాను. వేచివుండు."

ఆ ఉత్తరం నాలో కుతూహలాన్ని లేపింది.

2

సరిగ్గా పదిరోజుల తర్వాత నాకో ఉత్తరం వచ్చింది రఘునాథ్ దగ్గర్నుంచి. ఉత్తరం చదివి తెల్లబోయాను.

ఆ ఉత్తరం ప్రకారం రఘునాథ్ చచ్చిపోయాడు. ఉత్తరం రాసింది రఘునాథ్ ఆత్మ! తను చనిపోయినట్లు తెలిస్తే తల్లిదండ్రులు గుండె ఆగి మరణిస్తారని వాడు కొన్ని అద్భుతశక్తులద్వారా మనిషిలాగే మసులుతున్నాడు. ఈ విషయం ఇంకెవరికీ చెప్పొద్దని రాశాడు. దెయ్యాలున్నాయన్న నమ్మకం నాక్కలిగించడం కోసం వాడు నాకీ ఉత్తరం రాశాడు. త్వరలోనే వాడు నన్ను కలుసుకుంటాడు కూడా! ఉత్తరం రాసింది మానవాతీత శక్తి అనడానికి ఋజువేమిటంటే—నేను చదవడం అయ్యాక ఓ గంటలోగా ఉత్తరం దానంతటదే అంటుకుని మండిపోతుంది.

నిజంగానే ఉత్తరం అలాగే మండిపోయింది.

నాకు వళ్ళు జలదరించిందప్పుడు. అయితే శ్రీమతికి

కూడా నేనీ విషయం చెప్పలేదు – భయపడుతుందని!

రోజూ సాయంత్రం విధిగా దేవాలయానికి వెడుతూంటాను. శనివారాలైతే కుటుంబ సమేతంగా వెడతాను కానీ మిగతా రోజుల్లో నేనొక్కడినే వెడతాను. నేను గుడికి బయల్దేరగానే శ్రీమతి వంట ప్రారంభిస్తుంది. గుడి మా యింటికి సుమారు కిలోమీటరు దూరంలోవుంది. అక్కడికి వచ్చే జనం తక్కువ. శనివారాలు మాత్రం కాస్త రష్‌గా ఉంటుంది. గుడి పూజారితో నాకు మంచి స్నేహమయింది. నాకు వచ్చే అక్రమ సంపాదనలోంచి రోజూ పదిరూపాయలాయనకు దక్షిణగా ఇచ్చుకుంటాను. అందుకని ఆయనకు నేనంటే అభిమానం!

పూజారితో కాసేపు కబుర్లు చెప్పి ఇంటికి తిరిగి వెళ్ళే సరికి వంటైపోతుంది. అప్పుడు కలిసి భోంచేస్తాం.

పూజారి ఆజానుబాహుడు. ఆయన ముఖంలో దివ్య తేజస్సుంటుంది. ఆయన మాటల్లో బ్రహ్మజ్ఞానం, లోక జ్ఞానం రెండూ ధ్వనిస్తాయి.

పూజారికి దైవశక్తి అంటే అపారమైన నమ్మకం. ఆయన నాకు ధైర్యాన్నిస్తూంటాడు.

"నువ్వు తప్పుచేయడంలేదు. ఈ ఆలయాన్నే నమ్ముకున్న నాకు సాయపడడం కోసం దేవుడు నీచేత కొన్ని కార్యాలు చేయిస్తున్నాడు. ఈ ప్రపంచంలో తప్పొప్పులేవీ మనిషివికావు. అన్నీ దేవుడివి—" అంటాడాయన.

"అయితే ప్రతివాడూ దేవుడికే బాధ్యత నంటగట్టి దురాగతాలకు దిగితే?" అని నేనోసారి సందేహాన్ని వెలిబుచ్చాను.

"అదే సృష్టి విచిత్రం. మనిషి కావాలని కూడా దుర్మార్గుడు కాలేడు. అందుకే నాగరకత ఏర్పడి నానాటికీ

మానవజాతి వృద్ధి పొందగల్గుతోంది" — అన్నాడు పూజారి.

ఆ రోజు కూడా ఆయనతో నాకు వచ్చిన ఉత్తరం సంగతి చెప్పాను. అది విని పూజారి నవ్వాడు.

"నా కళ్ళెదుటే ఉత్తరం మండిపోయింది" అన్నాను.

"నువ్వు లెటర్ బాంబ్సు గురించి వినలేదా?" అన్నాడు పూజారి.

కవరు ఓపెన్ చేయగానే పేలి మనుషుల్ని చంపే లెటర్ బాంబ్సుగురించి చాలాసార్లు పేపర్లలో వచ్చింది. కాగితానికి కొన్ని రసాయనాలను పూయడం ద్వారా కవర్లోంచి తీసిన కాసేపటికది మండిపోయేలా చేయవచ్చు. అది మానవాతీత శక్తికాదు.

"మరి రఘునాధ్ నాకలా ఉత్తరమెందుకు రాశాడంటారు?"

"నీ స్నేహితుడు నీతో ఏదో తమాషా చేస్తున్నాడు."

"ఎందుకు?"

"ఎందుకంటే నేనేం చెప్పను? మీ యిద్దరి స్నేహం ఎలాంటిదో నాకేం తెలుస్తుంది? చాలామంది స్నేహితుల మధ్య ఇలాంటి తమాషాలు జరుగుతూంటాయి" అన్నాడు పూజారి.

"అంత కచ్చితంగా ఇది తమాషా అని మీరెలా చెప్పగలరు?"

"ఎందుకంటే దెయ్యాలు లేవని తెలిసినవాణ్ణి కాబట్టి."

"దేవుడున్నప్పుడు దెయ్యాలుండవా?"

"ఈ సృష్టికి మూలం దేవుడు. ఆయన లేనిదే ఈ సృష్టికి ఉనికిలేదు. దేవుడు మనని సృష్టిస్తే మనం దెయ్యాల్ని సృష్టించుకున్నాం" అన్నాడు పూజారి.

"అంతేనంటారా?"

"అంతే _ నీ స్నేహితుడు నీ దగ్గరేం ట్రిక్కువేసినా లొంగకు. అతణ్ణి నా దగ్గరకు తీసుకునిరా! అసలురంగు బయటపెడతాను—"

ఆయన మాటలు నమ్మితే-నా రఘునాధ్ బ్రతికున్నట్లు! అందుకే నమ్మాను.

3

ఒకరోజు తెల్లవారు ఝామున నాలుగు గంటలకు మా యింటి కాలింగ్‌బెల్ మ్రోగింది.

"పాలవాడొచ్చాడు. వెళ్ళి పాలోయించుకోరూ!" అంది శ్రీమతి గోముగా.

ఆమె అలా అడిగితే కాదనలేను.

గిన్నె తీసుకుని వెళ్ళి తలుపుతీస్తే బయట నిలబడ్డవ్యక్తి పాలవాడుకాదు. నా వాలకాన్ని చూసి— "ఏరా—నేను పాలు తీసుకునివస్తే తప్ప లోపలకు రానివ్వవా—ఇదేం బంధుమర్యాదరా!" అన్నాడు రఘునాధ్.

"నువ్వేనా?" అంటూ పక్కకు తప్పుకున్నాడు.

వాడు లోపలకు వచ్చి తలుపేశాడు.

"నీ ఉత్తరం చూసి చాలా కలవరపడ్డాను. నిన్నిలా చూడగలగడం నాకెంతో సంతోషంగా ఉంది" అన్నాను.

రఘునాధ్ నిట్టూర్చి—"నువ్వు మాత్రమే నన్ను చూడగలవు. ఆ విషయం దృష్టిలో ఉంచుకో. లేకుంటే నలుగురూ నిన్ను పిచ్చివాడనుకోగలరు" అన్నాడు.

అంతలోనే కాలింగ్‌బెల్ మ్రోగింది మళ్ళీ.

"తలుపవతల పాలవాడున్నాడు. ఆ చేతిలో గిన్నె నాకిచ్చి నువ్వు పక్కకు తప్పుకుని తమాషా చూడు" అన్నాడు రఘునాధ్.

నేను వాడు చెప్పినట్లే చేశాను.

రఘునాథ్ తలుపుతీసి పాలు పోయించుకున్నాడు. పాలవాడు వాడితో — "అమ్మగారి వంట్లో బాగోలేదా బాబూ—మీరొచ్చారు!" అన్నాడు.

నేనాశ్చర్యపోయాను.

పాలవాడు వెళ్ళిపోగానే రఘునాథ్ తనే తలుపులు వేసి — "నేను వాడికి నీ రూపంలో కనిపించాను" అన్నాడు.

నా ఒళ్ళు జలదరించింది.

"ఏమిట్రా — నన్ను భయపెట్టాలనుకుంటున్నావా?" అన్నాను.

"చాలా అన్యాయంరా ఇది! బ్రతికున్నంత కాలం నీ ప్రాణస్నేహితుణ్ణి ప్రాణం పోగానే నేనంటే భయపడతావా ఇది న్యాయమా? నేను నీకు అపకారం చేస్తానా?" అన్నాడు రఘునాథ్.

"తమాషా చేయక అసలేం జరిగిందో చెప్పు—"

"తమాషా సంగతలాగుంచు. నువ్వు పడగ్గదిలోకి వెళ్ళు. నేనూ నీ పక్కనే నిలబడతాను. అప్పుడేం జరుగుతుందో చూడు" అన్నాడు రఘునాథ్.

వాడి మాటలు, ప్రవర్తన అంతా చిత్రంగా ఉన్నాయి. నాలో ఏ వంత భయం కూడా చోటు చేసుకుంటోంది.

పాలగిన్నె డైనింగ్ టేబిల్ మీద పెట్టి—ఓ స్టీలు కంచాన్ని గిన్నెమీద మూతపెట్టాక—ఇద్దరం బెడ్రూంలో అడుగు పెట్టాం.

శ్రీమతి నిండా ముసుగుతన్ని పడుకుని ఉంది. నేనామెను ముందుకు వంగి తట్టిలేపాను.

"ఊఁ" అని బద్ధకంగా మూలిగిందామె.

"ఇలా చూడు" అన్నాను.

ఆమెకు మత్తులో కళ్ళు విడడంలేదు. నా అరుపు నన్నే భయపెట్టేలా వుంది.

శ్రీమతి ఉలిక్కిపడి లేచికూర్చుని—"అదేమిటండీ అలా అరిచారు!" అంది.

ఆమె మత్తు పూర్తిగా విడిపోయింది. రెండూ కళ్లూ పెద్దవిచేసి నా వంక భయంగా చూస్తోంది.

"ఎవరొచ్చారో చూడు—" అన్నాడు పక్కనే నిలబడి ఉన్న రఘునాథ్‌ని క్రీగంట చూస్తూ.

"ఏమిటండీ ఈ తమాషాలు! కాసేపు నిద్రపోనివ్వకుండా ఏమిటిది — రండి, పడుకుందాం—" అంటూ శ్రీమతి చేయిపట్టుకుని మంచంమీదకు లాగింది. నేను బ్యాలన్సుతప్పి ఆమెమీద పడ్డవాడినే ఎలాగో తమాయించుకుని లేచి నిలబడ్డాను.

"ఛీ—ఏమిటిది—సిగ్గులేకుండా—" అన్న మాటలు అప్రయత్నంగా నానోట వచ్చాయి.

"ఆమెనేమీ అనకు. నేనామెకు కనబడ్డంలేదు" అన్నాడు రఘునాథ్ నాతో నెమ్మదిగా.

అది నిజమే అయుండాలి, లేకుంటే శ్రీమతి ఇతరుల యెదుట అలా ప్రవర్తించదు. కానీ నా పక్కనే నాక్కనబడుతున్న రఘునాథ్ ఆమెకు కనబడ్డంలేదంటే ఎలా నమ్మేది?

"ఈ పక్కనెవరూ నీక్కనబడ్డంలేదా?" అంటూ రఘునాథ్ భుజంమీద చెయ్యివేసి ఉలిక్కిపడ్డాను.

నాకు వాడి శరీరం చేతికి తగలడంలేదు.

కంటికి కనబడే శరీరం చేతికెందుకు తగలదు?

అంటే రఘునాధ్ నిజంగానే దెయ్యమయ్యాడా?

అప్రయత్నంగానే కెవ్వుమన్నాను!

4

ఆ రోజు మధ్యాహ్నందాకా రఘునాధ్ ఇంట్లోనే ఉండి చాలా తమాషాలు చేశాడు. వాడు దెయ్యమయ్యాడనడంలో నాకేం సందేహంలేదు.

శ్రీమతి కూరలు కావాలంటే నేను పక్క సందులో దుకాణం దగ్గరకు వెళ్లాను. వాడు నాతో వచ్చాడు కానీ ఎవరికీ కనబడలేదు. వాటి మాటలు నేను వింటున్నాను. బదులివ్వాలంటే చుట్టుపక్కలవాళ్ళు పిచ్చివాడనుకుంటారని భయంగా కూడా ఉంది.

మధ్యాహ్నం వాణ్ణి భోజనానికి బలవంత పెట్టాను.

"నీ భార్య భయపడుతుంది. నేను నీకు మాత్రమే కనబడగలను. ఆమెకు కనబడలేను" అన్నాడు రఘునాధ్.

"మరి ఇందాకా పాలవాడికి కనబడ్డావు!"

"అది నా రూపంలో కాదు. నీ రూపంలో! కావాలంటే నీ భార్యకూ కూడా కాసేపు నీ రూపంలో కనబడగలను. అప్పుడామె కంగారు పడుతుంది."

"ఏమైనాసరే—నువ్వు నా యింట్లో భోంచేసితీరాలి!" అంటూ పట్టుబట్టాను. అప్పుడు రఘునాధ్ నాకో ఉపాయం చెప్పాడు.

ఆ ప్రకారం నేను శ్రీమతితో పందెం కాశాను.

"వంటలు చాలా బాగున్నాయి కాబట్టి వరుసగా రెండు సార్లు మామూలుగా భోంచేయగలను."

కాస్త టిఫినెక్కువ తింటేనే నా భోజనం చెడిపోతుంది. నా పందేనికి శ్రీమతి బాగా ఆశ్చర్యపడింది. మొదటిసారి రఘునాధ్ నా రూపంలో భోంచేశాడు.

రెండోసారి నేనే భోంచేశాను. నేను పందెం నెగ్గాను.

శ్రీమతి ఆశ్చర్యపడింది. నా ఆశ్చర్యం వేరేగా వుంది.

"మనం పూజారి వద్దకు వెడదాం. ఆయన దెయ్యాల్లేవంటాడు. నువ్వేమైనా తమాషాలు చేస్తే తను సమాధానం చెబుతాననీ. నిన్ను నా దగ్గరకు రమ్మనమనీ ఆయనన్నాడు. ఈ రోజు సాయంత్రం మన మాయన దగ్గరకు వెడదాం" అన్నాను నేను రఘునాధ్‌తో.

"ఈ రోజు వద్దు. నేను మా ఊరెళ్ళాలి. ఇంకో గంటలో ట్రయినుంది. సరిగ్గా రెండువారాల తర్వాత వస్తాను. కావాలంటే పూజారి దగ్గరకు అప్పుడు వెడదాం" అన్నాడు రఘునాధ్.

నే నెంత బలవంతపెట్టినా వినకుండా వాడు మధ్యాహ్నమే వెళ్ళిపోయాడు. వాడు వెళ్ళగానే నాకు వళ్ళు తెలియని నిద్ర పట్టింది. సాయంత్రం శ్రీమతి లేపేదాకా మెలకువ రాలేదు.

"ఈ రోజు మీ ప్రవర్తన చిత్రంగా ఉంది. ఆఫీసుకు వెళ్ళలేదు. చాలాసేపు మీతో మీరే మాట్లాడుకున్నారు. నాతో విచిత్రమైన పందెం కట్టి నెగ్గారు. అసలేం జరిగింది? వంట్లో బాగోలేదా....?" అంది శ్రీమతి.

నేనామెకు సరైన సమాధానమివ్వలేదు. సాయంత్రం గుడికి మాత్రం వెళ్ళాను.

పూజారి నన్నాప్యాయంగా పలకరించాడు.

నేనాయనకు జరిగిందంతా చెప్పాను.

"కలగన్నావేమో!" అన్నాడాయన అంతా విని.

"కలకాదు—నిజం! కావాలంటే మా యింటికి రండి.

మా ఆవిర్భదగండి" అన్నాను. కనీసం నేను విచిత్రంగా ప్రవర్తించినట్లామె పూజారికి చెప్పగలదు.

"అవసరంలేమలే—నిన్ను నేను నమ్ముతాను—" అన్నాడాయన.

"నన్ను నమ్మితే మీరిక దెయ్యాన్ని కూడా నమ్మాలి" అన్నాను.

"నీ స్నేహితుణ్ణి నా దగ్గిరకు తీసుకురా। నీ భ్రమలు తొలగిస్తాను" అన్నాడు పూజారి గంభీరంగా.

"సరిగ్గా రెండువారాల తర్వాత తీసుకొస్తాను—" అన్నాను.

5

రెండు వారాలు తమాషాగా గడిచిపోయాయి. అనుకోకుండా నేను ఆఫీసు పనిమీద టూర్ వెళ్ళాను. తిరిగివచ్చేసరికి శ్రీమతి నాకో విచిత్రవార్త చెప్పింది.

రఘునాథ్ నుంచి నాకుత్తరం వచ్చిందిట. అందులో రాసిన ప్రకారం ఈ రోజు సాయత్రం నేను రైల్వే స్టేషన్‌కు వెళ్ళాలి. అక్కడ వాణ్ణి ట్రయిన్‌లో రిసీవ్ చేసుకుంటే యిద్దరం సరాసరి వెళ్ళి పూజారిని కలుసుకుంటాం!

"ఉత్తరమేదీ?" అన్నాను.

"ఏమోనండీ—చదివి బల్లమీద పెట్టాను. ఎవరంటించారో ఏమో—తర్వాత చూస్తే ఉత్తరం బొగ్గయి ఉంది" అంది శ్రీమతి.

నా వళ్ళు జలదరించింది.

శ్రీమతి ప్రశ్నలకు నేను జవాబు చెప్పలేదు. ఆమెకు రఘునాథ్ ఉత్తరం వ్రాసినట్లూ ఆ తర్వాత మా యింటి

కొచ్చి వెళ్ళినట్లూ తెలియదు. అందుకని అతడింటికి రాకుండా సరాసరి గుడికెందుకు వెదకామని రాళాదో అర్థం కావడంలేదు. నేనామెకు వివరించి చెప్పదల్చుకో లేదు.

సాయంత్రం స్టేషనుకు వెళ్ళాను.

ట్రయిన్‌లో దిగాడు రఘునాథ్. వాడు సామాను క్లోక్ రూంలో పెట్టి నాతో బైటకు వచ్చాడు.

"నువ్వు మనిషివే ననడంలో నాకు సందేహం లేదు. వెళ్ళేటప్పుడూ, వచ్చేటప్పుడు కూడా ట్రయిన్ ప్రయాణం చేశావు. ట్రయిన్ అవసరం మనిషికే కదా! ఆత్మకైతే మనోవేగముంటుంది" అన్నాను.

రఘునాథ్ నవ్వి—"నీలో ఆ మాత్రం సంశయం రేగాలనే నేనలా చేశాను. కావాలంటే నేనే కాదు, నువ్వు కూడా మనోవేగంతో ప్రయాణించేలా చేయ గలను. ఒక్కసారి కళ్ళు మూసుకో" అన్నాడు.

నేను కళ్ళు మూసుకున్నాను. మరుక్షణానికే రఘునాథ్ కళ్ళు తెరవమన్నాడు. కళ్ళు తెరిచేసరికి ఇద్దరం ఆలయ ప్రాంగణంలో ఉన్నాము.

"పూజారిని పిలు" అన్నాడు రఘునాథ్.

నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది.

"పూజారిగారూ!" అన్నాను.

కొన్నిక్షణాల్లో పూజారి కనబడ్డాడు నాకు—"నా స్నేహితుణ్ణి తీసుకొచ్చాను—" అన్నా నాయనతో.

అయితె నా పక్కనే ఉన్న రఘునాథ్ పూజారికి కన బడలేదు. ఆయన ఆశ్చర్యంగా—"ఏడీ—నీ స్నేహి తుడు?" అన్నాడు.

రఘునాథ్ నా పక్కనే ఉన్నాడంటే ఆయన నమ్మడు. ఇద్దరికీ కాసేపు వాగ్వివాద మయ్యేక ఆయన నెమ్మదిగా—"నిన్నొకసారి పరీక్షించనీ—నా కేదో అనుమానంగా ఉంది" అన్నాడు.

ఆయన ఉద్దేశ్యం నా కర్థంకాలేదు. ఆయన నన్ను ప్రశ్నలు వేస్తాడనుకుంటే వళ్ళంతా తడిమాడు. నా చొక్కా జేబులో అగ్గిపెట్టెలాంటి వస్తువు దొరికింది. ఆయన దాని వంకే పరీక్షగా చూస్తూ—"అంతా అర్థమయింది నాకు" అన్నాడు.

"ఏమిటర్థమయింది?" అన్నాను.

పూజారి అగ్గిపెట్టెలోకే చూస్తూ—"నాయనా! రఘునాథ్—నీ నాటకం నాకు తెలిసిపోయింది. ఇక నీ ఆట కట్టిపెట్టి ఇక్కడకు రా—" అన్నాడు. ఆ తర్వాత మరో అయిదు నిముషాలకి రఘునాథ్ అక్కడికి వచ్చాడు. పూజారివంక ఆశ్చర్యంగా చూస్తూ—"నా రహస్యం మీ రెలా తెలుసుకున్నారు?" అన్నాడు.

"అన్నీ తర్వాత చెబుతాను. ముందు నువ్వు చేసిన తమాషా నీ స్నేహితుడికి చెప్పు ...—" అన్నాడు పూజారి.

రఘునాథ్ చెప్పింది విని నే నాశ్చర్యపోయాను. వాడు నన్ను భ్రమలో ఉంచడానికి హిప్నాటిజం ప్రదర్శించాడు. వాడు నా యింటికి వస్తే నేను వాణ్ణి నా భార్యకు తెలియకుండా దాచిపెట్టాను. పాలవాణ్ణి నేనే పలకరించి వాడు పలకరించాడనుకున్నాను. నేనే రెండుసార్లు ఫోంచేసి వాడొకసారీ, నేనొకసారీ అనుకున్నాను. వాడు చేసిన తమాషా అల్లా ఒక వాకీటాకీ వాడడం. నా జేబులో ఉన్న

అగ్గిపెట్టెవంటి వస్తువు అదే! దానికి కార్డ్‌లెస్ ఇయర్ ఫోన్ ఉంది. అది నా చెవిలో అమర్చాడు. వాడు మాట్లాడి నప్పుడల్లా నాకు మాత్రమే వినబడుతోంది. వినబడినప్పు డల్లా వాడు పక్కనే ఉన్నాడని నేను భ్రమపడు తున్నాను.

"ఇలా ఎందుకు చేశావురా?" అన్నాను.

"చూడు. ఇప్పుడు నేను దెయ్యాన్ని కాదని నమ్మితే ఇంకెప్పుడూ నువ్వు దెయ్యాన్ని నమ్మవు. నీవంటివాడిలో మానవాతీతశక్తులపై నమ్మకం మొలకెత్తడం నాకు నచ్చ లేదు. అందుకే నేనీపని చేశాను." అన్నాడు రఘునాథ్.

ఆశ్చర్యంనుంచి తేరుకునేందుకు నాకు కాసేపుపట్టింది. అప్పుడు నేను నెమ్మదిగా పూజారితో—"మీకు వాకీటాకీ గురించి ఎలా తెలుసు?" అన్నాను.

"చంద్రలావు తెలుసుగదా మీకు— ఆయిల్ మిల్లు ఓనరు. ఆయనలాంటిదే నాకు చూపించి—'ఇది నీదగ్గిర వుంచుకుని గుళ్ళో స్మగ్లింగుచేయి. ఏడాదిలో లక్షాధికారిని చేస్తాను.' అన్నాడు. అప్పుడు చూశాను—" అన్నాడు పూజారి.

"అయితే ఏడాదిలో మీరు లక్షాధికారి అన్నమాట!" అన్నాను.

పూజారి అదోలా నవ్వి- "దేవుణ్ణి నమ్ముకున్నవాణ్ణి. దెయ్యాలమాట వింటానా?" అన్నాడు.

"చంద్రలావు మిమ్మల్ని కలుసుకుని ఎంతకాల మయింది?" అన్నాను మాట మార్చుతూ.

"నాలుగురోజులు" అన్నాడు పూజారి.

"చంద్రలావు మాట కాదనడానికి నాలుగురోజులు

చాలకపోవచ్చు. మరో వారంరోజుల్లో మీ అభిప్రాయాలు మారతాయి" అన్నాను. నేను పరిస్థితులకు లొంగినవాణ్ణి కావడంవల్ల పూజారివంటి వారి తోడుకోసం ఎదురు చూస్తున్నాను.

పూజారి నవ్వి ఊరుకున్నాడు. రఘునాధ్ పూజారికి వినయంగా నమస్కరించాడు. దైవదర్శనం చేసుకున్నాక ఇద్దరం ఇంటిముఖం పట్టాం. దారిలో రఘునాధ్ పూజారిని పొగిడి- "ఆయన సాయంలేకపోతే నేను దెయ్యాన్ని కాదని ఋజువుచేయడం నీవల్లనయ్యేదికాదు. అవునా?" అన్నాడు.

"అవును. ఆయన చాలా ప్రాక్టికల్ మనిషి. నా తప్పులు నన్ను క్రుంగదీయకుండా కాపాడుతున్న మహా మనిషి. బహుశా తనూ యికముందు నా దారిలోనే నడవాల్సి ఉంటుంది. నన్నే ప్రోత్సహించినవాడు తను తప్పు చేయడా?" అన్నాను.

ఇద్దరం యిల్లు చేరేసరికి ఇంట్లో ఓ పాప ఉంది. ఆమె పూజారి కూతురట. నాలుగు రోజుల్నించి పూజారి కనబడ్డంలేదని చెప్పిందామె. పూజారి ఆమెకు మాయింటి అడ్రసిచ్చి ఏ యిబ్బందిఉన్నా చెప్పుకోమన్నాట్ట.

ఆమె మాటలు నా కాశ్చర్యాన్ని కలిగించాయి. ఆమెను తీసుకుని గుడికి వెళ్ళాం. అక్కడ ఛాయల్నిబట్టి నాలుగు రోజులుగా దేవుడికి పూజాపునస్కారాలు జరుగుతున్నట్లు లేదు.

పూజారి ఆలయంలోనే ఎక్కడో దాగుంటున్నాడేమో-పంచప్రాణాలు పోతున్నాయి రాధవుకి భయపడి! ఈ అభిప్రాయంలో ఆలయమంతా వెతికాం. పూజారి దొరకలేదు.

చివరకు పోలీసు రిపోర్టు ఇచ్చాం.

ఆరాత్రి ఆలయానికి బాగా వెనుకగా పొదల్లో పూజారి శవం దొరికింది. డాక్టరు చెప్పినప్రకారం పూజారి చావు చాలా రోజులక్రితమే జరిగింది.

అయితే నేను. రఘునాధ్ చూసిం దెవరిని?

దెయ్యాలు లేవని ఋజువుచేయడానికి పూజారి దెయ్యమై వచ్చేడా? పాపం చేయనని ప్రాణాలకు తెగించిన పూజారిని దెయ్యమయ్యాడనగలమా? పూజారి చావుకు కారకుడైన చంద్రావు బ్రతికుండీ దెయ్యంకాడా?

నాలో ఎన్నోప్రశ్నలు రేగుతున్నాయి. ఒకే ఒక్క సమాధానం అన్నింటికీ బదులుగా వస్తూంది.-"దెయ్యాలున్నాయి!" □



మధ్యవలయం

—చవాన్ సుదర్శనరావు

మధ్యాహ్నం రెండు కావస్తోంది.

బ్యాంకు మూసేవేళ ఆసన్నమయింది.

అప్పటికే బ్యాంకు లావాదేవీలు చాలవరకు ముగిసి రద్దీ తగ్గింది. కొన్ని కవుంటర్లు అప్పటికే మూతపడ్డాయి. కాని సుభాషిణి మాత్రం తన కవుంటరును మూసివేయకుండా కూర్చుంది.

కాసేపట్లో అనితా ఇండస్ట్రీస్‌వాళ్ళ చెక్కు బ్యాంకుకు

వస్తుంది. ఇందాకే ఆ కంపెనీ మేనేజరు తన బ్యాంకు మేనేజరుకు ఫోనుచేసి అయిదు లక్షల రూపాయలు సిద్ధంగా ఉంచమని చెప్పేడు. ఆ కంపెనీవాళ్ళు ప్రతి నెలా రెండవ తేదీన ఆ డబ్బు జీతాలు చెల్లించడానికి తీసి కెళ్తుంటారు. భద్రతా కారణాలవల్ల రద్దీగా వుండని సమయంలో వస్తుంటారు. ఒక్కోసారి కొద్దిగా ఆలస్యం కూడ అవుతుంది. అందుచేత సుభాషిణి ఆ కంపెనీ వాళ్ల చెక్కుకోసం అసహనంగా కాచుకొని కూర్చుంది.

ఈలోగా మరొక చెక్కు పాస్ అయి చెల్లింపుకోసం వచ్చింది.

"టోకన్ నెంబరు అరవైనాలుగు" అని పిలిచింది సుభాషిణి.

"ఎస్ మేడం" అంటూ ఒక యువకుడు కవుంటర్ సమీపించాడు. అతనివెనుక మరిద్దరు యువకులు.

"చెక్ మొత్తం ఎంత?" డబ్బు చెల్లించేముందు అందరిని అడిగేలా ప్రశ్నించింది.

"అయిదు లక్షలు."

పంద రూపాయలకు చెక్కుయిచ్చి అయిదు లక్షలు అంటున్నాడేమిటి? ఇతడు ఏ పిచ్చి ఆసుపత్రినుంచి తప్పించుకొని రాలేదుకదా అని ఆశ్చర్యపోతూ ఆ సంగతి తన మేనేజరుకు తెలియజేయాలని తన సీట్లోనుంచి లేవబోయింది.

"మేడం కదలకుండా కూర్చొని అనితా ఇండస్ట్రీస్ వాళ్ళకోసం తీసివుంచిన ఆ అయిదు లక్షలు ఇవ్వండి. రభస జరగడం నాకు ఇష్టంలేదు" పరిచితులను పలుకరిస్తున్నట్టుగా చిరునవ్వుతో అన్నాడు.

అతని చేతిలోని కర్చీఫ్‌లో దాగున్న పిస్టల్ మొన ఆమె గుండెను సూటిగా చూస్తూంది.

సుభాషిణి మొహం పాలిపోయింది. మెదడు మొద్దు బారిపోయింది. స్వేదబిందువులతో శరీరం తడిసిపోయింది.

"కొన్ని పనులు త్వరగా జరిగిపోతే మంచిది. ఆలస్యం అయితే ప్రమాదం. కంగారు పడినట్టు కనబడకుండా ఈ టోకన్ తీసుకొని డబ్బు ఇవ్వండి. అప్పుడు, ఎవరికీ అనుమానం రాదు. ఎవరికి ఏమాత్రం అనుమానం వచ్చినా ఈ పిస్టల్‌లోని గుండు మీ గుండెలో దూసుకు పోతుంది మమ్మల్ని ఎవరైనా ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తే మావాళ్ళ దగ్గిర వున్న నాటుబాంబులు పేలిపోతాయి."

కర్చీఫ్ కదలికనుబట్టి అతని చూపుడువ్రేలు ట్రిగ్గర్‌పై బిగుసుకుపోయినట్టు సుభాషిణికి స్పష్టమయింది.

ఏ క్షణంలో ఆ పిస్టల్ గర్జిసుందో!

ఏ క్షణంలో తన గుండెలో తూటా దూసుకపోతుందో!!

సుభాషిణి వెంటనే ఒక నిర్ణయానికి వచ్చి వణుకుతున్న చేతుల్తో టోకన్ అందుకొంది. యాంత్రికంగా నోట్ల కట్టలను అందించింది.

ఆమె కళ్ళు బైర్లు క్రమ్మసాగాయి. ఒళ్ళు తేలిపో సాగింది.

గట్టిగా కేకవేసి స్పృహతప్పి పడిపోయింది.

2

"నాకేమి తెలియదు....ఆ దుండగులు....ఆ దోపిడి దొంగలు...." అస్పష్టంగా కలవరిస్తోంది సుభాషిణి.

"మీకేమి భయంలేదు. కంగారు పడకండి" అన్న మాటలు విని సుభాషిణి కళ్ళు తెరిచి చూచింది.

తన ఎదుట ఓ సబ్ ఇన్‌స్పెక్టరు.

"మీరు త్వరగా తేరుకొని జరిగిన సంగతులు చెబితే మంచిది. దుండగులు తప్పించుకొని దూర ప్రాంతాలకు వెళ్ళకముందే పట్టుకొనడానికి వీలవుతుంది" అంటూ ఎస్సయి రవీంద్ర ఒక గ్లాసు మంచినీళ్ళు తెప్పించాడు.

నీళ్ళు త్రాగిన తర్వాత ఆమె కాస్త స్థిమితపడింది.

"ఈ దోపిడి ఎలా జరిగింది?"

కొన్ని నిమిషాల క్రితం జరిగిన ఆ సంఘటన తాలూకు వివరాలు తడబడుతూ చెప్పింది సుభాషిణి.

"ఆ ముగ్గురు ఎలా వుంటారు? ఎలాంటి దుస్తులు ధరించారు? వయస్సు ఎంతుంటుంది?"

"ముగ్గురిది ఇంచుమించు ఒకే వయస్సు. ఇరవై నుంచి ఇరవై రెండు లోపుగా వుంటారు. వాళ్ళ మాటలను దుస్తులనుబట్టి చదువుకొన్న వాళ్ళలా కనబడ్డారు. నా వైపు పిస్టల్ చూపి డబ్బు తీసుకొన్నవాడు నశ్యంకలర్ చొక్కా ధరించాడు. చామనచాయగా వుంటాడు. ఎత్తు సుమారు అయిదున్నర అడుగులు. కుడిబుగ్గ క్రింద గాయంవల్ల ఏర్పడిన మచ్చ.

మిగతా ఇద్దరిలో ఒకడు ఎర్రగా ఉంటాడు. మధ్య పాపిడి తీశాడు. పొడుగు సుమారు అయిదు అడుగులా నాలుగు అంగుళాలు. ఆకుపచ్చ నిలువుగీతల చొక్కా వేసుకొన్నాడు. మూడవవాడు కూడ అదే ఎత్తు. కాస్త నల్లగా వుంటాడు. నీలంరంగు గళ్ళచొక్కా ధరించాడు. ఉంగరాల జుట్టు."

3

పోలీసుస్టేషను చేరగానే రవీంద్ర తన సిబ్బందిని పిలిచి దొంగల ఆనవాళ్ళు చెప్పి ఒక జట్టును బస్సు

స్టాండుకు, మరొక జట్టును రైల్వేస్టేషనుకు పంపేడు. మూడవజట్టును రోడ్లమీద కాపలావేసి తిరుపతి నుంచి బయటిపూర్లకు వెళ్ళే వాహనాలను నిలుపుదలచేసి చెక్ చేయమని చెప్పి పంపేడు.

తర్వాత అతడు సమీపంలోవున్న అన్ని పోలీసు స్టేషన్లకు వైర్‌లెస్ ద్వారాను ఫోను ద్వారాను నేరస్థుల వివరాలు తెలియజేసి, కనబడగానే అరెస్టు చేయమని ఆదేశాలు ఇచ్చాడు.

ఏ క్షణంలోనైనా నేరస్థుల గురించి సమాచారం అందవచ్చునని అతడు స్టేషనులోనే వుండిపోయాడు.

రెండు గంటలు అసహనంగా గడిపినమీదట ఫోను మ్రోగింది. రవీంద్ర ఆత్రంగా రిసీవరు అందుకొన్నాడు.

"నేను పుత్తూరు స్టేషన్ రైటర్నుసార్. మీరు చెప్పిన ఆనవాళ్ళకు సరిపోయిన ఇద్దరు మనుష్యులు మద్రాసువైపు వెళుతున్న లారీలో ప్రయాణం చేస్తుండగా పట్టుకొన్నాము సార్. వాళ్ళను ఏమి చేయమంటారు?"

"తగిన బందోబస్తుతో మీ స్టేషన్ వ్యానులో ఇక్కడికి పంపు. వాళ్ళదగ్గర బ్యాంకు దోపిడి డబ్బేమైనా దొరికిందా?"

"లేదు సార్. వాళ్ళ జేబుల్లో కొద్దిపాటి డబ్బుతప్ప బ్యాంకును దోచుకొన్న డబ్బులేదు."

నిమిషాలు సెకండ్లు లెక్కపెడుతూ అసహనంగా కూర్చున్నాడు రవీంద్ర. వ్యానులో వచ్చి పోలీసులు తమ వెంట తెచ్చిన ఆ ఇరువురిని అప్పగించగానే వాళ్ళమీద విరుచుకుపడ్డాడు.

"యూ బాస్టర్డ్స్! గడ్డాలు మీసాలు ఇంకా సరిగా రాలేదు. బ్యాంకు దోపిడి చేయగల మొనగాళ్ళయ్యారా?" అంటూ తన చేతిలోని బేటన్‌తో చెరి నాలుగు అంటిం

చాడు.

"మాకు ఏ బ్యాంకు దోపిడీ సంగతి తెలియదుసార్. మేము సరదాగా మద్రాసుకు వెళుతుంటే త్రోవలో పోలీసులు పట్టుకొని ఇక్కడికి తీసుకొచ్చారు" అన్నాడు అందులో ఒకడు.

"భడవల్లారా! దారుణమైన బ్యాంకు దోపిడి చేసి ఏమి తెలియదని బుకాయిస్తున్నారా? మీ చేత నిజం చెప్పించడం ఎలాగో నాకు తెలుసు. ఫోర్‌నాట్‌నైన్.... ఇటురా" అన్నాడు.

"సార్...." అంటూ జమాజట్టి లాంటి ఓ బుర్ర మీసాల కానిస్టేబులు లోపలి గదిలోనుంచి వచ్చాడు.

"వీళ్ళు నిజం చెప్పడంలేదు. లాకప్పులో త్రోసి నిజం చెప్పించు."

"సరేసార్" అంటూ ఆ కానిస్టేబులు ఇద్దరి రెక్కలు పట్టుకొని "రండహే" అంటూ లాకెళ్ళసాగాడు.

కాసేపటికి ఏడ్పులతో పెడబొబ్బలతో స్టేషను మారు మ్రోగింది.

కానిస్టేబులు ఫోర్‌నాట్‌నైన్ చెమటలు తుడుచుకొంటూ రవీంద్రవద్దకు వచ్చాడు.

"అర్భకులు సార్. నాలుగు దెబ్బలు కూడ ఓర్చుకోలేక పోయారు. ఇప్పుడు నిజం చెప్పడానికి సిద్ధంగా వున్నారు" అన్నాడు.

"సరే" అంటూ రవీంద్ర లాకప్పువైపు నడిచాడు.

"ఇప్పటికైనా నిజం చెబుతారా?" హుూంకరిస్తూ అడిగేడు రవీంద్ర.

"అంతా నిజం చెబుతాం సార్" భయంగా అన్నారు ఆ ఇరువురు.

"మీ రిద్దరూ మరొకడు కలిసి బ్యాంకు దోపిడిచేశారు కదూ?"

"అవును సార్" అన్నారు ఇరువురు ఏకకంఠంగా.

"మూడవవాడు ఎవరు?"

"నిరంజన్ అని మా క్లాస్‌మేట్."

"వాడు మీవెంట రాలేదా?"

"లేదుసార్. దోపిడి జరిగిన తర్వాత ముగ్గురు కలిసి వెళ్ళడం ప్రమాదమని చెప్పి మమ్మల్ని బస్సులో నో లారీలోనో మద్రాసు రమన్నాడు. రేణిగుంట నుంచి తాను ట్రెయిన్‌లో వస్తానన్నాడు"

"దోపిడిచేసిన డబ్బు ఏదీ? ఎక్కడ దాచిపెట్టేరు?"

"మద్రాసు చేరిన తర్వాత వాటాలు ఇస్తానని చెప్పి నిరంజన్ మొత్తండబ్బు సూట్‌కేస్‌లో పెట్టుకొని తీసి కెళ్ళేడు."

"ఆ మాట నేను నమ్మను. డబ్బుకోసం దోపిడి చేసినవాళ్ళు మొత్తం డబ్బు వాడు తీసికెళుతుంటే ఊరకుంటారా? మద్రాసు వెళ్ళిన తర్వాత వాడు మీకు వాటాలు ఇస్తాడని ఏమిటి నమ్మకం? అందుచేత మీ వాటాలు మీరు తీసుకొని ఎక్కడో దాచి పోలీసుల నుంచి తప్పించుకొనడానికి మద్రాసు ప్రయాణమయ్యారు. ఆ డబ్బు ఎక్కడ దాచారో మర్యాదగా చెప్పండి. చెప్పక పోతే మిమ్మల్ని మా కానిస్టేబులుకు అప్పగిస్తాను. ఈ సారి అతడు అంత సులభంగా వదలిపెట్టడు. ఏ కీలుకు ఆ కీలు విరిచివేస్తాడు."

ఆ ఇద్దరు తెల్లమొహాలు వేసుకొని ఒకరివైపు మరొకరు చూచుకొన్నారు.

"ఊ, చెప్పండి" హూంకరించాడు రవీంద్ర.

ఆ ఇద్దరిలో కాస్త ధైర్యస్థుడైనవాడు చెప్పడం ప్రారంభించాడు.

"మేము నిజమే చెబుతున్నాము సార్! మీరు మమల్ని నరికి పోగులుపెట్టినా లేనిడబ్బు ఎక్కడనుంచి తీసుకొని రాగలము? డబ్బు పంచుకోడానికి కాని దాచిపెట్టడానికి కాని మాకు సమయం ఎక్కడిది? దోపిడిలో ధైర్యంగా పాల్గొన్నాముగాని, దోపిడి తర్వాత పోలీసులు వేటకుక్కల్లా వెంటపడతారన్న భయంతో పారిపోవడం గురించి ఆలోచించాముగాని, మా వాటాల గురించి ఆలోచించలేదు."

ఆ మాటలు రవీంద్రలో ఆలోచనలు కలిగించాయి. ఇప్పటిదాకా సేకరించిన సమాచారంబట్టి నిరంజన్ అన్న వాడు ఈ దోపిడిలో ప్రముఖపాత్ర వహించినట్టు స్పష్టం అవుతోంది, అందుచేత వాడే ఆ డబ్బు తీసుకెళ్ళి వుండవచ్చు.

"ఈ దోపిడి గురించి ప్లాను వేసింది, పిస్టలు నాటు బాంబులు తెచ్చింది ఎవరు?"

"వాడే సార్. నిరంజన్."

"మీరు ముగ్గురు యేమి చదువుతున్నారు? మీ పేర్లేమిటి?"

"నా పేరు మోహన్. వీడిపేరు ప్రతాప్. మేము డిగ్రీ క్లాసు ఫైనల్ యియర్ లో వున్నాము."

"స్టూడెంట్సు అయివుండీ ఇలాంటి పనులు చేయడానికి సిగ్గులేదూ? బ్యాంకు దోపిడిలాంటి ఘోరమైన నేరంచేసి ఎలా తప్పించుకోగలరనుకున్నారు?"

"మా యిద్దరికి అలాంటి ఉద్దేశ్యం ఎన్నడు లేదు. కాస్త తెలివివుంటే బ్యాంకుదోపిడిచేసి తప్పించుకొనడం సులభమని నిరంజన్ మాకు నూరిపోశాడు. వాడి మాటలు నమ్మి

సులభంగా డబ్బు సంపాదించవచ్చునన్న ప్రలోభంలో పడి మేము ఈ దోపిడిలో పాల్గొన్నాము.”

“మీరు మద్రాసులో యెక్కడ కలుసుకోవాలను కొన్నారు?”

“హోటలు కల్పనలో.”

రవీంద్ర వెంటనే టెలిఫోను డైరెక్టరీ తిరగేసి హోటల్ కల్పనకు ఎస్.టి.డి. కాల్ బుక్ చేసి నిరంజన్ అనవాళ్ళు చెప్పి అలాంటి వ్యక్తి ఆ హోటలులో బస చేశాడా? అని ప్రశ్నించాడు. లేదని సమాధానం రాగా అలాంటి వ్యక్తి వచ్చి బసచేస్తే తనకు వెంటనే తెలుపమని చెప్పి తన స్టేషన్ ఫోన్ నెంబరు ఇచ్చాడు. అంతటితో తృప్తిపడక హోటల్ కల్పనకద్ద నిరంజన్ కోసం కాపు వేయడానికి వెంటనే ఒక హెడ్ కానిస్టేబుల్‌ను, ఇద్దరు కానిస్టేబుళ్ళను మద్రాసుకు పంపేడు.

4

మద్రాసుకు వెళ్ళిన పోలీసు బృందం మూడు రోజుల తర్వాత తిరిగివచ్చి నిరంజన్ హోటల్ కల్పన దరిదాపులకే రాలేదని చెప్పగా రవీంద్ర ఆలోచనలో పడ్డాడు. పోలీసులు మోహన్, ప్రతాప్‌లను పటుకొన్నారని తెలిసి తానుకూడా పట్టుబడే ప్రమాదముందని గ్రహించి నిరంజన్ ఆ హోటలు ప్రాంతానికే రాలేదేమో అన్న సందేహం అతనికి వచ్చింది.

కాని వాళ్ళ అరెస్టువార్త మరుసటిదినం వాళ్ళనుకోర్టులో హాజరుపరిచేదాకా బయటకు పొక్కకుండా తాను జాగ్రత్త పడటంవల్ల వాళ్ళ అరెస్టు గురించి అంత త్వరగా నిరంజన్‌కు తెలిసే అవకాశంలేదన్న సంగతి అతనికి గుర్తు వచ్చింది. అందుబట్టి రవీంద్రకు ఒక సంగతి స్పష్టం

కాపాగింది.

నిరంజన్ తన సహచరులను పావులుగా ఉపయోగించు కొన్నాడుగాని వాళ్ళకు డబ్బు పంచియిచ్చే ఉద్దేశ్యం అతనికి ఎన్నడు లేదని, అందుచేత నిరంజన్ వాళ్ళకు మాయమాటలు చెప్పి వాళ్ళను తప్పుదోవ పట్టించి ఎక్కడికో ఉడాయించి వుంటాడు.

మరుసటిదినం నుంచి నిరంజన్ ఆచూకి తీయడానికి విశ్వప్రయత్నాలు చేశాడు. అతని స్వస్థలం కర్నూలు అని తెలిసి కర్నూలుకు వెళ్ళి వాళ్ళ ఇంటిని కూడా సోదా చేశాడు. కాని ఫలితం లేకపోయింది.

గడువు మీరిపోతుండటంవల్ల రవీంద్ర ప్రస్తుతానికి మోహన్, ప్రతాప్‌లమీద కోర్టులో ఛార్జిషీటు దాఖలుజేసి సుభాషిణి సాక్ష్యంబట్టి తదితరుల సాక్ష్యంబట్టి కేసు రుజువు జేసి వాళ్ళిద్దరికి శిక్షపడేలా చేశాడు.

కాని తాను ప్రధాన నేరస్థుడిని పట్టుకోలేకపోయినందుకు రవీంద్ర హృదయంలో తీవ్రమైన అసంతృప్తి మిగిలిపోయింది.

"నిరంజన్, నీవు కొన్నాళ్ళపాటు అజ్ఞాతంలో వున్నా ఎప్పటికైనా బాహ్యప్రపంచంలోనికి రాకపోవు. నీపై నిఘావుంచి నిన్ను పట్టుకొనేదాకా నేను విశ్రమించను" అని రవీంద్ర తన మనసులో నిర్ణయించుకొన్నాడు.

రెండుసంవత్సరాల తర్వాత అతనికి ప్రమోషన్‌మీద కర్నూలుకు బదిలీ అయింది. ప్రమోషన్‌తోపాటు తనకు కర్నూలుకు బదిలీ అయినందుకు రవీంద్ర సంతోషించాడు. ఏనాటికైనా నిరంజన్ తన స్వస్థలమైన కర్నూలుకు రాకపోడు. అప్పుడు వాణ్ణి పట్టుకోవచ్చు అనుకొన్నాడు.

5

ఓరోజు రవీంద్ర తన సర్కిల్ ఆఫీసులో కూర్చొని వుండగా ప్రక్కగదిలో వున్న కర్నూలు టూటౌన్ సబ్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ వచ్చి సెల్యూటు చేశాడు.

సెల్యూటు అందుకొని ఏమిటి అన్నట్టుగా ప్రశ్నార్థకంగా చూశాడు రవీంద్ర.

"ఒక పెళ్ళికి వెళ్ళాలి. మీతో చెప్పిపోదామని...."

"పెళ్ళి ఎవరిది?"

"సురేష్ అని నాకు ఓ స్నేహితుడు వున్నాడు. అతడు నాకు కాలేజిలో క్లాసుమేటు కూడా. అతని చెల్లెలి పెళ్ళి."

ఆ పేరు వినగానే రవీంద్ర మస్తిష్కం చురుకుగా పని చేయసాగింది.

"సురేష్ అంటే నిరంజన్ తమ్ముడు కదూ!"గతంలో బ్యాంకుదోపిడి సందర్భంగా కర్నూలుకు వచ్చి సురేష్‌ను ప్రశ్నించిన సంగతి గుర్తుకు తెచ్చుకొంటూ అన్నాడు.

"అవును సార్!"

"నీకు నిరంజన్ పరిచయమా?"

"లేదు సార్! అతడు బ్యాంకుదోపిడిజేసి పరారీలో వున్నట్లు మాత్రం తెలుసు."

"ఈ పెళ్ళికి నేనుకూడా వస్తున్నాను పద."

పెళ్ళిమండపం బయట అతిథులను ఆహ్వానిస్తూ నిలబడ్డాడు సురేష్ ప్రవీణ్ కనబడగానే విప్పారిన అతని ముఖం, ప్రక్కనవున్న రవీంద్రను చూడగానే ముడుచుకొనిపోయింది.

"వీరు మా ఇన్స్పెక్టర్ రవీంద్రగారు" అని ప్రవీణ్ పరిచయం చేశాడు.

"నమస్కారం!" అన్నాడు సురేష్ తన కంగారును కప్పిపుచ్చుకొంటూ.

"నా రాక మీకు ఆశ్చర్యం కలిగించి వుండాలి. మా ఎస్.ఐ. ప్రవీణ్ తన స్నేహితుని చెల్లెలు పెళ్ళని చెప్పి నన్ను కూడా రమ్మనగా వచ్చాను" అన్నాడు రవీంద్ర.

"దానికేమి లెండి" అంటూ సురేష్ ఆ ఇరువురిని తీసికెళ్ళి ముందువరుసలో కూర్చుండబెట్టేడు.

ఆహ్వానంలేని పెళ్ళికి తన ఇన్‌స్పెక్టరు వస్తానన్నప్పటి కంటే, సురేష్‌కు అతడు చెప్పిన కారణం విని మరింత ఆశ్చర్యపోయాడు ప్రవీణ్.

పెళ్ళి జరుగుతున్నంతసేపు రవీంద్ర షామియానా నలు మూలలా తేరిపార చూచాడు. ఎక్కడున్నా ఏ దూర ప్రాంతంలో వున్నా పెళ్ళికి తప్పకుండా వస్తాడని అను కొన్న వ్యక్తి కనబడక పోవడంతో అతనికి ఆశాభంగం అయింది.

పెళ్ళి ముగిసిన తర్వాత పెద్దలకు నమస్కారం చేయ డానికి వచ్చిన వధూవరులు తనప్రక్కన కూర్చున్న ఒక వ్యక్తికి పాదాభివందనం చేయడం గమనించాడు రవీంద్ర.

"అన్నయ్యా దీవించు" అన్నది పెళ్ళికూతురు.

రవీంద్ర ఉలిక్కిపడ్డాడు.

ఇతడు నిరంజన్ కాదుగదా!

ఆ వ్యక్తివైపు నిశితంగా చూచాడు రవీంద్ర. కాదు, ఇతడు నిరంజన్ కాదు. కేసు ఇన్‌వెస్టిగేషన్ కాలంలో తాను చూచిన నిరంజన్ ఫోటోకు యితనికి పోలికలు లేవు. ఇతని కుడిబుగ్గ క్రింద మచ్చ కూడా లేదు.

మరి ఈ వ్యక్తి యెవరు? పెళ్ళికూతురు ఇతణ్ణి

'అన్నయ్యా' అని ఎందుకు పిలిచింది?

ఆ ప్రశ్నలకు సమాధానం లభించక పోవడంతో "ప్రవీణ్, నీకు నా ప్రక్కన కూర్చున్న వ్యక్తి తెలుసా?" అని గొంతు తగ్గించి అడిగేడు రవీంద్ర.

"తెలుసు సార్! సురేష్‌కు బంధువు. అన్న వరుస అవుతాడు. పరిచయం చేయమంటారా?"

రవీంద్ర తల ఊపేడు.

"అశోక్‌గారూ, వీరు మా ఇన్‌స్పెక్టరు రవీంద్రగారు" అని పరిచయం చేశాడు.

అశోక్ రవీంద్రతో కరచాలనం చేసి "మీతో పరిచయం అయినందుకు చాలా సంతోషంగా వుంది. తీరిక చేసుకొని మా చెల్లెమ్మ పెళ్ళికి వచ్చినందుకు ధన్యవాదాలు" అన్నాడు.

తర్వాత పెళ్ళిమండపం నుంచి పిలుపు రాగానే అశోక్ అటువైపు వెళ్ళిపోయాడు.

"పెళ్ళి బ్రహ్మాండంగా జరిగింది కదూ! నాకు తెలిసినంతవరకు సురేష్‌వాళ్ళది అంతగా స్తోమతవున్న కుటుంబం కాదు. మరి అంత ఖర్చు ఎలా చేయగలిగారో" అన్నాడు రవీంద్ర పెళ్ళినుంచి తిరిగి వస్తుండగా.

పెళ్ళి ఖర్చులో అధికభాగం అశోక్ భరించాడట. అతనికి రియల్ ఎస్టేట్ బిజినెస్ వుంది. కర్నూలు చుట్టుపట్ల వున్న పొలాలు కొని ప్లాట్లు వేయించి అమ్మగా విపరీతమైన లాభాలు వచ్చాయట. ఆ బిజినెస్‌లో సురేష్ మేనేజరుగా పనిచేస్తున్నాడు. పైగా ఆ ఇరువురికీ బంధుత్వం వుంది. అందుచేత అశోక్ ఈ పెళ్ళికి ధారాళంగా ఖర్చు చేశాడట.

"బంధువు అయినంతమాత్రాన అంత డబ్బు ఖర్చు పెట్టడం ఆశ్చర్యంగా వుంది" అన్నాడు రవీంద్ర.

6

"రండి ఇన్‌స్పెక్టరుగారూ. మనం అంత త్వరగా కలుసుకొంటామని అనుకోలేదు. తీరిక చేసుకొని మా ఇంటికి వచ్చినందుకు సంతోషం" రవీంద్రను సాదరంగా ఆహ్వానిస్తూ అన్నాడు అశోక్.

ఇద్దరు గదిలో కూర్చోగానే కాఫీ తెప్పించాడు అశోక్.

"మీలాంటి బిజీ పోలీసు ఆఫీసరు మాఇంటికి వచ్చారంటే ఏదో విశేషముండాలి" అన్నాడు అశోక్.

"విశేషం ఏమిలేదు. ఒక పనిమీద ఇటు వచ్చాను. దారిలోనే కదా అని మిమ్మల్ని కలుసుకోవచ్చు అనుకొన్నాను. మరేం లేదు. మీరు ప్లాట్ల బిజినెస్‌లో ఉన్నారట కదూ! మా బంధువు ఒకాయన ఒక ప్లాటు కొని ఇల్లు కట్టిద్దామని అనుకుంటున్నాడు. ప్రస్తుతం ప్లాట్ల ధరలు ఎలా ఉన్నాయో అడుగుదామని వచ్చాను."

"మీ బంధువును మా ఆఫీసుకువచ్చి అన్ని లేఅవుట్లను పరిశీలించి ఏ ప్రాంతంలో ప్లాటు కావాలో నిర్ణయించుకోమనండి. ధర విషయం అంటారా? ఇతరులకంటే తక్కువ రేటుకే ఇస్తాను లెండి."

"మీరు ఎంతకాలంనుంచి ఈ ప్లాట్ల బిజినెస్‌లో వున్నారు?"

"రెండు మూడేళ్ళనుంచి."

"మంచి లాభదాయకమైన వ్యాపారమేనా?"

"పర్లేదు. లాభాలు బాగానే వుంటాయి."

"మీ స్వస్థలం కర్నూలే అనుకొంటాను."

"కాదు ఇన్స్పెక్టరుగారూ. నేను పుట్టి పెరిగింది బరంపూర్‌లో. అక్కడ మా నాన్నగారు ఉద్యోగం చేశారు. నాతల్లి చిన్నతనంలోనే చనిపోయింది. మా నాన్నగారు మూడేళ్ళక్రితం చనిపోయారు. ఆయన చనిపోవడంతో నాకు అక్కడ నాఅన్నవాళ్ళు ఎవరూ లేనందున వున్న ఆస్తిని అమ్ముకొని మా తాత ముత్తాతల స్వస్థలమైన కర్నూలుకు వచ్చాను."

"ఆస్తి అమ్మగా వచ్చిన డబ్బుతో మీరు ఈవ్యాపారం ప్రారంభించా రనుకొంటాను."

"లేదండీ. పేరుకు ఆస్థి అన్నమాట ఉపయోగించాను కాని ఆ ఆస్తి ఒక ఇల్లు మాత్రం."

"మరి వ్యాపారంలో పెట్టుబడి పెట్టడానికి డబ్బు ఎలా వచ్చింది?"

"నాకు మొదటినుంచీ లాటరీ టిక్కెట్లు కొనే పిచ్చి వుందండీ. ధనలక్ష్మి నన్ను వరించడంవల్ల ఓ లాటరీలో నాకు ఫస్టుప్రయిజ్ వచ్చింది. అదిగో గోడకు తగిలించిన ఆ ఫోటో నాకు ఆ బహుమతి తాలూకు చెక్ బహూకరిస్తున్నప్పుడు తీసిందే."

రవీంద్ర లేచి వెళ్ళి ఆ ఫోటోను చూచాడు.

"భాగ్యలక్ష్మి లాటరీ ద్వారా ధనలక్ష్మి మిమ్మల్ని వరించిందన్నమాట" అని ఆ లాటరీని గురించి కొన్ని వివరాలు అడిగేడు రవీంద్ర.

తర్వాత వెళ్ళిపోవడానికి ఉద్యుక్తుడవుతూ "సురేష్ మీకు బంధువటగా" అన్నాడు.

"అవునండి. మా తాతగారు అతని తాతగారు అన్నదమ్ములు. సురేష్ నాకు తమ్ముడి వరుస అవుతాడు."

7

"నమస్కారం ఇన్‌స్పెక్టరుగారూ. నన్ను వచ్చి ఒక సారి కలిసిపొమ్మని కబురు చేశారట" అన్నాడు అశోక్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు ఆఫీసులో అడుగు పెడుతూ.

"ఓ మీరా! కూర్చోండి. నిన్న మీ మేనేజరు టూ టౌను పోలీసుస్టేషనుకు వచ్చి ఇందిరాగాంధీ నగర్‌లో మీరు ఇండ్ల ప్లాట్లు వేయించిన స్థలంలో కూలిజనం గుడిసెలు వేసి ఆక్రమించారని, వాళ్ళను ఖాళీ చేయించమని మా ఎస్. ఐ. తో చెప్పేడట. మా ఎస్. ఐ. ఆ సందర్భంలో నన్ను సంప్రదించాడు. ఆ లేబర్ జనంతో పెద్ద పేచీ. జాగ్రత్తగా వ్యవహరించాలి. అందువల్ల కొన్ని వివరాలు అడగడానికి మిమ్మల్ని పిలిపించాను. మీరు ఆ స్థలం కొని ఎంత కాలమయింది?" అన్నాడు రవీంద్ర తలెత్తి చూస్తూ.

"సుమారు రెండు సంవత్సరాలయింది."

"మీరు కొన్నప్పుడు ఆ స్థలంలో గుడిసెలు ఉన్నాయా?"

"లేవండి. ఆ గుడిసెలు యిటీవల వేశారు. మూడు రోజుల క్రితం మా వద్ద ప్లాట్లు కొనదలచుకొన్న కొందరు వ్యక్తులు వచ్చి ఆ ప్లాట్లను చూపించమన్నారు. చూపించడానికి మా మనిషి వెళ్ళగా ఆ ప్లాట్లలో గుడిసెలు వేసినట్లు అప్పుడు తెలిసింది. ఆక్రమణ జరిగిన ప్లాట్లను కొనడానికి ఎవరు సాహసించరుకదండీ అందుచేత వాళ్ళను ఖాళీ చేయించడానికి పోలీసుల సహాయం అర్థించమని నేను మా మేనేజరుతో చెప్పేను."

"నిజమే. డబ్బుపోసి కొంటూ కోరి కష్టం తెచ్చుకొనడానికి ఎవరు సిద్ధపడరు. కాని ఆ గుడిసెలను ఖాళీ చేయించడానికి ప్రయత్నిస్తే ఆ లేబరు జనం తాలూకు

లీడర్లు గొడవచేసి పై అధికారుల వద్దకు వెళతారు. అందు చేత అంతా ఒక పద్ధతిప్రకారం చట్టప్రకారం ఉండాలి. నోటిమాట మీద చర్య తీసుకోవడానికి వీలుపడదు. అందు కని మీరు ఆ స్థలం ఎప్పుడు కొన్నది, ఎవరివద్ద కొన్నది దురాక్రమణ ఎప్పుడు జరిగింది కనబరుస్తూ ఒక రిపోర్టు వ్రాసి ఇవ్వండి. ఆ రిపోర్టు ఆధారంగా వెంటనే అవసర మైన చర్య తీసుకొనడానికి వీలవుతుంది" అంటూ ఒక తెల్లకాయితాన్ని అందించాడు రవీంద్ర.

అశోక్ రిపోర్ట్ వ్రాసి ఇచ్చాడు.

"మీరు నిశ్చింతగా వుండండి. వారం రోజులలోపుగా ఆ గుడిసెలను ఎత్తి వేయిస్తాను" అన్నాడు రవీంద్ర ఆ కాయితాన్ని అందుకొంటూ.

"థ్యాంక్స్ ఇన్‌స్పెక్టరుగారూ, ఇక నేను వెళ్ళి వస్తాను."

"అప్పుడే: మా ఆఫీసుకు వచ్చి కాఫీకూడ త్రాగ కుండానా?" అంటూ ఒక కానిస్టేబుల్‌ను పిలిచి గ్లాసులు శుభ్రంగా కడిగి ఫ్లాస్కులోని కాఫీపోసి ఇవ్వమని చెప్పేడు రవీంద్ర.

కాఫీ త్రాగిన తర్వాత అశోక్ తన జేబులోని సిగరెట్టు ప్యాకెట్టు తీసి రవీంద్రకు ఆఫర్ చేసి తన లైటరుతో ఆ సిగరెట్టును వెలిగించాడు. తర్వాత తన సిగరెట్టును వెలి గించుకొంటుండగా అతని మోచేయి తగిలి టేబుల్ మీద వుంచిన గ్లాసు క్రిందపడి పగిలిపోయింది.

"సారీ ఇన్‌స్పెక్టరు గారూ. మీ గ్లాసును పగుల గొట్టేను" అన్నాడు అశోక్ నొచ్చుకుంటూ.

"పర్లేదులెండి. గ్లాసు పగిలినంత మాత్రాన పెద్ద నష్టం

ఏముంది?" అంటూ రవీంద్ర కానిస్టేబులును పిలిచి ఆ ముక్కలు ఎత్తిపడేయమని చెప్పేడు.

8

విరామం లేకుండా మ్రోగిన కాలింగ్‌బెల్ శబ్దానికి మెలకువ వచ్చిన అశోక్ వెళ్ళి తలుపులు తీశాడు.

"చాల రోజుల తర్వాత కనబడ్డారు ఇన్‌స్పెక్టరుగారూ. కాని ఇలా అర్ధరాత్రిపూట వచ్చా రేమిటి?" అన్నాడు అశోక్ రవీంద్రను చూడగానే.

"అర్ధరాత్రయితే మా పనికి అనుకూలంగా ఉంటుందని వచ్చాము. ఇతడు తిరుపతి ఒన్ టౌన్ సబ్ ఇన్‌స్పెక్టరు" అన్నాడు రవీంద్ర తన ప్రక్కనవున్న వ్యక్తిని చూపిస్తూ.

"రెండేండ్ల క్రితం తిరుపతిలో జరిగిన బ్యాంకు దోపిడి కేసులో నిన్ను అరెస్టు చేయడానికి వచ్చాము" మళ్ళీ అన్నాడు రవీంద్ర కరుకుగా.

"అదేమిటి ఇన్‌స్పెక్టరుగారూ, నేను బ్యాంకు దోపిడి చేయడమేమిటి? ఏదో పొరపాటు పడుతున్నారు" ఆశ్చర్యం కనబరస్తూ అన్నాడు అశోక్.

"ఏమాత్రం పొరపాటు పడటంలేదు. నీవే ఆ దోపిడి దొంగవు" గంభీరంగా అన్నాడు రవీంద్ర.

"మర్యాదగా బిజినెస్ చేసుకొంటున్న నన్ను దోపిడి దొంగనని అంటున్నారు. అందుకు రుజువులేమిటి?"

"రుజువులు సేకరించే నిన్ను ఇప్పుడు అరెస్టుచేస్తున్నాను. నీవు ఆ పెళ్ళికోసం డబ్బు ధారాళంగా ఖర్చుపెట్టినప్పుడే నాకు అనుమానం వచ్చింది. అందువల్ల నీ గురించి ఆరాలు తీద్దామని ఒక సాకుమీద మీ ఇంటికి రాగా నీకు లాటరీలో డబ్బు వచ్చిందని తెలిసింది. డబ్బు రావడం బ్యాంకు దోపిడి జరిగిన మూడు నెలలకు అని

తెలిసినప్పుడు నాకు ఒక అనుమానం వచ్చింది.

లాటరీ టికెట్ల ఏజంటును విచారించగా ఆంజనేయులు అన్న వ్యక్తికి ప్రథమబహుమతి వచ్చిందని. ఆ సంగతి తెలుసుకొని నీవు ఆంజనేయులుకు డబ్బు చెల్లించి ఆ టికెట్టు తీసికెళ్ళి బహుమతి నీకే వచ్చిందని చెప్పి బహుమతి డబ్బు తెచ్చుకొన్నావని తెలిసింది. నల్లధనం తెల్లగా మార్చడానికి కొందరు ఈ పద్ధతి అనుసరిస్తారని నాకు తెలుసు. నీవు కూడ ఆ డబ్బు లాటరీలో వచ్చిందని లోకాన్ని నమ్మించడానికి ఈ పద్ధతి అనుసరించి వుంటావన్న నా అనుమానం నిజమయింది."

"అంతమాత్రాన నేను దోపిడిలో పాల్గొన్నట్టు రుజువు కాదు. దోపిడిచేసి పరారీలోవున్న వానిపేరు ఫోటోతో సహా పేపరులో ప్రచురించినట్టు గుర్తు. మీ కంటికి నేను ఆ వ్యక్తిలాగ కనబడుతున్నానా ఇన్‌స్పెక్టరుగారూ" అన్నాడు అశోక్ వ్యంగ్యంగా.

"కనబడటంలేదు. అందుకే నేను కొన్ని ప్రయోగాలు చేశాను. ఏవి మారినా ఒక వ్యక్తికి సంబంధించిన కొన్ని అంశాలు మారవు. ఒక వ్యక్తి రూపం మారినా అతని చేతి వ్రేలి ముద్రలు మారవు. నీ వ్రేలిముద్రలకోసం, నీవు మా ఆఫీసుకు వచ్చినప్పుడు నీకు గాజు గ్లాసులో కాఫీ ఇప్పించాను. ఆ గ్లాసుపై నీ వ్రేలిముద్రలు పడ్డాయన్న సంగతి నీకు ఆలస్యంగా గుర్తుకువచ్చి పొరపాటుగా జరిగినట్టు గ్లాసును పగులగొట్టేవు. ఇలా జరుగుతుందని ముందే అనుమానించి పగిలిన ముక్కలను జాగ్రత్తగా ఏరి తీసిపెట్టమని మా కానిస్టేబులుకు చెప్పేను. దోపిడి జరిగిన రోజు బ్యాంకులో ఇచ్చిన వందరూపాయల చెక్కు మీదవున్న వ్రేలిముద్రలతో గ్లాసుముక్కల మీదవున్న

వ్రేలిముద్రలను పోల్చి చూచి ఆ రెండు వ్రేలిముద్రలు ఒకే వ్యక్తివని నిపుణులు తేల్చారు."

ఆ మాటలు వింటుండగా అశోక్ ముఖంలో రంగులు మారాయి.

"ఇవేకాక మరికొన్ని రుజువులు కూడ వున్నాయి. కూలి జనంమీద నీవు వ్రాసిఇచ్చిన రిపోర్టులోని వ్రాతను, నీవు స్టూడెంటుగా వున్నప్పుడు నీ నోటు బుక్కులలో వ్రాసిన వ్రాతతో పోల్చి చూచిన హ్యాండ్‌రైటింగ్ ఎక్స్‌పర్ట్ ఆ రెండు వ్రాతలు ఒకరివేనని తేల్చాడు."

"అసంభవం. నా వ్రాతవేరు, ఇతరుల వ్రాతవేరు."

"దోపిడీ జరిగినమీదట నీ వ్రాత ఆధారంగా నిన్ను గుర్తించకూడదని మార్చి వ్రాయడం నేర్చుకొన్నావు. అందువల్ల పట్టుబడవన్న ధైర్యంతో ఆ రిపోర్టును ఏలాంటి సందేహం లేకుండా వ్రాసి ఇచ్చావు. కాని ఒక సంగతి నీకు తెలియదు, వ్రాతను మార్చి వ్రాసినా పెన్ స్ట్రోక్స్‌నుబట్టి అక్షరాలు వ్రాసినప్పుడు ఉపయోగించిన ఒత్తిడిని బట్టి నిపుణులు వ్రాతను సులభంగా గుర్తించగలరని."

నమ్మలేనట్టుగా ఆశ్చర్యంగా చూచాడు అశోక్.

రవీంద్ర మళ్ళీ చెప్పడం ప్రారంభించాడు:

"ఈ ఆధారాల మూలంగా నీవే నిరంజన్ అని తేలింది. కాని నీ ముఖకవళికలలో భేదం వుండటానికి కారణం ఏమిటా అని తికమకపడ్డాను. ప్లాస్టిక్ సర్జరీ చేయడంద్వారా రూపంలో గొప్ప మార్పు చేయవచ్చునని, విదేశాలలో శిక్షణ పొందిన డాక్టరు మెహతా అందులో నిపుణుడని ఒక మ్యాగజైనులో చదివాను. వెంటనే అతడు వుంటున్న ఢిల్లీకివెళ్ళి నిరంజన్ రూపంలోవున్న

నీ ఫోటోను చూపి ఇది దోపిడి కేసుకు సంబంధించిన విషయమని నచ్చచెప్పగా తాను అలాంటి వ్యక్తికి ప్లాష్టిక్ సర్జరీ చేశానని అంగీకరిస్తూ అవసరంపడితే తాను కోర్టుకు వచ్చి సాక్ష్యం చెబుతానని కూడ చెప్పేడు."

అశోక్ నిలువెల్లా వణికిపోయాడు. చట్టానికి పట్టుపడ కూడదని తనకు సంబంధించిన ఆధారాలను తెలివిగా కప్పి పుచ్చాననుకొన్నాడు. ఇక తన నెవ్వరూ, కడకు తన కుటుంబ సభ్యులు సైతం గుర్తించనందుకు తానెంతో గర్వపడ్డాడు! కాని....కాని....ఈ ఇన్‌స్పెక్టర్ దేవాంతకుడై తన మర్మవలయాన్ని ఛేదించి తనను నేరస్థుడిగా న్యాయస్థానానికి అప్పజెప్పబోతున్నాడు. ఇప్పుడెలా?

ఆ ఆలోచనతో కొట్టుమిట్టాడుతూ విభ్రాంతుడైన అశోక్ ఉరఫ్ నిరంజన్, ఇన్‌స్పెక్టరు రవీంద్ర తన చేతులకు బేడీలు తగిలించడం కూడ గమనించలేదు. □

రైడింగ్?

నాభార్యతో నేవెళ్తుంటే ఏలాడ్జిలో దొరికిందంటావా?



చెడిపోయిన ఫిలిమ్

ఎమ్. రాధిక

"నేనేం చెయ్యాలో వివరంగా చెప్పండి?" అడిగాడు మురారి.

అతని ఎదురుగా కూర్చున్న రామసుబ్బయ్య మాటల కోసం తడుముకున్నట్టుగా క్షణంసేపు ఆగి, ఆ తర్వాత నెమ్మదిగా ఇలా అన్నాడు.

"నేను ఇప్పుడు ఎక్కువగా సినిమాలో నటించడం లేదన్న సంగతి మీకు తెలుసు. అయితే మొన్నీమధ్యనే 'అపరాధి ఎవరు' అనే సినిమాలో చిన్నవేషం దొరికింది.

ఆ చిత్రం షూటింగ్ మొత్తం హైదరాబాద్‌లోనే జరుగుతోంది. రెండురోజుల క్రితం ఎయిర్‌పోర్ట్‌లో కొన్ని ఛేజింగ్ సీన్లు తీశారు. చిత్రంలో ముఖ్యమైన సన్నివేశాలు అవి. అయితే కొన్ని సాంకేతిక కారణాలవల్ల అక్కడ తీసిన ఫిల్మ్ పాడయిపోయింది. అందుకే ఆ సీన్లు మళ్ళీ తీయబోతున్నారు. నేను చెప్పేదేమిటంటే ఆ పాడయిపోయిన ఫిలిం నాకు కావాలి.''

రామసుబ్బయ్య ఒక నటుడు. దాదాపు ముప్పై ఏళ్ళ నుంచీ ఫీల్డ్‌లో ఉంటున్నాడు. ఎన్నో విజయవంతమైన చిత్రాలలో నటించి పేరు తెచ్చుకున్నాడు. అయితే అదంతా గత వైభవమే. ఫీల్డ్‌లోకి కొత్తవాళ్ళు రావడంతో రామసుబ్బయ్య వెనుకబడిపోయాడు. చివరికి అతనికి మిగిలింది నాలుగు గదుల కొంప. పాతికవేలు అప్పు. ఇప్పటికీ తెలిసిన దర్శకులు, నిర్మాతలు పిలిచి వేషాలు ఇస్తుండటంవల్ల అడపా దడపా సినిమాలలో కనిపిస్తుంటాడు రామసుబ్బయ్య.

అతను చెప్పింది వినగానే - ''సినిమా వ్యవహారమా! బాబోయ్ నావల్లకాదు'' అనేశాడు మురారి.

ఆమాట వినగానే అతనివేపు చురుకుగా చూసి. ''అబద్ధాలు చెప్పకు. ఇలాంటి విషయాలలో నువ్వు ఎక్స్‌పర్ట్‌వని పిలిపించాను. ఏడాదిక్రితం 'మయూరి' స్టూడియోలో జరిగిన దొంగతనం వెనుక నీ హస్తంలేదూ'' అడిగాడు రామసుబ్బయ్య.

అనీజీగా కుర్చీలో కదిలి, ''అది వేరు, ఇది వేరు. అయినా పాడయిపోయిన ఫిలిం మీకు దేనికి? ప్రయోజనం లేని దొంగతనాలు నేను చేయనని మీకు తెలుసుగా?'' అన్నాడు మురారి.

అతని కళ్ళలోకి సూటిగా చూసి, తర్వాత నెమ్మదిగా ఇలా అన్నాడు రామసుబ్బయ్య.

"నిజమే. అది పాడయిపోయిన ఫిల్మే. నాలుగు రోజులుపోతే లాబ్‌వాళ్ళు దాన్ని అవతల పారేస్తారు. ఈ లోపలే అది నాకు కావాలి."

అతనివేపు చిత్రంగా చూసి—"ఇంతకీ ఆ సినిమా ఎవరిది?" అడిగాడు మురారి.

"ప్రస్తుతం యాక్షన్ చిత్రాల దర్శకుడిగా వెలిగిపో తున్న గజేంద్రరావు మొదటిసారిగా ఈ సినిమా తీస్తున్నాడు."

"సరే ఆ ఫిలిం తీసుకువస్తాను మరి నా విషయం...." అని నవ్వాడు మురారి.

అది గ్రహించి-"రేపు సాయంత్రంలోగా ఆ ఫిలిం తీసుకువస్తే నీకు ఇరవై వేలు ఇస్తాను" అన్నాడు రామ సుబ్బయ్య.

"మైగాడ్ పాడయిపోయిన ఫిలింకు అంత ఖరీదా?"

చిన్నగా నవ్వి—"అదంతేలే. సరేనా?" అడిగాడు రామసుబ్బయ్య.

"ఓ! కే. రేపు కలుస్తాను అన్నట్లు ఆ ఫిలిం ప్రస్తుతం ఎక్కడ ఉంది?" కుర్చీలోంచి లేవబోతూ అడిగాడు మురారి.

"వెంకటేష్ స్టూడియోలో" చెప్పాడు రామసుబ్బయ్య.

2

బయటకు రాగానే వెంకటేష్ స్టూడియోకు వెడదామా అన్న ఆలోచన వచ్చింది మురారికి.

అయితే స్టూడియో సంగతులు పూర్తిగా తెలుసుకో కుండా అక్కడికి వెళ్ళడం అనవసరం అని ఆ ప్రయ

త్నాన్ని విరమించుకున్నాడు.

తర్వాత స్కూటర్ మీద బేగంపేట ఎయిర్‌పోర్టుకు బయలుదేరాడు. పార్కింగ్‌లో స్కూటర్ పార్క్ చేసి, నాలుగు అడుగులు ముందుకు వేశాడో లేదో భుజంమీద బలమైన చెయ్యిపడింది.

బరువునుబట్టి ఆ చెయ్యి ఎవరిదో అంచనావేసి వెనుక ఉన్నది ఎవరో ఊహించగలిగాడు.

"హలో ఇన్‌స్పెక్టర్ చలపతిసాబ్. బాగున్నారా?" అంటూ వెనక్కి తిరిగాడు మురారి.

తన మోటార్ బైక్ పక్కనేనిలబడి ఉన్నాడు చలపతి. భారీ విగ్రహంతో 'ఇన్‌స్పెక్టర్ అంటే ఇలా ఉండాలి' అన్న విధంగా ఉంటాడతను.

"ఏం మురారి, మళ్ళీ ఇక్కడికీ తయారయ్యావా?" కరుకుగా ప్రశ్నించాడు చలపతి.

వాళ్ళిద్దరికీ గత పరిచయం ఉంది. మురారి విజయవాడలో ఉండేటప్పుడు రెండు మూడుసార్లు చలపతి చేతికి చిక్కినట్టే చిక్కి తప్పించుకున్నాడు.

"తయారవడమేమిటిసార్. నేను ఇక్కడే సెటిల్ అయిపోయాను. అవునుగానీ మీ రిక్కడున్నా రేమిటి? కొంపదీసి మీరూ ఇక్కడికి వచ్చేయ్యలేదుకదా" తమాషాగా నవ్వుతూ అడిగాడు మురారి.

"నేను ఇక్కడి బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యాను. మూడు నెలలయింది ఇక్కడికివచ్చి."

"అయితే ఏదన్నా ఊరు వెడుతున్నారా సార్" తెలియనట్టే అడిగాడు మురారి.

"డ్యూటీలో ఉన్నాను. కనబడటం లేదూ? రెండు రోజులక్రితం ఒక వజ్రాల వర్తకుడు ఇక్కడే మర్డర్

చేయబడ్డాడు. వ జ్రాలు గల్లంతుఅయ్యాయి. అయినా ఈ విషయం నీకు తెలీదా?" అనుమానంగా అతనివంక చూస్తూ చెప్పాడు చలపతి.

ఆ చూపుల బాకులనుంచి తప్పించుకుంటూ, "అమ్మ తోడు సార్. నేను దొంగతనాలు మానేసి చాలా కాల మయింది. అసలు ఎలా జరిగింది?" కుతూహలాన్ని ప్రదర్శించాడు మురారి.

"మొన్న ఉదయం పార్కింగ్ లాట్‌లోని కారులో అతని మృతదేహం దొరికింది. విమానం దిగిన వెంటనే ఈ హత్య జరిగి ఉండవచ్చు" చెప్పాడు చలపతి.

"వజ్రాల విలువ ఎంత ఉంటుంది?"

"పదిలక్షలు ఉంటుంది. అన్నీ చిన్న చిన్న వజ్రాలు. ఈజీగా వాటిని డిస్పోజ్ చేయవచ్చు."

"అబ్బో. పెద్ద మొత్తమే ఓ. కే. సార్. వాటి వివరాలు నాకు తెలిస్తే స్వయంగా వచ్చి కలుస్తాను. మరిఉంటాను" అని అక్కడినుంచి ముందుకు కదిలాడు మురారి.

వెనుకనుంచి చలపతి చూపులు తనను వేటాడుతుంటా యని గ్రహించినా పట్టించుకోక రూపాయి టిక్కెట్టుకొని లాంజ్‌లోకి వెళ్లాడు.

పరిసరాలను గమనిస్తూ, అటు ఇటు తిరుగుతున్నాడు. కానీ అతని ఆలోచనలు మరోచోట ఉన్నాయి.

వజ్రాల దొంగతనం, హత్య మొన్న జరిగాయి. అదే సమయంలో సినిమా షూటింగ్ కూడా జరుగుతోంది.

ఈ రెండు సంఘటనలకు లింక్ ఏమన్నా ఉందా?

ఉండే ఉంటుందని మురారి క్రిమినల్ మైండ్‌కి ఎందుకో అనిపించసాగింది.

దగ్గరలో పబ్లిక్ ఫోన్ కనిపించడంతో ఏదో ఆలోచన

స్ఫురించి, అటువేపు నడిచాడు.

రామసుబ్బయ్య ఇంటినెంబర్‌కు రింగ్‌చేశాడు. అవతలి వేపునుంచీ రామసుబ్బయ్య రెస్పాన్స్ ఇవ్వడంతో కాయిన్ వేశాడు.

"హలో, నేను మురారిని. డైరెక్టర్ గజేంద్రరావుని కలుసుకోవాలి. ఈ రోజు వీలవుతుందా?" అడిగాడు.

రామసుబ్బయ్య వెంటనే - "కుదరదు. ఎందుకంటే సినిమా పూర్తయిన సందర్భంగా నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ఈ రోజు రాత్రి తన ఇంట్లో డిన్నర్ ఇస్తున్నాడు గజేంద్రరావు. నేను అక్కడికి వెడుతున్నాను" అన్నాడు.

క్షణంసేపు ఏదో ఆలోచించి—"అయితే ఒక పని చేయండి మీతోపాటు నన్ను తీసుకెళ్ళి, ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా పరిచయం చేయండి. మిగతాది నేను చూసుకుంటాను" అన్నాడు మురారి.

"ఊహూం... నావల్ల కాదు."

"ఇది మీవల్ల కాకపోతే రేపు ఆ ఫిలిం తీసుకురావడం కూడా నా వల్ల కాదు...." ఖచ్చితంగా చెప్పేశాడు మురారి.

అవతలినుంచి క్షణంసేపు నిశ్శబ్దం. తర్వాత దీర్ఘ నిశ్వాసం తీసిన శబ్దం.

"సరే! సాయంత్రం ఆరింటికల్లా మా ఇంటికి రా! దీనివల్ల కొంపలు అంటుకోవుగా?" అన్నాడు రామసుబ్బయ్య.

అతని గొంతులో ధ్వనించిన భయానికి చిన్నగా నవ్వుకుని—"మీ మీదకు ఏమీ రానివ్వను. సరేనా?" అని ఫోన్ పెట్టేశాడు మురారి.

3

జూబ్లీహిల్స్‌లోని ఫిలింనగర్ కాలనీలో ఉంది గజేంద్ర రావు ఇల్లు. ఆ చుట్టుపక్కల ఉన్న ఇళ్ళకంటే ఆ ఇల్లే అధునాతనంగా ఉంది. ఇల్లు అనడం కంటే బంగ్లా అంటే బావుంటుందేమో.

మిరుమిట్లు గొలిపే లైట్లకాంతిలో మెరిసిపోతోంది ఆ బంగ్లా. లాన్‌లో కుర్చీలు, టేబుళ్ళు వేసివున్నాయి. పక్కనే చెట్లకు కూడా చిన్న చిన్న బల్బులు అమర్చారు.

ఇంటిముందు కార్లు బార్లుతీరి ఉన్నాయి గజేంద్రరావు ప్రస్తుతం ఉన్న డైరెక్టర్లందరిలోనూ టాప్ కావడంతో అతని నిర్మాతలతో పాటు మిగతా వాళ్ళు కూడా వచ్చారు.

అందరినీ ఆప్యాయంగా రిసీవ్ చేసుకుంటున్నాడు గజేంద్రరావు.

మురారితో రామసుబ్బయ్య అక్కడకు చేరుకునేసరికి వాతావరణం సందడిగా మారింది అతిధులందరూ గ్రూపులుగా చేరి, పెద్దగా ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు.

గజేంద్రరావు ఎక్కడున్నాడా అని అటుఇటు చూశాడు రామసుబ్బయ్య.

కొంచెందూరంలో ఎవరితోనో నవ్వుతూ మాట్లాడుతూ కనిపించాడతను.

దగ్గరకు వెళ్ళి అతనికి మురారిని పరిచయం చేశాడు రామసుబ్బయ్య.

'జర్నలిస్టు' అనగానే గజేంద్రరావు మొహం వికసించింది.

"వెరీగుడ్! మంచిసమయానికి వచ్చారు. పత్రికలన్నా, పాత్రికేయులన్నా నాకు అపారమైన గౌరవం. రేపు ప్రెస్

మీట్ అరేంజ్ చేస్తున్నాను. ఎనీహౌవ్ మీరు వచ్చారు నాకు అదే ఆనందం. కమాన్ జాయిన్ ది పార్టీ!" అని విస్కీ–గ్లాసు అందించాడు గజేంద్రరావు.

"నో, థాంక్స్!" అంటూ సున్నితంగానే తిరస్కరించి, అతనివేపు పరిశీలనగా చూశాడు మురారి.

గజేంద్రరావుకు ముప్పయిఐదేళ్ళుంటాయి. పొడుగు, పొట్టికానీ ఎత్తుతో ఉంటాడతను. ఇప్పుడిప్పుడే బట్టతల ఏర్పడుతోంది. గుబురుగా గెడ్డం పెరిగి ఉంది.

"మీరు ప్రస్తుతం తీస్తున్న 'అపరాధి ఎవరు?' చిత్రం వివరాలు చెబుతారా?" అచ్చంగా విలేఖరిలాగానే ప్రశ్నించాడు మురారి.

"తప్పకుండా. ఇదొక యాక్షన్ మూవీ. చాలాబాగా వచ్చింది. ఎయిర్‌పోర్టు సీన్లు మినహా చిత్రం మొత్తం పూర్తయింది. ఎయిర్‌పోర్ట్ సీన్లు కూడా తీశాను కానీ ఆ రీలు పాడవటంవల్ల రీ షూట్ చేస్తున్నాం" అన్నాడు గజేంద్రరావు.

క్షణం ఆగి—"రండి! మా ఆర్టిస్టులను పరిచయం చేస్తాను" అంటూ ముందుకు దారితీశాడు.

రామసుబ్బయ్యవేపు ఒకసారి చూసి, అతన్ని అనుసరించాడు మురారి.

నాలుగు అడుగులు నడిచి ఒక గుంపుదగ్గిర ఆగాడు గజేంద్రరావు అంతవరకూ గలగల మాట్లాడుకుంటున్న వాళ్ళు అతని రాకతో మౌనం వహించారు.

వాళ్ళలో నాజుగ్గా, ఎర్రగా ఉన్న ఒక యువతిని పరిచయం చేస్తూ "ఈమె శ్రీలత....మా హీరోయిన్" అని, ఆమెకు మురారిని పరిచయం చేశాడు.

"మీరు ఎక్కువగా 'తారలకు తార' పత్రికలో రాస్తుం

టారు కదూ'' అడిగింది శ్రీలత.

తడుముకోకుండా "అవును'' అనేశాడు మురారి.

తర్వాత హీరోని, ఇతర నటీనటులను పరిచయం చేశాడు గజేంద్రరావు.

వాళ్ళతో మాట్లాడుతుంటే. ఎవరో పిలిచేసరికి "మళ్ళీ వస్తాను'' అని అటువేపు వెళ్ళాడు గజేంద్రరావు.

బోయ్ కూల్‌డ్రింక్ తెచ్చి అందిస్తే అది తాగుతూ మిగతావాళ్ళు చెప్పే మాటల్ని వినసాగాడు మురారి.

ఇంతలో "హలో!'' అని ఎవరో పలకరించేసరికి వెనక్కి తిరిగాడు మురారి.

అక్కడొక మధ్యవయస్కుడు ఉన్నాడు. అతన్ని యెక్కడో చూసిన గుర్తు.

"మీరు జర్నలిస్టా?'' మళ్ళీ అతనే అడిగాడు.

మౌనంగా తలూపి, అతన్ని ఎక్కడ చూశానా అని గుర్తు తెచ్చుకోసాగాడు.

అతని ఆలోచనలు చదివినవాడిలాగా "నా పేరు ఆనంద రావు. సినిమానటుణ్ని'' అని పరిచయంచేసుకున్నాడతను.

అవును. గుర్తొచ్చింది. ఒకప్పుడు జానపద హీరోగా వెలిగాడతను. కొన్ని సినిమాలు తను కూడా చూశాడు. పాపం! ఇప్పుడు అవకాశాలు లేవనుకుంటాను అనుకున్నాడు మురారి.

ఆనందరావే మళ్ళీ —"ఫీల్డ్ ఇదివరకులాగా లేదు. మా రోజుల్లో ప్రతిభకి తాంబూలం ఇచ్చేవారు. ఇప్పుడలాకాదు ప్రముఖ హీరో కొడుకు అయితే చాలు. ఇక ఎర్రగా, బుర్రగా ఉంటే చాలు హీరోయిన్ అయిపోతుంది. భాష రాకపోయినా ఫర్వాలేదు'' చివరి మాటలు అంటున్నప్పుడు గొంతు తగ్గించాడు.

కాసేపు అతనితో ఆమాటా ఈమాటా మాట్లాడి మళ్ళీ గజేంద్రరావు దగ్గిరికి వెళ్ళాడు మురారి.

ఎవరితోనో మాట్లాడుతున్న గజేంద్రరావు అతనివేపు నవ్వుతూ చూశాడు.

"ఎయిర్‌పోర్ట్‌లో షూటింగ్ ఎప్పుడు చేస్తున్నారు?" అడిగాడు మురారి.

"ఎల్లుండి చేస్తున్నాం."

"అయితే మీరు చిన్న హెల్ప్ చేయాలి. ఫిలిం లాబ్స్ మీద నేనొక ఆర్టికల్ రాస్తున్నాను. మీరు కాస్త ఎరేంజ్ చేయగలరా?" అభ్యర్థించాడు.

గజేంద్రరావు ఏదో ఆలోచించి. "ఒక పనిచేయండి. నేను రేపు వెంకటేష్ స్టూడియోకి వెడుతున్నాను. అందులో లాబ్ వుంది. మీరూ రండి" అన్నాడు.

"థాంక్యూసర్" తృప్తిగా చెప్పాడు మురారి.

4

ఆ మర్నాడు గజేంద్రరావు ఇంటికి వెళ్ళాడు మురారి. అప్పటికే అతను రెడీఅయి, మురారి రాకకోసం ఎదురు చూస్తున్నాడు.

మురారిని చూడగానే. కాఫీ. టిఫెన్ తీసుకురమ్మని నౌకర్ని పురమాయించాడు.

"వద్దండి. అన్నీ పూర్తిచేసుకునే వస్తున్నాను" అన్నాడు మొహమాటంగా.

"ఫర్వాలేదు లెండి"

టిఫెన్ కార్యక్రమం పూర్తయ్యాక "వెడదామా?" అన్నాడు గజేంద్రరావు

మురారి తలూపగానే ఇద్దరు లేచి బయటకు వచ్చి,

కారు ఎక్కారు.

బంజారాహిల్స్ రోడ్ నెం. 8 లో ఉంది వెంకటేష్ స్టూడియో. పది ఎకరాల స్థలంలో రెండు ఫ్లోర్స్, ఎడిటింగ్ రూమ్స్, ప్రాసెసింగ్ లాబ్స్ ఉన్నాయి. ఒకసారి తన స్టూడియోలోకి అడుగుపెట్టినవాళ్ళు ఏ పనికోసం బయటకు వెళ్ళకుండా అన్ని వసతులు సమకూర్చాడు స్టూడియో అధిపతి వెంకటపతినాయుడు.

పది నిముషాల తర్వాత వెంకటేష్ స్టూడియోలోకి ప్రవేశించింది కారు.

లాబ్ ముందునుంచి కారు వెళ్ళడం గమనించి—

"ఒకసారి లాబ్‌లోకి వెడదామా?" అన్నాడు గజేంద్రరావు.

"యాజ్ యూ లైక్" భుజా లెగరేసి చెప్పాడు మురారి.

గజేంద్రరావు సైగ చేయడంతో బ్రేకుమీద కాలేశాడు కారు డ్రైవర్.

ఇద్దరూ కారు దిగి లోపలికి నడిచారు.

ఆ గదిలో గోడవారగా కాన్స్ కనిపించాయి. వాటిలో ప్రాసెసింగ్ చేసిన ఫిలిం, ఎడిటింగ్‌చేసిన ఫిలిం. ప్రింట్ చేసిన ఫిలిం ఉంటాయి.

ఆ గదిలో టేబుల్‌దగ్గిర కూర్చున్న వ్యక్తి గజేంద్రరావుని చూస్తూనే లేచి నిలబడి. అభివాదం చేశాడు.

గజేంద్రరావు తలూపి—"మా 'రషెస్' ఎక్కడయ్యా? మొన్నటిలాగానే ఈ ఫిలిం కూడా పాడు చేశారా!" అధికారదర్పం ఒలకబోస్తూ అడిగాడు.

"ప్రింటు వేసి రెడీగా ఉంచాం సార్! ఇంతకుముందు నెగటివ్ మా దగ్గరకు వచ్చేసరికే పాడయివుంది సార్! మీ కెమేరామేన్‌గానీ, ఇంకెవరన్నాగానీ దాన్ని ఓపెన్ చేసి

ఉంటారు" అన్నాడతను వినయంగా.

"ఆ పాడయిన ఫిలింను మేము చూడవచ్చా?" మధ్యలో కల్పించుకుంటూ అడిగాడు మురారి.

అతను సాభిప్రాయంగా గజేంద్రరావువంక చూశాడు. అతను తలూపగానే—"ఓ.కే. సార్! రెండు నిముషాల్లో ఎరేంజ్ చేస్తాను" అని లోపలికి వెళ్ళాడు.

"మనం తీసిన 'ఔట్ టేక్స్'ను సపరేట్ చేసి వేరే కాన్‌లో వుంచుతారు. వాటిలో ఏమన్నా పనికివస్తే ఉపయోగించుకుంటాం" వివరించాడు గజేంద్రరావు.

మురారి మెదడు ఆ మాటల్ని రికార్డ్ చేసుకుంటుంటే అతని కళ్ళు మాత్రం పరిసరాలను నిశితంగా సర్వే చేస్తున్నాయి.

ఇంతలో ఆ వ్యక్తి లోపలినుంచి వచ్చి "రండి సార్" అన్నాడు.

అతనితో కలిసి ఎడిటింగ్ రూమ్‌లోకి వెళ్ళారు. ఎడిటింగు టేబుల్ ముందు కూర్చున్న వ్యక్తి గజేంద్రరావుని చూస్తూనే లేచి నిలబడ్డాడు.

అతన్ని కూర్చోమని సైగజేసి, తనూ కూర్చున్నాడు గజేంద్రరావు.

ఆ వ్యక్తి లైట్స్ ఆఫ్‌చేసి, చకచక ఏవో బటన్స్ నొక్కాడు. వెంటనే యెదురుగా ఉన్న టి.వి. స్క్రీన్ మీద బొమ్మ ప్రత్యక్షమయింది.

ఎయిర్‌పోర్ట్ భవనాలు, రన్‌వే, కంట్రోలింగు టవర్ మీద కెమేరా పాస్ అయ్యాక సన్నివేశం మొదలయింది. అయితే కుడివేపు రీలు పాడవడంతో అంత స్పష్టంగా కనబడటంలేదు కదలికలనుబట్టి యాక్షన్‌ను కొంతవరకు ఊహించగలిగాడు మురారి.

స్విచ్ ఆఫ్ చేస్తూ—"అంతా ఇలాగే ఉంది సార్! ఏ మాత్రం పనికిరాదు" అన్నాడు టెక్నీషియన్.

టెక్నీషియన్ ఆ రీలును కాన్‌లో మళ్ళీ పెట్టేసి. దాని మీద 'అపరాధి ఎవరు? ఔట్ టేక్స్' అని రాయడం మురారి గమనించాడు.

తర్వాత లాబ్‌లోంచి బయటకు వచ్చేశారిద్దరూ. దగ్గరుండి మురారిని అన్ని డిపార్ట్‌మెంట్స్‌కు తీసుకువెళ్ళి విపులంగా వివరించాడు గజేంద్రరావు. అతను చెప్పేవన్నీ శ్రద్ధగా వింటున్నట్టు నటించి, మధ్య మధ్యలో కొన్ని పాయింట్స్ నోట్ చేసుకోసాగాడు మురారి.

అంతా వివరించి—"మరిక వెడదామా?" అడిగాడు గజేంద్రరావు

"మీరు వెళ్ళండి. నేను కాసేపాగి వస్తాను" అన్నాడు మురారి.

"సరే అయితే! రేపు ఎయిర్‌పోర్ట్‌లో షూటింగ్. రావడం మరచిపోవద్దు" అని చెప్పి కారెక్కాడు గజేంద్రరావు.

కారు మెయిన్‌గేటు దాటేవరకూ చూసి వెనక్కి తిరిగాడు మురారి స్టూడియో మెయిన్‌గేటు దగ్గిర మాత్రమే సెక్యూరిటీ పటిష్టంగా ఉంది. లోపల యెటు తిరిగినా పట్టించుకునేవాళ్ళు లేరు.

నాలుగడుగులు ముందుకు వేసేసరికి ఫోను కనిపించింది. చకచక ఫోను దగ్గరకు నడిచాడు.

లాబ్ నెంబరుకు డయల్‌చేసి—"హలో! నేను గజేంద్రరావుగారి అసిస్టెంట్‌ను మాట్లాడుతున్నాను. డైరెక్టర్‌గారు ఇందాక వచ్చి ఔట్ టేక్స్‌ని చూశారటగా. అవి రెడీగా ఉన్నాయా?" గొంతు మార్చి అడిగాడు.

"ఉన్నాయి సార్!"

"అయితే నేను మనిషిని పంపిస్తాను. వాటిని అతనికివ్వండి."

"ఓ.కె. సార్!"

లైన్ కట్ చేసి, మరో నెంబరుకు డయల్ చేసి, అవతలి నుంచి సమాధానం రాగానే ఏదో చెప్పి ఫోను పెట్టేశాడు.

బయటకు వచ్చిన తర్వాత మళ్ళీ యేదో గుర్తుకు రావడంతో లోపలికి వెళ్ళి రామసుబ్బయ్య నెంబర్ కి ఫోను చేశాడు.

"సుబ్బయ్యగారూ! మీరు కోరిన ఫిలిం సంపాదించాను. ప్రస్తుతం అది నా దగ్గరే ఉంది" అన్నాడు నెమ్మదిగా.

సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అవడంతో రామసుబ్బయ్యకి వెంటనే నోట మాట రాలేనులా ఉంది. నిముషం గాప్ తర్వాత నోరు కదుపుతూ—"మై గుడ్ నెస్! ముత్తానికి ఘటికుడివే. సరే! రాత్రి ఎనిమిది గంటలకు దాన్ని తీసుకుని ఇంటికి రా!" అన్నాడు.

సరేనని చెప్పి ఫోను పెట్టేసి ఇవతలికి వచ్చాడు. అప్పుడే లంచ్ ముగించుకుని తీరికగా వస్తున్నాడు ఆ ఫోను దగ్గరుండే వ్యక్తి.

లోపలి నుంచి వస్తున్న మురారిని చూడగానే కళ్ళు చిట్లించి "ఎవరు కావాలండీ?" అనుమానంగా చూస్తూ అడిగాడు.

"ఏమీ అక్కర్లేదు" అని ముక్తసరిగా చెప్పి బయటికి నడిచాడు మురారి.

5

రాత్రి ఎనిమిది గంటలవుతుంది.

నగరాన్ని చీకట్లు చుట్టుముట్టాయి. తమ వెలుగుతో వాటిని సాధ్యమైనంతదూరం తరమడానికి వీధిదీపాలు ప్రయత్నిస్తున్నాయి.

సనత్‌నగర్‌లో ఉంటున్న రామసుబ్బయ్య ఇంటికి చేరుకున్నాడు మురారి. అతని చేతిలో వున్న సూట్‌కేస్‌లో 'అపరాధి ఎవరు?' చిత్రం పాడయిన ఫిలిం వుంది.

ఇంటి తలుపులు చేరవేసున్నాయి.

పేరుపెట్టి పిలుస్తూ తలుపుమీద మునివేళ్ళతో తట్టాడు.

సమాధానం లేదు

క్షణం ఆగి మళ్ళీ తట్టాడు ఈసారి బలంగా.

లోపల గడిపెట్టుండకపోవడంతో అవి భళ్ళున తెరుచుకున్నాయి.

లోపలంతా చీకటిగా ఉంది.

రామసుబ్బయ్య ఇంట్లో లేడా? కనీసం ఇంట్లో వాళ్ళయినా ఉండాలికదా. ఎవరూ లేకపోతే తలుపులు దగ్గరకెందుకు వేసున్నాయి? —అని ప్రశ్నించుకుని జేబులోంచి గ్యాస్‌లైటర్ తీసి, దాని వెలుగులో స్విచ్‌బోర్డ్ ఎక్కడుందో చూశాడు.

అల్లంత దూరంలో అది కనబడగానే వెళ్ళి స్విచ్ వేశాడు.

క్షణం తర్వాత ట్యూబ్‌లైట్ వెలుగు ఆ గదిలో పరుచుకుంది.

ఆ వెలుగులో గదినంతా పరిశీలించడం మొదలుపెట్టాడు.

హఠాత్తుగా అతని కళ్ళు టేబుల్‌ముందు కూర్చుని

అటువేపు తిరుగున్న రామసుబ్బయ్యమీద పడ్డాయి.

"అదేమిటి చీకటిలో కూర్చున్నారు?" అంటూ దగ్గరికి వెళ్ళాడు మురారి.

రామసుబ్బయ్య ఏమీ మాట్లాడకుండా అలా తలవంచు కునే ఉన్నాడు.

అతను కూర్చున్న తీరు చూడగానే మురారికి ఏదో అనుమానం కలిగి, భుజంమీద, చెయ్యివేశాడు.

అంతే అమాంతం పక్కకి ఒరిగిపోయాడు రామ సుబ్బయ్య. అతని ఛాతిలో కత్తి దిగబడి ఉంది.

అప్పుడు చూశాడు మురారి....రామసుబ్బయ్య కుర్చీ పక్కనే ఉన్న రక్తపు మడుగుని.

మురారి వెన్నులో చలి మొదలయింది.

రామసుబ్బయ్యని ఎవరో హత్యచేసి తెలివిగా కుర్చీలో కూర్చోబెట్టారని అర్థమైందతనికి.

ఇంతకు ముందు తను ఎన్నో కేసులు టేకప్‌చేశాడు కానీ ఇలా క్లయింట్ హత్య చేయబడటం ఇదే మొదటి సారి.

చిన్నగా నిట్టూర్చి ఒకసారి గదంతా కలయజూశాడు. ఇంట్లో ఎవరు ఉన్న అలికిడిలేదు. ఏమయ్యారు వాళ్ళంతా? రామసుబ్బయ్యే ఎక్కడికన్నా పంపించాడా?

ఆలోచనలను పక్కకునెట్టి. తన ఆధారాలు ఏమీ దొరక్కుండా జాగ్రత్తపడి బయటకు వచ్చేశాడు.

రూమ్‌కు చేరుకుని తీరికగా ఆలోచించడం మొదలెట్టేడు మురారి.

చూడబోతే వజ్రాల వర్తకుడి హత్యకు. రామసుబ్బయ్య హత్యకు ఏదో లింక్ ఉన్నట్టు కనబడుతోంది.

సినిమా షూటింగ్ జరుగుతున్నవుడు ఆ హత్య జరి

గింది కాబట్టి దానికి సంబంధించిన క్లూ ఏదో కెమేరాలోకి ఎక్కి ఉంటుంది. అది గ్రహించి హంతకుడు ఆ రీల్‌ని పాడుచేసి ఉంటాడు.

మరయితే ఆ ఫిలింని తెమ్మని రామసుబ్బయ్య తనను ఎందుకు చెప్పాడు? అతడే హంతకుడా?

ఊహూ అయి ఉండదు. హంతకుడు అలా చేయడం చూసిన రామసుబ్బయ్య అతన్ని బ్లాక్‌మెయిల్ చేయడానికి పూనుకుని ఉంటాను. హంతకుడి క్లూ ఏదో ఆ ఫిలింలో ఉండబట్టే అంత డబ్బు తనకు ఇచ్చి దాన్ని తీసుకురమ్మన్నాడు. తను ఫిలిం దొరికిందని ఫోన్ చేయగానే, రామసుబ్బయ్య హంతకుడికి ఫోన్‌చేసి డబ్బు తీసుకుని రమ్మనుంటాడు. హంతకుడు తనకంటే ముందే వెళ్ళి రామసుబ్బయ్యను హత్యచేసి చక్కా పోయుంటాడు. డబ్బు కోసం ఒక హత్య చేసిన అతనికి రెండో హత్య చేయడం అంత కష్టం కాకపోవచ్చు.

ఇప్పుడు ఆ ఫిలిం తన దగ్గరుంది. దాన్ని పరిశీలనగా చూస్తే హంతకుడు ఎవరో తెలియాలి.

ఈ ఆలోచన రావడమే తడవుగా హుషారుగా కుర్చీలోంచి లేచాడు మురారి.

రూమ్ లాక్‌చేసి ఫొటోగ్రఫీ సామాన్లు అమ్మే షాపుకు వెళ్ళాడు. అక్కడ మూవియోలా యూనిట్ కొన్నాడు.

రూమ్‌కి తిరిగివచ్చేసి, ఆ యూనిట్‌ని సెట్‌చేసి, అందులోకి ఫిలిం ఎక్కించాడు.

లైట్ ఆఫ్‌చేసి. స్విచ్ నొక్కాడు.

సౌండ్‌సిస్టం లేకపోవడంతో నిశ్శబ్దంగా రీలు తిరగసాగింది.

ఆసక్తిగా చూడసాగాడు మురారి.

ఎయిర్‌పోర్ట్ బిల్డింగ్స్, తర్వాత కొంతమంది ప్రయాణీకుల మీదకు పాన్ అయింది కెమేరా. కొందరు తలలు తిప్పి కెమేరా వేపే చూస్తున్నారు.

ఇంతలో శ్రీలత సీన్‌లోకి వచ్చింది. ఆమె పక్కనే హీరో సూట్‌కేస్ పట్టుకుని నడుస్తున్నాడు.

హఠాత్తుగా ఒక వ్యక్తి లౌంజ్‌కి ఎంటరయ్యారు. అతన్ని చూడగానే వీళ్ళిద్దరు పరిగెత్తడం ప్రారంభించారు. ఆ వ్యక్తి జేబులోంచి పిస్టల్ తీసి వాళ్ళను పేల్చబోయాడు. అయితే ఒక లావుపాటి స్త్రీ అడ్డురావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు.

ఇంతలో కానిస్టేబుళ్ళతో పోలీస్ ఇన్‌స్పెక్టర్ లౌంజ్‌లోకి ప్రవేశించాడు. అతన్ని చూస్తూనే రామసుబ్బయ్యగా గుర్తుపట్టాడు మురారి.

ఆ తర్వాత రీలు ఖాళీగా తిరగసాగింది.

అంతా చూసినా హంతకుడికి సంబంధించిన ఆధారాలు ఏమీ లభ్యం కాలేదు.

అయినా ఆశ చావక రివైండ్ చేసి మళ్ళీమళ్ళీ చూశాడు. కానీ అతనికేమీ అంతు దొరకలేదు.

విసుగుపుట్టి. ఆ యూనిట్‌ని పాక్ చేశాడు. ఫిలింను జాగ్రత్తగా కప్‌బోర్డ్‌లో పెట్టి టైం చూసుకున్నాడు.

పన్నెండయింది

'మైగాడ్' అనుకుని మంచంమీదకు చేరి నిద్రకు ఉపక్రమించాడు.

6

మర్నాడు లేవగానే చకచక తయారయి బయటికి బయలుదేరాడు మురారి.

పాన్‌షాప్‌లో పేపరు కొని పేజీలు తిరగేశాడు. నాలుగో

పేజీలో రామసుబ్బయ్య హత్య వివరాలు ఉన్నాయి. అతని ఫొటోకూడా వేశారు.

అది చదివి పేపర్ మడిచేసి ముందుకు నడవబోయాడు.

ఇంతలో వెనుకనుంచి "పొద్దున్నే ఎక్కడికో బయలు దేరుతున్నట్టున్నావే మురారి" అంటూ పలకరిందాడు చల పతి.

"ఓహ్. ఇన్‌స్పెక్టర్‌సాబ్ నన్ను ఫాలో అవడం మీరు మానలేదన్నమాట" అంటూ వెనక్కితిరిగాడు మురారి.

"నువ్వు అడుగు పెట్టినచోట నేరాలకు కొదు వేఉండ దని నా నమ్మకం. రామసుబ్బయ్య అనే నటుణ్ని ఎవరో హత్య చేశారు. మొన్న వజ్రాలవర్తకుడిని చంపిన పద్ధతి లోనే ఈ హత్య జరిగింది" శల్యపరీక్ష చేస్తున్నట్లుగా అతనివేపు చూస్తూ చెప్పాడు చలపతి.

"అలాగా!" తాపీగా అన్నాడు మురారి.

"మొన్న ఎయిర్‌పోర్ట్‌లో జరిగిన షూటింగ్‌లో రామ సుబ్బయ్య ఓ చిన్న కారెక్టర్ వేశాడట. ఈ రెండు హత్యలు ఒకరే చేసుంటారనీ, ఆ ఒకరు నువ్వేనని నా అనుమానం" బాంబ్ పేల్చడానికి ప్రయత్నించాడు చల పతి.

"మీ అనుమానం పూర్తిగా నిరాధారం అని చెప్ప డానికి విచారిస్తున్నాను సార్."

అదేమీ పట్టించుకోకుండా "మీ ఇంటిని సెర్చ్ చేయాలి పద" అన్నాడు సీరియస్‌గా.

"సెర్చ్ వారెంట్ తెచ్చుకుని అలాగే చేసు కోండి ఇనస్పెక్టర్‌సాబ్" తొణక్కుండా చెప్పాడు మురారి.

చలపతి పళ్ళు నూరుకుని "ఈసారి నా చేతుల్లోంచి

తప్పించుకోలేవు మురారి! ఈ రెండు హత్యలకు లింక్ ఉందని తెలిపే ఫిలింను నిన్న నీవు వెంకటేష్ స్టూడియో నుంచి ఎత్తుకొచ్చావ్!" అన్నాడు.

"ఏ ఫిలిం సార్?" ఏమీ తెలియనట్లుగా అడిగాడు మురారి.

అతనలా ప్రశ్నించేసరికి వళ్ళు మండిపోయింది చల పతికి.

"ఏ ఫిలిమా? శుక్రవారం ఎయిర్‌పోర్ట్‌లో షూట్ చేసిన ఫిలిం. దాని నుంచి ఏమన్నా క్లూలు దొరుకుతాయేమోనని నిన్న స్టూడియోకి వెళ్ళాను. అప్పటికే ఆ ఫిలిం తీసుకు వెళ్ళిపోయారని తెలిసింది. రికార్డ్స్ వెరిఫై చేస్తే నారా యణ అనే వ్యక్తి తీసుకు వెళ్ళాడని తేలింది. ఆ నారా యణ తీగలాగితే నీ డొంక బయటపడింది."

"బావుంది. మీ కథనం చాలా బావుంది" చప్పట్లు చరిచి చెప్పాడు మురారి.

మొహం కందగడ్డలా చేసుకుని "ఇది కథ కాదు మురారి....పచ్చి నిజం. రామసుబ్బయ్యని వజ్రాల వర్తకు డిని చంపిన హంతకుడి కోసం నువ్వీ దొంగతనం చేశావు" అన్నాడు చలపతి.

"లేదు... లేదు."

"బుకాయించాలని చూడకు మురారి. హంతకుడికోసం కాకపోతే రామసుబ్బయ్య కోసం దొంగతనం చేశావు. అంతేకదూ!"

"నేను ఎవరి కోసమూ ఏ దొంగతనమూ చేయలేదు" నిష్కర్షగా చెప్పేశాడు మురారి.

"కాదు. ఆ దొంగతనం నువ్వే చేశావు. నేను తలుచు కుంటే క్షణాల్లో నిన్ను అరెస్ట్ చేయించగలను. మైండిట్"

అన్నాడు చలపతి గట్టిగా.

"ఆవేశపడకండి ఇనస్పెక్టర్ సాబ్. మీకు కావలసింది వజ్రాలు. ఆ ఇద్దరినీ చంపిన హంతకుడు అంతేగా!" అడిగాడు మురారి.

"అవును"

"అయితే వజ్రాలను, ఆ హంతకుడిని తీసుకువచ్చి మీకు అప్పగిస్తాను సరేనా?"

అతనివేపు అనుమానంగా చూశాడు చలపతి.

"అమ్మతోడు సార్! నన్ను నమ్మండి. రామసుబ్బయ్య నా క్లయింట్. ఆ ఫిలింను తెచ్చి అతనికిచ్చేలోపలే ఎవరో అతన్ని హత్య చేసారు" చెప్పాడు మురారి.

అది వినగానే చలపతి మొహంలో సీరియస్‌నెస్ తొలగిపోయి దాని స్థానం కుతూహలం చోటు చేసుకుంది.

"ఏముందా ఫిలింలో?" ఆసక్తిగా అడిగాడు.

"ఏమీ దొరకలేదు. అయితే ఇవాళ గజేంద్రరావు ఆ సీన్స్‌ని మళ్ళీ ఎయిర్‌పోర్ట్‌లో షూట్ చేస్తున్నాడు. దాని వల్ల ఏమన్నా ఆధారాలు లభిస్తాయనుకుంటున్నాను."

"ఈ వంకతో పారిపోడానికి ప్రయత్నించకు మురారి. వేయి కళ్ళతో నిన్ను కాపలా కాస్తుంటాను" హెచ్చరించాడు చలపతి.

"నన్ను నమ్మండి సార్. హంతకుడిని మీకు పట్టి అప్పగించేదాకా నేను ఎక్కడికీ పారిపోను" హామీ ఇచ్చాడు మురారి.

"సరే. ఎయిర్‌పోర్ట్‌లో కనిపిస్తాను" అని మోటర్ బయిక్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు చలపతి.

భుజాలెగరేసి తనూ ఎయిర్‌పోర్టుకు బయలుదేరాడు మురారి.

7

ఎయిర్‌పోర్ట్ జనంతో కిక్కిరిసి ఉంది. అందులోనూ గ్లామర్‌క్వీన్ శ్రీలత షూటింగ్ అని తెలిసేసరికి ఇసుక వేస్తే రాలనంతగా జనం పోగయ్యారు. ముందుకుతోసుకు వస్తున్న జనాన్ని లాఠీలతో వెనక్కి నెడుతున్నారు పోలీసులు.

జనం మధ్య నుంచి దారి చేసుకుని స్పాట్‌కు చేరుకున్నాడు మురారి.

గజేంద్రరావు హడావిడి పడుతూ అటు ఇటు తిరుగుతున్నాడు.

మురారిని చూడగానే - "హలో వచ్చారా? థాంక్యూ" అని పలకరించాడు.

"మీ ఫిలింను ఎవరో దొంగిలించారట. నిజమేనా?" ఏమీ ఎరగనట్టు అడిగాడు మురారి.

"అవునండి. కానీ అవి పోయినా ఉన్నా ఒకటే. నథింగ్ టు వర్రీ" తేలిగ్గా చెప్పాడు గజేంద్రరావు.

తర్వాత మురారిని కూర్చోమని చెప్పి అవతలికి వెళ్ళిపోయాడు గజేంద్రరావు.

బోయ్ కుర్చీ తెచ్చి వేశాడు. దానిలో కూర్చుంటూ ఒకసారి చుట్టూ చూశాడు మురారి.

అల్లంత దూరంలో శ్రీలత కుర్చీలో కూర్చుని పక్కనే ఉన్న హీరోతో నవ్వుతూ ఏదో మాట్లాడుతోంది!

మురారి తనవేపు చూడగానే పలకరింపుగా నవ్వి, కళ్ళతోనే కుశల ప్రశ్నలు వేసింది. మురారి నవ్వి ఊరుకున్నాడు.

ఇంతలో ఆనందరావు అతని దగ్గరకు వచ్చాడు. వస్తూనే "రామసుబ్బయ్య సంగతి తెలిసిందా మీకు?" అన్నాడు.

"తెలుసన్నట్లుగా తలూపి "ఈ సినిమాలో ఆయన కారెక్టర్ ఏమిటి?" అడిగాడు మురారి.

"పోలీస్ ఇన్స్పెక్టర్. పాపం ఎవరు చంపారో ఏమో" దిగాలుగా మొహం పెట్టి అన్నాడు ఆనందరావు.

"మరి ఆ వేషం ఎవరు వేస్తున్నారు?"

"ఎవరో జూనియర్ ఆర్టిస్టు. అంత ప్రాధాన్యత ఉన్న వేషం కాదులెండి."

వీళ్ళు ఇలా మాట్లాడుకుంటుండగా—"ఎవరి పొజిషన్‌లోకి వాళ్ళు రావాలి" హాండ్ మైక్‌లో అనౌన్స్ చేశాడు గజేంద్రరావు.

"మళ్ళీ కలుస్తాను" అనేసి ముందుకు వెళ్ళాడు ఆనందరావు.

జరిగేది చూస్తూ నిలబడ్డాడు మురారి.

కెమెరా వ్యూ ఫైండర్‌లోంచి అందరి పొజిషన్లు చూసి 'యాక్షన్' చెప్పాడు గజేంద్రరావు. కెమెరాలో రీలు శబ్దం చేస్తూ తిరగసాగింది.

శ్రీలత వెనకా ముందు చూడకుండా రివ్వున పరిగెత్తుతోంది. సూట్ కేస్ పట్టుకున్న హీరో ఆమె వెనకాలే పరిగెత్తుతున్నాడు. ఇంతలో ఒక ఆగంతకుడు వాళ్ళని అనుసరిస్తూ లాంజ్‌లోకి ప్రవేశించాడు. పారిపోతున్న ఆ ఇద్దరిని చూడగానే కాలరుద్రుడై రివాల్వర్ తీసి కాల్చబోయాడు. అయితే ఇంతలో ఆనందరావు ఒక లావుపాటి స్త్రీ అడ్డు రావడంతో అతని ప్రయత్నం ఫలించ

లేదు.

"కటిట్ ...ఓ.కే" అని అరిచాడు గజేంద్రరావు.

మరో షాట్ తీయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఇదంతా చూస్తున్న మురారికి లీలగా ఏదో అనుమానం కలిగింది. తను ఇంతకుముందు ఫిలింలో చూసిన దాన్ని గుర్తు తెచ్చుకోసాగాడు.

ప్రొడక్షన్ బాయి చల్లటి మజ్జిగ తెచ్చి అందరికీ ఇవ్వసాగాడు.

మజ్జిగ తాగుతూన్న మురారి చూపు అప్రయత్నంగానే జనం దాటుకుని వెడుతున్న ఒక జూనియర్ ఆర్టిస్టుమీద పడింది. ఆమె దిక్కులు చూస్తూ నడుస్తుండటంతో అనుమానంగా ఆమెవేపే చూడసాగాడు.

ఆమె టాయిలెట్స్ దాటి మరింత ముందుకు వెడుతుండటంతో లేచి ఆమెని అనుసరించసాగాడు.

ఎయిర్‌పోర్టు అనుకున్న మెయిన్‌రోడ్ పక్కనే కొంత మంది తాత్కాలికంగా గుడిసెలు వేసుకుని ఉన్నారు. రోడ్డుమీద కప్పలు, పింగాణీ సామాన్లు అవీ అమ్ముతుంటారు వాళ్ళు.

ఆ యువతి సరాసరి ఆ గుడిసెల దగ్గరకి వెళ్ళి ఒక తన్ని ఏదో అడిగింది. ఆతను లోపలికి వెళ్ళి ఒక బాగ్‌ను తెచ్చి ఆమె చేతికి ఇచ్చాడు.

ఇంతలో వాళ్ళను సమీపించాడు మురారి.

ఆ బాగ్‌ని తీసుకుని వెనక్కి తిరగబోయి, మురారిని చూడగానే ఆగిపోయి భయంతో బాగ్‌ని గుండెలకు హత్తుకుంది.

"ఏముందా బాగ్‌లో?" అడుగు ముందుకువేస్తూ అడి

గాడు మురారి.

సమాధానం చెప్పకుండా భయంతో ఒక అడుగు వెనక్కి వేసిందా యువతి.

"నిన్నే అడిగేది. ఏముందా బాగ్‌లో?" రెట్టించాడు మురారి.

"ఏమో నాకు తెలీదు. ఇది నాది కాదు. ఆయన దాయమంటే ఇక్కడ దాచాను" బెరుకుగా పలికింది ఆ యువతి స్వరం.

"ఎవరాయన?" ఆసక్తిగా అడిగాడు మురారి.

ఆ యువతి ఏదో చెప్పబోయేంతలో "నేను" అని వెనుకనుంచి వినబడింది.

గిరుక్కున వెనక్కి తిరిగాడు మురారి. అతనికి కొంచెం దూరంలో నిలబడి వున్నాడు ఆనందరావు.

అతన్ని చూడగానే మురారి అనుమానం పటాపంచలై పోయి. పెదాలమీద చిరునవ్వు వెలసింది.

"ఓహో! అసలు కధానాయకుడివి నువ్వన్నమాట. అయితే వజ్రాల వర్తకుడిని చంపి, ఆ వజ్రాలు ఈ బాగ్‌లో దాచేవన్నమాట యామై కరెక్ట్?" అడిగాడు మురారి.

అది వినగానే ఆనందరావు మొహంలో రంగులు మారాయి. అయినా వెంటనే కప్పిపుచ్చుకుని, "వాట్ నాన్సెన్స్ యు ఆర్ టాకింగ్. వజ్రాల వర్తకుడు ఎవరు? వజ్రాలు ఏమిటి?" చిరాకుగా మొహంపెట్టి అడిగాడు.

"తెరమీద నటిస్తే ఫరవాలేదు కానీ జీవితంలో నటిస్తే దెబ్బతింటావు ఆనందరావ్. మొన్న శుక్రవారం రోజున ఇక్కడ షూటింగ్ జరిగినపుడు షూటింగులో పాల్గొనకుండా

అప్పుడే ఫ్లైయిట్ దిగిన వజ్రాల వర్తకుడిని హత్యచేసి, వజ్రాలు కాజేశావు. లెక్కప్రకారం ఆ సీన్‌లో ఆగంతకుడు రివాల్వర్ పేలుస్తున్నప్పుడు నువ్వు, ఆ లావుపాటావిడ అడ్డుతగలాలి. కానీ ఆ షాట్‌లో నువ్వు లేవు.

హడావిడిలో ఎవరూ ఆ విషయాన్ని పట్టించుకోలేదు కాని రామసుబ్బయ్య మాత్రం పసికట్టాడు. మర్నాడు హత్య ఉదంతం పేపర్లో చదివి నిన్ను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. నువ్వే హంతకుడివని నిరూపించే ఏకైక ఆధారం ఫిలింను నువ్వు పాడు చేశావు. ఆ ఫిలింను నేను తెచ్చి రామసుబ్బయ్యకు ఇచ్చేలోపు అతనిని హత్యచేశావు. ఇప్పుడు సందుచూసుకుని దాచిన వజ్రాలను తీసుకుని ఉడాయించాలని అనుకుంటున్నావు. అంతే కదూ" అగాడు మురారి.

"అంతా ట్రాష్. కట్టుకథ. నాకేమీ తెలీదు" అది రోడ్డన్న సంగతి మరిచిపోయి బిగ్గరగా అరిచాడు ఆనందరావు.

ఇంతలో దూరం నుంచి ఈ తతంగాన్ని గమనిస్తున్న ఇన్‌స్పెక్టర్ చలపతి—"వాట్ హాపెండ్ మురారి. ఏమిటి గొడవ?" అంటూ దగ్గరకి వచ్చాడు.

"సమయానికి వచ్చారు ఇన్‌స్పెక్టర్ సాబ్. మొన్న ఎయిర్‌పోర్టులో వజ్రాల వర్తకుడిని చంపిన హంతకుడు, రామసుబ్బయ్యని చంపిన హంతకుడు ఇతనే. అరెస్టు హిమ్" అన్నాడు మురారి.

"అంతా అబద్ధం. నాకేమీ తెలియదు. నేను నిర్దోషిని" మళ్ళీ అరిచాడు ఆనందరావు.

అంతా వింటూ భయంతో బిక్కచచ్చిన ఆ యువతి

చేతుల్లోని బాగుని ఒక్క ఉదుటున లాక్కొని, దాన్ని తెరిచి వజ్రాలు బయటకితీసి చూపిస్తూ—"మరి ఈ వజ్రాలు ఎవరివి?" అనడిగాడు మురారి.

అంతే. ఒక్కసారిగా రెండు చేతుల్లో మొహం దాచుకుని బావురుమన్నాడు ఆనందరావు.

"చలపతి సాబ్, అన్నట్లుగానే హంతకుడిని వజ్రాలని మీ చేతికి అప్పగిస్తున్నాను. ఇప్పుడైనా నామీద అనుమానం తీరిందా?" బాగ్‌ని అతని చేతికిస్తూ అడిగాడు మురారి.

ఆ బాగు అందుకుని, అందులో వజ్రాలను ఒకసారి తనిఖీచేసి. "నీ జీవితంలో ఇప్పటివరకూ చేసిన మంచి పని ఇదేనోయ్ మురారీ!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ చలపతి. నవ్వి ఊరుకున్నాడు మురారి. □

ఈ చీర ఏ వొంటికి అందం?



సీరియల్

నేరగాళ్ళతో నేరగాళ్ళు

ప్రతాపరవిశంకర్ 8

(గత సంచిక తరువాయి)

మేనేజర్ గట్టిగా గాలి పీల్చుకుని ఎస్.పి. నాయక్‌కి నమస్కారంపెట్టి "మీకు ఫోను చేసిన మేనేజర్‌ని నేనే." అన్నాడు.

"గుడ్....వీళ్ళిద్దరూ ఎందుకొచ్చా రిక్కడికి?" నాయక్ అడిగాడు భయంతో వణుకుతున్న ఆ లావుపాటి కిరాయి గూండాలను చూస్తూ.

వాళ్ళు రావటం—వినాయక్ ఫోటో చూపించి అతడి గురించి ఆరాతీయటం—అంతా చెప్పాడు మేనేజరు.

"వినాయక్ గురించి వచ్చారా?!" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవును సార్....క్రయింబ్రాంచ్ మనుషులమని చెప్పారు. గది సోదా చెయ్యాలన్నారు."

"ఇన్‌స్పెక్టర్.... ....వాళ్ళిద్దరికీ బేడీలు వెయ్యండి. జాగ్రత్తగా కాపలా కాయండి....వినాయక్ హత్యకీ,

వీళ్ళకీ సంబంధం ఉంటుంది" అన్నాడు నాయక్.

ఆ గూండా లిద్దరూ బేడీలు వేయించుకుంటూ మేనేజర్ని క్రూరంగా చూశారు.

"రండి సార్....వినాయక్ వున్న ఆ గదిని చూపిస్తాను" అన్నాడు మేనేజరు.

"లెట్స్ గో" అన్నాడు నాయక్ మిగిలినవాళ్ళను చూస్తూ—ముందుకు కదిలి.

మేనేజరు డూప్లికేట్ కీ తీసుకుని వాళ్ళను పైకి తీసుకువెళ్ళాడు. రూం కుర్రాళ్ళను పోలీసులు కిందనే వుంచేశారు.

మేనేజరు వినాయక్ దిగిన గదితాళం తెరిచి లోపలకు అడుగుపెట్టి స్విచ్ నొక్కాడు.

గది వెలుతుర్లో మాసిపోయిన గోడలతో అసహ్యంగా వున్న గది వాళ్ళకు కనపడింది.

"ఈ గదిలో వినాయక్ వున్నాడా?" పైకే అన్నాడు నాయక్.

"అవును....ఈ గదిలోనే."

—గోడ పక్కనే వున్న పెద్ద సూట్కేసు వుంది.

బల్లకింద చిన్న సూట్కేసు వుంది.

"ఆ రెండు సూట్కేసులనూ ఓపెన్ చెయ్యండి" అన్నాడు నాయక్.

బల్లకింద వున్న సూట్కేసు సులభంగానే తెరుచుకుంది. అందులో మేకప్ సామగ్రి వుంది—ఒక జత బట్టలు, ఎనిమిది వందరూపాయల నోట్లు, కొంత చిల్లర వున్నాయి.

కొంచెం ఆలస్యంగా పెద్ద సూట్కేసు తెరుచుకుంది. అందులో వున్న మూడు ఒకేరంగు సూట్కేసులను ఆళ్ళ

ర్యంగా చూశాడు మేనేజరు.

అంతా ఆసక్తిగా చూశారు వాటిని....

ఆ మూడు సూట్కేసుల్లో ఏముందో తెలీదు.

"ఊ... తెరవండి" గట్టిగా అన్నాడు నాయక్ ఒక ఇన్స్పెక్టర్ ఆగిపోవటం గమనించి.

"సర్ ... వీటిల్లో ఏముందో తెలీదు....తెలుసుకోకుండా తెరవటం డేంజరేమో" అన్నాడతను.

"డోంట్ బి ఫూలిష్....ఇటివ్వు....నేను తెరుస్తాను" అన్నాడాయన.

"సారీ....వద్దు సర్....నేనే తెరుస్తాను" అంటూ ఆ ఇన్స్పెక్టర్ మొదటి సూట్కేసును తెరిచాడు. అందులో వాళ్ళకు వరసగా పేర్చివున్న కరెన్సీనోట్లు కనపడ్డాయి.

"కవుంట్ దెమ్!"

గబగబా లెక్కపెట్టారు ఆ నోట్లని.

"ట్వెంటీఫైవ్ లాక్స్" అన్నాడు ఒక ఆఫీసర్.

'పాతిక లక్షలా!' లోపలే అనుకున్నాడు మేనేజరు.

మిగిలిన రెండు సూట్కేసుల్లోనూ ఒక్కోదాంట్లో పాతిక లక్షలు వున్నాయి.

"ఓ....గాడ్ .... సెవెంటీఫైవ్ లాక్స్" అన్నాడు ఒక ఇన్స్పెక్టర్ నాయక్ను చూస్తూ.

"ఎస్....చాలా పెద్ద మొత్తం....ఘరానా పెద్దమను షుల్ని బ్లాక్మెయిల్ చేసి లాక్కున్న మనీ. వినాయక్ డబ్బు సంపాదించాడు. కాని ప్రాణాలు పోగొట్టుకున్నాడు. చీకటి రాజులతో చదరంగం ఆడాడు. ఓడిపోయాడు.... గదినంతా ప్రతి అంగుళం గాలించండి....డబ్బుకంటే విలువైన సమాచారాన్ని వినాయక్ ఎక్కడో దాచి వుంచాడు. ముందు మనం దాన్ని పొందాలి" నాయక్

అన్నాడు.

ఇన్‌స్పెక్టర్లు, పోలీసు లిద్దరూ ఆ గది మంచంకింద వెతికారు. మంచంమీద వున్న మరకలుపడ్డ పరుపును చించేశారు. వెతికారు.... అంగుళం కూడా వదలకుండా అంతా వెతికారు. వాళ్ళకేమీ దొరకలేదు.

"ఆల్ రైట్ పదండి!"

గదిలోనుంచి బయటకు వచ్చారు.

మేనేజరు గదికి తాళం వేశాడు మళ్ళీ.

వాళ్ళంతా కిందకు వొచ్చేసరికి నలుగురు పోలీసుల మధ్య నిలబడ్డ ఆ కిరాయి గూండాలు ఇన్‌స్పెక్టర్ల చేతుల్లో వున్న సూట్‌కేసులను చూస్తూనే ఉలిక్కి పడ్డారు.

అవును. అవే సూట్‌కేసులు. ఒక్కోదాంట్లో పాతిక లక్షల రూపాయలున్నాయి.

పేడీలను తెంచుకుని ఆ సూట్‌కేసులను లాక్కుని పారిపోవాలనే ఆవేశం వాళ్ళ మొహాల్లో ప్రత్యక్ష మయ్యింది.

ఎస్.పి. నాయక్ హసీనాలాడ్జి మేనేజర్ని పొగిడాడు. డెబ్భయ్యైదు లక్షల రూపాయల్ని, హత్యకేసుకు సంబంధం వున్న ఇద్దరు నేరస్తులను పోలీసులకు పట్టిచ్చినందుకు థాంక్స్ చెప్పాడు. పోలీసుశాఖ తరఫున ఒక మంచి బహుమతిని అందిస్తానని ప్రామిస్ చేశాడు.

మేనేజరు గర్వంగా రూం కుర్రాళ్ళను చూశాడు.

ఇన్‌స్పెక్టర్ ఒక స్టేట్‌మెంటు రాసి దానిమీద మేనేజరు సంతకం చేయించుకున్నాడు.

"గుడ్.... వెళ్ళొస్తాం.... థాంక్ యు వన్సెగెయిన్" అని మేనేజరుతో కరచాలనం చేసి ముందుకు కదిలాడు నాయక్ కొంచెంసేపు వినాయక్ గురించిన ప్రశ్న

లడిగి....

నకిలీ క్రైంబ్రాంచ్ మనుషుల్ని జీపులోకి నెట్టారు.

అంతా జీపుల్లో ఎక్కారు.

అప్పటికి చాలా సేపట్నించీ లాడ్జి ఎదురుగా వున్న రెస్టారెంటులో మనుషులు బయటకు వచ్చి పోలీసులను, బేడీలు వేయించుకున్న గూండాలను చూస్తూ నిలబడ్డారు.

పోలీసులు జీపుల్లో యెక్కిన తర్వాత రూంబోయిస్ రోడ్డుమీద నిలబడ్డ జనానికి పోలీసులు ఎందుకు వచ్చారో చెప్పటం మొదలు పెట్టారు.

జీపు కదిలి వెళ్ళిపోయేటప్పుడు అడిగాడు మేనేజరు ఆ ప్రశ్నను ఎస్.పి. నాయక్‌ను. ఎప్పటినించో అడగాలనుకుంటూనే అడగలేక వూరుకున్నాడు.

చివరకు క్యూరియాసిటీని చంపుకోలేక అడిగేశాడు—

"సార్... ఇంతకీ వినాయక్ గూఢచారేనా?"

యస్. పి. నాయక్ ఒక్క క్షణం ఆశ్చర్యపడి అంతలోనే నవ్వి "అవును గూఢచారి....చాలా గొప్పవాడు" అన్నాడు.

జీపులు వెళ్ళగానే మేనేజర్ వెనక్కి తిరిగి "విన్నారా? నేను వూహించిందే నిజం. వినాయక్ గూఢచారి" అన్నాడు రూం కుర్రాళ్ళతో.

18

బూటుకాలితో జోగిందర్ డొక్కలో శక్తి కొద్దీ తన్నాడు వాడియా.

ఎగిరి బంతిలా కీచుమని అరుస్తూ దూరంగా పడ్డాడు జోగిందర్. జైన్ తనకు దగ్గరలో పడిన జోగిందర్‌ను కాలరు పట్టుకుని పైకి లేపదీసి ఈడ్చి మొహం మీద అరిచేత్తో చరిచాడు,

కెవ్వుమన్నాడు జోగిందర్ బాధతో.

మిగిలిన అనుచరులు కళ్ళనిండా భయాన్ని పెట్టుకుని వణుకుతూ నిలబడ్డారు. ముగ్గురు చీకటి చక్రవర్తులు దెబ్బ తిన్న పుల్లా రేగిపోయారు. వాళ్ళు ఏ క్షణాన్నయినా జోగిందర్ని. ఇతర అనుచరులను కాల్చి చంపడానికి సిద్ధంగా వున్నట్టు వాళ్ళకు కనపడ్డారు.

"డర్టీ రోగ్....నీలాంటి చేతకాని వెధవని బతకనివ్వ కూడదు. రూపాయి, రెండూ కాదు. సెవెంటీ ఫైవ్ లాక్స్....ఆ వినాయక్ మన దగ్గిర కొట్టేసి చివరకు పోలీసులకు అప్పగించాడు చచ్చి. మీరంతా చేతకాని వెధవల్లాగా ఆ డబ్బు ఎక్కడుందో తెలుసుకోలేకపోయారు. వాడు ఎక్కడో మారుమూల ప్రాంతంలో ఏ హోటల్లోనో దిగి వుంటాడని, వెతికి ఆ డబ్బును పట్టుకోమని చాలా క్లియర్గా చెప్పాను....కాని చివరకు పోలీసులు వచ్చే వరకూ ఆ లాడ్జిని తెలుసుకోలేకపోయారు. ఛీ....మీరంతా డర్టీడాగ్స్" జేవురించిన మొహంతో గట్టిగా అన్నాడు జైన్.

"క్షమించండి బాస్....మా ప్రయత్నాలన్నీ మేం చేశాం. ఒక్కొక్క లాడ్జినీ వెతుక్కుంటూ వెళ్ళేసరికి బాగా ఆలస్యమయిపోయింది. ఆ లాడ్జి మేనేజర్ పేపర్లో వినాయక్ ఫోటో చూసి పోలీసులకు ఫోన్ చెయ్యకుండా వుంటే మనవాళ్ళు ఆ లాడ్జి గదిలో వున్న డబ్బునంతా లాక్కొచ్చేవాళ్ళు" ఏడుపు గొంతుతో చెప్పాడు జోగిందర్.

అతడికి అవమానంతో వళ్ళంతా కంపించిపోయింది. ముఖ్యమైన అనుచరుడిగా ముగ్గురు బాస్ల అభిమానాన్ని పొందాలని అనుకుంటే ఇప్పుడు ఇద్దరు బాస్లు కలిసి

వంతులేసుకుని ఇతర అనుచరుల ముందు కొట్టి అవమానించారు. ఐనా జోగిందర్ ఆ అవమానాన్ని లెక్కచెయ్యలేదు. ఎట్లాగయినా వినాయక్ ఎక్కడో దాచివుంచిన ఆ ఆ సీక్రెట్ ఎవిడెన్స్‌ను సంపాదించి ఆ ముగ్గురినీ సంతోషపెట్టాలి. ఇదీ జోగిందర్ ఆలోచన.

అప్పటివరకూ సిగరెట్ కాలుస్తూ మవునంగా కూర్చున్న ధనుంజయ్ జేబులోనించి రివాల్వర్ బయటకు తీసి జోగిందర్‌కు గురిపెట్టి "నువ్వు చావక తప్పదు" అన్నాడు వున్నట్టుండి.

"బాస్...." కంగారుగా అరిచాడు జోగిందర్.

"అవును....ఈ గ్యాంగులో నిర్లక్ష్యంగా ప్రవర్తించిన మనుషులకు చావు తప్పదని నీకు తెలుసు. నీ చేతకానితనంవల్ల మేం పెవెంటీపైవ్ లాక్స్ నష్టపోయాం. అందుకు నువ్వు ఫలితం అనుభవించాలి. తప్పదు" అంటూ సేఫ్టీకేచ్ తప్పించి ట్రిగ్గర్ మీద వేలు బిగించాడు.

"వద్దు బాస్....నన్ను చంపొద్దు ప్లీజ్' మెడ నరకబోతున్న జంతువులా అరిచాడు.

మిగిలిన అనుచరులు వూపిరి బిగబట్టి నిలబడిపోయారు కాళ్ళకు మేకులు బిగించి కొట్టినట్టు.

"ఢాం"

కిందపడిపోయాడు జోగిందర్.

అనుచరుల మొహాలు తెల్లగా పాలిపోయాయి. వాళ్ళకు కూడా చావు తప్పదనే అనుకున్నారు.

ఒక్క నిముషానికి జోగిందర్ కదిలి లేచి నిలబడ్డాడు.

"బతికిపోయావ్.... నీకు ఇంకో అవకాశం వుంది" అన్నాడు ధనుంజయ్-జైన్ కళ్ళసైగను గ్రహించి.

అనుచరులు ఆశ్చర్యంగా చూశారు జోగిందర్‌ని.

రివాల్వరు పేలక ముందే జోగిందర్ కిందపడి పోయాడు. గురి తప్పిన రివాల్వరు గుండు రివ్వున దూసు కెళ్ళి ఎదురుగా వున్న గోడలో దిగబడిపోయింది.

"థాంక్యూ బాస్" అన్నాడు జోగిందర్ నోట్లో తడారి పోయినట్టు....

"ఫూల్....ఇప్పటికయినా పోలీసులకు చిక్కిన ఆ ఇద్దర్ని అంతం చేసే ఏర్పాట్లు తొందరగా చెయ్యి" అన్నాడు జైన్-జోగిందర్‌తో.

"బాస్....వాళ్ళు మన మనుషులు" అన్నాడు జోగిందర్.

"షటప్....నాకు తెలుసు. పోలీసుల హింసల్ని వాళ్ళు భరించలేరు. నిజం చెప్పేస్తారు. అందుకే వాళ్ళు బతక కూడదు. వెంటనే చావాలి....ఇద్దరి మనుషుల ప్రాణాల గురించి ఆలోచిస్తే మనందరి ప్రాణాలూ పోతాయి. యస్.పి. నాయక్ అసాధ్యుడు. ఏదోవిధంగా వాళ్ళచేత నిజం చెప్పిస్తాడు. వెళ్ళండి. వాళ్ళిద్దరినీ ఇంటరాగేట్ చేసే పోలీసు ఆఫీసర్లు ఎవరో తెలుసుకోండి. వాళ్ళిద్దర్నీ ఈ లోకం నుంచి పంపే ఏర్పాట్లు చెయ్యండి, గెటవుట్.... క్విక్" అన్నాడు జైన్.

అనుచరులు తేలిగ్గా గాలి పీల్చుకున్నారు-అప్పటికి చావు తప్పినందుకు.

జోగిందర్ తల ఎగరేశాడు అనుచరులను తనతో రమ్మన్నట్టు... అంతా అతడి వెనకే కదిలారు.

"మనం సూప్‌లో పడినట్టే" అన్నాడు వాడియా వాళ్ళంతా ఆ గదిలోంచి బయటకు వెళ్ళగానే.

"అవును....యస్.పి. నాయక్ పట్టుదలవున్న ఆఫీ

సర్ .. మన ముగ్గుర్ని జైల్లోకి నెట్టాలని ఆరాటపడుతున్నాడు. అందుకు తగిన సాక్ష్యాలకోసం వెతుకుతున్నాడు. వినాయక్ దాచిపెట్టిన ఆ కేసెట్ నాయక్‌కు దొరికిందంటే మనపని అవుట్ ....దానికోసం మనం ఇంకా అన్వేషణ సాగించాలి. తొందరపడి జోగిందర్‌ని చంపుకుంటే మనకే నష్టం ఇంకో గట్టి మనిషి మనకు దొరికే వరకూ జోగిందర్‌ని చంపకూడదు....'' అంటున్నప్పుడు గోడకు తగిలించివున్న లేడిని వేటాడుతున్న పులి పెయింటింగ్ కిందవున్న ఎర్రటి లైటు వెలుగుతూ ఆరిపోవడం మొదలుపెట్టింది.

''మెసేజ్'' అన్నాడు వాడియా.

జైన్ చేతిలోవున్న విస్కీగ్లాసును గ్లాస్ టేబిల్‌మీద వుంచి ఆ పెయింటింగ్ దగ్గరకు వెళ్ళి పులి కాలికింద పెయింటింగ్ కలర్‌లో కలిసిపోయిన చిన్న బటన్‌ని నొక్కాడు.

చప్పుడు చెయకుండానే గోడరంగులో కలిసిపోయిన ప్లయ్‌వుడ్ షీట్ పక్కకు జరిగింది. అందులో వున్న రిసీవింగ్ సెట్‌ని తలకు తగిలించుకుని ''యస్....యస్.... జైన్....జైన్'' అన్నాడు రెండుసార్లు.

అవతల్నించి మెసేజ్ రావటం మొదలుపెట్టింది. ధనుంజయ్—వాడియా అతని మొహంలోకి కుతూహలంగా చూడటం మొదలుపెట్టారు.

''ఎవరు?? కాస్ట్రోనా?!....మైగాడ్'' అర్చాడు జైన్.

కాస్ట్రో పేరు వినగానే ఉలిక్కిపడ్డారు ధనుంజయ్—వాడియా.

''తప్పకుండా....వీలైనంత వేగంగా కాస్ట్రోని ఇక్క-

దకు పంపించండి. చాలా అవసరం. వెరీ అర్జంట్, కాస్ట్రోని అడిగినట్టు చెప్పండి ...థాంక్ యూ వెరీమచ్"

మెసేజ్ ఆగిపోయింది.

రిలీసింగ్ పెట్‌ని తీసి పెయింటింగ్ మీదవున్న బటన్ నొక్కాడు జైన్. ప్లయ్‌వుడ్‌షీట్ పక్కకు జరిగి గోడలో కలిసిపోయింది.

"డియర్ పార్ట్‌నర్స్ ...విన్నారుగా .... అంతర్జాతీయ నేరస్థుడు కాస్ట్రో ప్రస్తుతం మద్రాసు నగరంలో తిరుగు తున్నాడుట....సీక్రెట్ గ్యాంగ్ లీడర్ వీర జెశియన్ ఇవాళో, రేపో కాస్ట్రోని కలుసుకుంటాడు....కాస్ట్రోని ఇక్కడకు పంపమని చెప్పాను" సంతోషంగా అన్నాడు జైన్.

"కాస్ట్రో మనం అనుకున్నది సాధించగలడా?" ధనుం జయ్ అడిగాడు.

"సందేహంలేదు. తప్పకుండా సాధిస్తాడు....కాస్ట్రో తెలివితేటలు అమోఘం....అతనొక గుంటవనక్క ఎన్నో దేశాల్లో కాస్ట్రోమీద వారంట్ వుంది....అన్ని దేశాలకూ అతనొక దొరకని నేరస్థుడు"

"కాస్ట్రోని యస్.పి. నాయక్‌మీద ప్రయోగిస్తే" అడిగాడు వాడియా.

"అన్నీ అతడే చూసుకుంటాడు....తప్పదు. కాస్ట్రో అడుగుపెట్టిన మరుక్షణం నగరంలో అలజడి లేస్తుంది" అన్నాడు జైన్ బాటిల్లో విస్కీని మిగిలిన రెండు గ్లాసు ల్లోకి వంచుతూ.

సరిగ్గా అప్పుడే పెయింటింగ్ మీదవున్న ఎర్రటి లైటు వెలుగుతూ ఆరిపోవటం మొదలుపెట్టింది మళ్ళీ.

కెవ్వుమని అరిచాడు బట్టతలవాడు. పొట్టలోకి హేండ్ స్టిక్ దూరిపోయినట్టుగా అనిపించింది. లోపలి నరాలన్నీ షాక్ కొట్టినట్టు అటూ ఇటూ కదిలిపోయాయి.

నల్లగీతల షర్టువాడు ప్రాణభయంతో వేటగాడికి చిక్కిన లేడిపిల్లలాగా చెమటతో తడిసిపోయిన ఇన్‌స్పెక్టర్ అమృతరాజును చూశాడు.

ఇద్దరూ లోపల ఒక్కటే అనుకుంటున్నారు. వాళ్ళకి ఆ గతి పట్టించిన హసీనా లాడ్జి మేనేజర్ని పోలీసులనించి బయటపడిన వెంటనే నరికి చంపెయ్యాలని. చాలా తెలివిగా ట్రాప్ చేశాడు ఆ మేనేజర్.

పిడికిలితో ఈడ్చి మూతిమీద కొట్టాడు అమృతరాజు. వాడే మళ్ళీ కెవ్వుమన్నాడు. పళ్ళు కదిలి రెండు విరిగి కిందపడ్డాయి. నెత్తురు నోట్లోనించి బయటకు కారింది. వాడి మొహం చూస్తూనే అదిరిపడ్డాడు రెండోవాడు. నెత్తురు తాగిన డ్రాక్యులా రూపం వాడికి గుర్తుకు వచ్చింది.

ఇంటరాగేషన్ గదిలోవున్న ఆ కిరాయి గూండా లిద్దరికీ వంటిమీద అండర్‌వేర్సు తప్పించి బట్టలు లేవు. ఇద్దర్నీ నిలబెట్టి చేతులు పైకిలాగి నైలాన్ తాళ్ళతో కట్టేశారు. మెడ వెనుకనించి రెండు చేతులమధ్యగా లావుగావున్న ఇనుపరాడ్‌ను దూర్చివుంచారు. వెనక్కు తూలినప్పుడల్లా ఐరన్‌రాడ్ మెడకు గుచ్చుకుని బాధ ఎక్కువవుతోంది.

ఐనా ఆ నేరస్థులు నోరు విప్పలేదు.

అమృతరాజులో ఓపిక చచ్చిపోలేదు.

ఇంటరాగేషన్‌లో అమృతరాజుకు ప్రత్యేకమైన పేరువుంది. అతను హింసించే విధానం అటువంటిది. నేరస్థుల పట్ల అతడికి జాలిలేదు.

అందుకే యస్.పి. నాయక్ వాళ్ళిద్దరితో నిజాన్ని చెప్పించే బాధ్యతను అమృతరాజు కిచ్చాడు.

"నువ్వుకూడా నోరు విప్పవా?" అన్నాడు.

"వద్దు నన్నేం చెయ్యొద్దు" బెదురుతున్న కళ్ళతో అన్నాడు.

"నిజం చెప్పు"

"చెబుతాను" అంటూ తన పార్టనర్‌వైపు చూశాడు వాడు.

బట్టతలవాడు కళ్ళు పెద్దవిచేశాడు చెప్పవద్దన్నట్టు.

అమృతరాజు చేతిలో హేండ్‌స్టిక్‌తో వాడి భుజంమీద ఎముకను గట్టిగా కొట్టాడు. వాళ్ళుకాలిన మనిషిలాగా చిందులు వేశాడు వాడు నొప్పితో.

"చెప్పు....నిజం చెప్పకపోతే మీ రిద్దరూ ఇక్కడే చస్తారు. మీగురించి అడిగేవాళ్ళు కూడా వుండరు. టెల్‌మి"

"ఎవరో తెలీదు. మమ్మల్ని కలుసుకుని వినాయక్ అనే అతన్ని చంపేశామని, అతను చావకముందు ఏదో చవక బారు లాడ్జిలో దనచేశాడనీ ఆ లాడ్జిని తెలుసుకోమని చెప్పాడు. తెలుసుకుంటే అతని గదిలో వున్న వస్తువులన్నీ తెచ్చి వాళ్ళకివ్వాలని అన్నాడు. ఆ పనికి ఒప్పుకున్నందుకు ఐదువేల రూపాయలు ఇచ్చాడు. డబ్బుకు ఆశపడి ఈ పనికి ఒప్పుకున్నాం. అంతే" భయంగానే చెప్పాడు.

అంత బాధలోనే బట్టతలవాడికి సంతోషం కలిగింది తన మిత్రుడు అసలు వ్యక్తుల్ని బయటపెట్టకుండా చెప్పినందుకు.

"ఎవరతను?" అమృతరా జడిగాడు.

"తెలీదు"

"అతను మిమ్మల్ని ఎక్కడ కలుసుకున్నాడు."

"అక్బర్ బార్ అండ్ రెస్టారెంట్ లో"

"మీరిక్కడ వుంటారనీ, ఈ పని మీరు చేస్తారని అతడికి ఎట్లా తెలుసు?"

"ఏమో మీకు తెలీదు"

"నిజంగానే తెలీదా?"

"తెలీదు సార్....అంతే జరిగింది. మమ్మల్ని చంపకండి"

"చంపను.. ఒక్కసారిగా చంపను. చిత్రహింసలతో కొంచెం కొంచెం చంపుతాను." అని వెనక్కి తిరిగాడు.

గదిలో కార్నర్ లో వున్న రెండు వైర్లను ప్లగ్ హోల్స్ లో వుంచి వాటి చివర్లు పట్టుకుని వాళ్ళ దగ్గిరకు వచ్చాడు.

స్పాట్ లైట్ కాంతి వాళ్ళ మొహాలమీద పడుతోంది.

"ఏమిటది?" బట్టతలవాడు భయంగా అడిగాడు.

"నీకే తెలుస్తుంది"

వాడి వెనక్కి వెళ్లాడు.

"వద్దు....వద్దు" అరిచాడు వాడు.

అమృతరాజు వాడి అరుపులు వినలేదు. రెండు వైర్లను వాడి వీపుకు తగిలించాడు.

షాక్ తో కీచుమంటున్నాడు వాడు.

ఊగిపోయాడు.

ఒకే ఒక్క క్షణం....

వాడి కాళ్లు వణికిపోయాయి.

"ఎలా వుంది షాక్ ట్రీట్ మెంట్?" అడిగాడు అమృతరాజు.

"చచ్చిపోతాం...."

"మీరు చావకూడదు. నిజం చెప్పకుండా మిమ్మల్ని చావనివ్వను."

"వద్దు....మమ్మల్ని ఒక్కసారి చంపెయ్యండి. ఈ బాధలు భరించలేం" బట్టతలవాడు వణుకుతున్న గొంతుతో అన్నాడు.

"ఐతే నిజం చెప్పండి"

వాళ్లు నోరు కదిలించలేదు.

అమృతరాజు సిగరెట్టు పెట్టె తీసి ఒక సిగరెట్టు బయటకు లాగి "సిగరెట్లు కాలుస్తారా?" అనడిగాడు.

"వద్దు" అన్నారు వాళ్ళు.

"ఆల్ రైట్....నేను కాలుస్తాను" అంటూ సిగరెట్ పెదిమల మధ్య పెట్టుకుని లైటరుతో వెలిగించుకున్నాడు.

లైటరుని జేబులో వేసుకుని వాళ్ళ వెనక్కి నడుస్తూ "నిజం చెబితే మీమీద ఎటువంటి కేసూ లేకుండా వదిలి పెడతాను. ఎందుకు అనవసరంగా బాధలు పడతారు. మిమ్మల్ని చూస్తుంటే నాకు జాలిగా వుంది. నాలో ఓపిక్కూడా పోతోంది" అన్నాడు.

"నిజం సార్. మేం చెప్పిందంతా నిజం....అతనెవరో ఆ వినాయక్‌ను ఎందుకు హత్యచేశారో మాకు తెలీదు" అన్నాడు రెండోవాడు.

"అలాగా" అన్నాడు అమృతరాజు జేబులో నించి లైటరుని బయటకుతీసి.

"పోనీ....మిమ్మల్ని వదిలిపెట్టే ఏర్పాటు చేస్తాను. వాళ్ళెవరో తెలుసుకుని నాకు చెయతారా?" అన్నాడు లైటరు బటన్ నొక్కుతూ....

"వదిలేస్తారా? ఐతే ఇరవైనాలుగ్గంటల్లో మీకు ఇన్ఫర్మేషన్ ఇస్తాం."

"ఇరవై నాలుగ్గంటల్లోనా? ఇప్పుడే ఇవ్వలేరా?" అంటూ వెలుగుతున్న లైటర్ని రెండోవాడి చెవి కింద ఉంచాడు.

ఇంటరాగేషన్ గది వాడి అరుపుతో ప్రతిధ్వనించింది.

రెండునిమిషాలవరకు వాడట్లా అరుస్తూనే ఉన్నాడు.

చెవికింద కాలిపోయి ఎర్రగా మారిపోయింది.

కళ్ళల్లో నీళ్ళు కారిపోయాయి.

పిచ్చిగా అమృతరాజు మొహంలోకి చూసి "నువ్వు మనిషివికాదు" అన్నాడు వాడు.

"అవును. నువ్వొక కిరాయి గూండావి. ఐనా నీకంటే ఎక్కువ క్రూయల్టీ నాలో ఉంది. ఇప్పటికైనా తెలుసుకున్నావు గదా....నిజం చెప్పు."

"నాకు తెలీదు" మొండిగా అన్నాడు వాడు.

"మీ ఇష్టం....ఈ ఇంటరాగేషన్ గదిలో ఇప్పటికి నాకు తెలిసి నిజం చెప్పకుండా ఎనిమిదిమంది చచ్చి పోయారు మా దెబ్బలకు తట్టుకోలేక. మీరిద్దరూ చస్తే పదిమందవుతారు. ఐతే మీరు చచ్చేముందు హింసించటంలో ఎన్ని రకాలు ఉన్నాయో అన్నీ మీకు చూపిస్తాను" అంటూ ప్యాంటు జేబులో చెయ్యిపెట్టాడు.

నిముషంలో సిగరెట్టుపెట్టె సైజులో ఉన్న ప్లాస్టిక్ పెట్టెను బయటకు తీసి దానికి ఉన్న ఎర్రటి బటన్ నొక్కాడు. లోపల ఏదో చక్రం తిరుగుతున్నట్టుగా చప్పుడు వచ్చింది. చిన్నగా లోపల్నించి బాగా పదునుగా ఉన్న కత్తి కొంచెం కొంచెం జరగటం మొదలుపెట్టింది.

"ఇది బేటరీతో పనిచేస్తుంది. నేనే జర్మనీ నించి తెప్పించాను. చర్మాన్ని వొలిచి తినే పురుగులుంటాయి.

మీకు తెలుసా?" అన్నాడు అమృతరాజు దాన్ని చూస్తూ.

"తెలీదు."

"ఇప్పుడు తెలుసుకుంటారు. ఆ పురుగులు చేసే పనిని ఈ చిన్న యంత్రం చేస్తుంది" అంటూ కొంచెం ముందుకు కదిలాడు.

సరిగ్గా అప్పుడే కాన్‌స్టేబుల్ వొచ్చి "సార్....మీకు ఇంటి దగ్గర్నించి ఫోన్‌కాల్ వచ్చింది" అని చెప్పాడు.

ఆ యంత్రాన్ని పాంటు జేబులో పడేసి "మళ్ళీ వస్తాను. చావో. బతుకో ఆలోచించుకోండి" అంటూ ఇంటరాగేషన్ గదినించి బయటకు వచ్చాడు.

బల్లమీద ఉన్న రిసీవర్ని తీసుకుని "అమృతరాజ్ స్పీకింగ్" అన్నాడు.

"నర్మదని మాట్లాడుతున్నాను. మన బేబీని ఎవరో కిడ్నాప్ చేశారండీ" అన్నది కంగారుగా అవతల్నించి.

"మై గాడ్? ఎవరు? నీకెలా తెలుసు?"

"ఇప్పుడే ఐదునిముషాల క్రితం ఫోన్‌చేసి ఎవరో చెప్పారు. మన రోడ్డు చివర వున్న గ్రవుండ్‌లో ఆడుకోటానికి వెళ్ళిన బేబీని వాళ్ళు కిడ్నాప్‌చేసి తీసుకువెళ్ళారట ఎవరో ఎందుకో చెప్పలేదు. మీకు మళ్ళీ ఫోన్ చేస్తామన్నారు"

"ఇప్పుడే వస్తున్నాను."

విసురుగా బయటకొచ్చి మోటారుసైకల్ హేండిల్ మీద చెయ్యివేశాడు.

లోపల ఫోన్ మోగిన చప్పుడయ్యింది.

స్టార్టు చెయ్యబోతున్నప్పుడు "సార్... మీకు ఫోన్ కాల్" అన్నాడు కాన్‌స్టేబుల్ బయటకు వచ్చి.

లోపలకు వెళ్ళాడు అమృతరాజు. అతనికి పిచ్చిపటి

నట్టుగా అయిపోయింది ఆ వార్త వినగానే.

"ఇన్‌స్పెక్టర్ అమృతరాజేనా?"

"అవును నువ్వెవరు?"

"మీ బేబీని కిడ్నాప్ చేసినవాడ్ని.........నీతో చాలా మాట్లాడాలి."

"బ్రూట్ ....నీ అంతు చూస్తాను" కోపంగా అరిచాడు అమృతరాజు.

"చాలా కష్టం రాజ్....నేరస్థుడు అన్నింటికి తెగించిన మనిషి. అందుకే ఎప్పుడూ నేరస్థుడిదే పైచెయ్యి. నువ్వు నా అంతు చూడకముందే నీ బేబీ ఇంకో లోకంలో ఉంటుంది. అందుకే అటువంటి ఆలోచనల్ని వదిలిపెట్టు."

"ఇంతకీ నీకేం కావాలి? డబ్బా?"

"వద్దు. ....పోలీస్టేషన్‌లో ఉండి నువ్వు ఇలాంటి ముఖ్యమైన విషయాలు మాట్లాడితే బావుండదు. వెంటనే నువ్వు ఇంటికి వెళ్ళు. తర్వాత రెండు నిముషాలకు నేను ఫోన్ చేస్తాను. ఫోన్‌కాల్ ట్రేస్ చేసే ప్రయత్నం కూడా నువ్వు చెయ్యకూడదు. నీ బేబీకి ప్రమాదం. గుడ్."

డిస్కనెక్ట్ అయ్యింది.

రిసీవరు పెట్టేస్తున్నప్పుడే అమృతరాజు మెదడులో ఉన్న సస్పెన్స్ తెర తొలగిపోయింది.

సెల్‌లో ఉన్న కిరాయి గూండాలు కళ్ళముందు కనబడ్డారు. గూండాలతో బేరం మొదలవుతుందనుకున్నాడు.

అతను ఇంటికి వెళ్ళేసరికి నర్మద వరండాలోనే నిలబడివుంది. ఒకేఒక్క అమ్మాయి. పదేళ్ళ బేబీని ఎవరో ఎత్తుకుపోయారంటే ఆమెకు మతిపోయినట్లయ్యింది.

అమృతరాజు లోపలకు రాగానే అతడ్ని పట్టుకుని గట్టిగా ఏడ్చింది.

నర్మద ఏడవటాన్ని అమృతరాజు అదే మొదటిసారిగా చూశాడు. వాళ్ళెవరైనా వాళ్ళ అంతు చూడాలనుకున్నాడు.

వృత్తిపరమైన శత్రుత్వంతో పసిపిల్లల్ని హింసించటం అతడి కిష్టంలేదు.

"భయపడకు బేబీ తిరిగి వస్తుంది."

ఫోన్ మోగింది.

రిసీవర్ ఎత్తి "చెప్పు ...ఏమిటి నీ బేరం?" అన్నాడతను.

"గుడ్. ఫోన్ దగ్గరే ఉన్నావనుకుంటాను. మేము చెప్పినట్టు నువ్వు చెయ్యటానికి ఒప్పుకుంటే నీ బేబీని ప్రాణాలతో వదిలిపెడతాం."

"మా కస్టడీలో వున్న ఆ ఇద్దరు కిరాయి గూండాల కోసమేనా మా బేబీని కిడ్నాప్‌చేసి తీసుకెళ్ళింది?"

"నువ్వు నిజంగా తెలివైనవాడివి అమృతరాజ్. అవును. వాళ్ళిద్దరి గురించే ఈ బేరం....ఐతే వాళ్ళిద్దర్నీ నువ్వు వదిలిపెట్టవలసిన పనిలేదు."

"మరేం చెయ్యాలి?!" ఆశ్చర్యంగా అడిగాడు.

"మీ కస్టడీలోనే వాళ్ళిద్దరూ చచ్చిపోవాలి."

"టూ మచ్... వాళ్ళిద్దరినీ హత్య చెయ్యటమా?"

"అవును ఇన్‌స్పెక్టర్. హత్య చెయ్యక తప్పదు. వాళ్ళిద్దరూ బతికి ఉండకూడదు."

"నో.... నేనా పనిచెయ్యను. హంతకులను పట్టుకునే పోలీసు ఉద్యోగిని హత్యలు చెయ్యమనటానికి నీకు మతి పోయి ఉండాలి."

"నువ్వు ఆ పని చెయ్యకపోతే నీ బేబిని మేము హత్య చేస్తాం. ఆ శవాన్ని ముక్కలుగా నరికి నీకు కానుకగా పంపిస్తాం."

"బాస్టర్డ్ .. నీ ప్రాణాలు తీస్తాను."

ఉలిక్కిపడింది నర్మద. అంత ఆవేశాన్ని ఆమె ప్పుడూ అతన్లో చూడలేదు.

"ఆవేశపడకు ఇన్స్పెక్టర్...... నువ్వు రిస్కులో న్నావ్....బాగా ఆలోచించుకో.......వాళ్ళను నువ్వేలా ంపుతావో నీ యిష్టం... ఇంటరాగేషన్ పేరుతో ఐనా ంపెయ్యవచ్చనుకుంటాను. వాళ్ళ ప్రాణాలు తియ్య ానికి నువ్వు ఒప్పుకోక తప్పదు. నీ బేబీ చావును నువ్వు కోరుకోలేవు....ఇరవై నిమిషాల తర్వాత మళ్ళీ ోన్ చేస్తాను."

డిస్కనెక్ట్ అయ్యింది.

"ఎవరండీ....బేబీని ఎందుకు కిడ్నాప్ చేశారు?" నర్మద అడిగింది.

చెప్పాడతను.

పిచ్చిగా అతడ్ని చూసి నర్మద.

ఏమిటి అతని నిర్ణయం? బేబీకోసం ఆ ఇద్దరు ూండాలను హత్యచేస్తాడా? వృత్తి ధర్మంకోసం బేబీని ోగొడతాడా?

మై గాడ్ జుట్టు పీక్కున్నాడు అమృతరాజు.

వాళ్ళని వదిలిపెట్టమంటే వదిలిపెట్టే వాడేమో! కాని ాదు. చంపెయ్యమన్నారు. హత్య చెయ్యటమా?

అసాధ్యం—

నిజమే—కాని బేబీ సంగతేమిటి?

"బేబీని వాళ్ళు హింసలు పెడుతున్నారేమో?" ఏడు ్తూనే అన్నది నర్మద.

"ప్లీజ్... బేబీని గుర్తుచెయ్యకు నర్మదా; బేబీని వాళ్ళు

హింసించరు. గూండాలను నాచేత హత్యచేయించటానికే బేబీని వాళ్ళు కిడ్నాప్ చేశారు. బేబీ ప్రాణాలతో తిరిగి రావటం నా నిర్ణయంమీదనే ఆధారపడి ఉంది."

"ఐతే....మీరు వాళ్ళిద్దరినీ చంపుతారా?"

"అవును. బేబీకంటే నాకు వాళ్ళిద్దరూ ఎక్కువకాదు. వాళ్ళను చంపినా దేశానికి నష్టంలేదు."

"దేశానికి నష్టంలేదని ఇద్దరు మనుషులను చంప టానికి ఒక పోలీసు ఇన్‌స్పెక్టర్‌గా మీరు సిద్ధపడు తున్నారా?"

"ఇప్పుడు నేను పోలీసు ఉద్యోగిగా ఆలోచించటం లేదు నర్మదా.......బేబీకి తండ్రిగా ఆలోచిస్తున్నాను. తర్వాత నాకు శిక్షపడినా అనుభవిస్తాను."

"వద్దండీ....మీరు హంతకుడిగా మారిపోవటాన్ని నేను సహించలేను."

"ఐతే బేబీ ప్రాణాలు బలిద్దామంటావా?"

"వద్దు బేబీ బతకాలి....మళ్ళీ ప్రాణాలతో తిరిగి రావాలి."

"ఎలా సాధ్యం నర్మదా? ఏదో ఒక్కటే జరుగు తుంది. దాన్నే మనం కోరుకోవాలి."

వాళ్ళిద్దరూ అలా మాట్లాడుకుంటున్నప్పుడు మళ్ళీ ఫోన్ మోగింది.

అమృతరాజు రిసీవరెత్తి "నువ్వే గెలిచావు. బేబీ తండ్రిగా నువ్వు చెప్పినట్టు చెయ్యడానికి ఒప్పుకుంటు న్నాను. నా ఒక్కడికోసం కాదు. నా భార్య మొహం చూడలేక ఈ హత్యలకు సిద్ధపడుతున్నాను. కానీ వాళ్ళని హత్యచేసిన తర్వాత నువ్వు బేబీని వదిలిపెడతావనే నమ్మకం నాకు కలగాలి" అన్నాడు.

"గుడ్....ఇన్‌స్పెక్టర్....నమ్మకంతో పని లేదు. వ్యక్తిగతంగా నీమీద నాకు ద్వేషం కాదు. కేవలం వాళ్ళిద్దరి ప్రాణాలు తీయించటానికే బేబీని తీసుకెళ్ళాము. వాళ్ళు చచ్చిపోయిన తర్వాత మా పని అయిపోయినట్టే. బేబీతో అవసరం వుండదు. అర్ధమయ్యిందా?"

"చెప్పండి....వాళ్ళను చంపిన తర్వాత మీకెలా తెలియజేయాలి?" అడిగాడు.

"ముందు నువ్వు వాళ్ళను ఎలా చంపదల్చుకున్నావో చెప్పు ఇన్‌స్పెక్టర్?"

"నా దగ్గిర సైనేడ్ వుంది. ఇద్దరిచేత బలవంతంగా తినిపించి చంపుతాను. నిజం చెప్పటం ఇష్టంలేక పళ్ళ మధ్య పెట్టుకున్న విషం వున్న కాప్స్యూల్స్‌ని మింగి చచ్చిపోయారని చెబుతాను."

"గుడ్....మంచి ఆలోచన. వాళ్ళను చంపి వెంటనే నువ్వు ఇంటికి వచ్చెయ్యి. సరిగ్గా గంట తర్వాత నేను ఫోన్‌చేసి నీ బేబీని ఎక్కడకు తీసుకువచ్చి వదిలి పెడతామో నీకు చెబుతాను. నువ్వు అక్కడకు వచ్చి బేబీని పికప్ చేసుకుంటావు."

డిస్కనెక్ట్ చేశారు ఫోన్‌ని.

"నర్మదా... నేను స్టేషన్‌కు వెళుతున్నాను" అతను కదిలాడు.

ఆమె అతనికి అడ్డుపడి "వద్దు....మీరు వాళ్ళని చంపొద్దు" అన్నది.

"చంపక తప్పదు. బేబీ కోసం ఏమైనా చేస్తాను. ఎంత మందినయినా చంపుతాను. తప్పుకో."

విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

మోటార్‌సైకిలు ఎక్కి ముందుకు దూకించాడు.

అతడి గుండెలో మంట రేగింది.

డర్టీరోగ్స్.... వాళ్ళు దొరికితే ప్రాణాలతో వదల గూడదు. వేటీ దగ్గరకు రాగానే వాళ్ళని వెంటాడాలి. వేటాడి చంపాలి.

మోడార్ సైకిల్ని గోడ పక్కనే వుంచి లోపలకు వెళ్ళాడు.

"నాయక్ సాబ్ ఫోన్ చేశారా?"

"లేదు సార్ చెయ్యలేదు."

ఇంటరాగేషన్ గదిలోకి వెళ్ళాడు.

స్పాట్ లైట్లు వెలుగుతూనే వున్నాయి.

"ఏం నిర్ణయం తీసుకున్నార్రా....చావటానికా? బతకటానికా?" బెల్టు వూడదీస్తూ అడిగాడు అమృతరాజు.

వాళ్ళిద్దరూ బెదిరిపోయారు.

"వద్దు....కొట్టొద్దు...." అరవటం మొదలు పెట్టారు.

"మీరు చావాలి... మీరు బతికుండకూడదు."

బెల్టు పైకి లేచింది. రెండోవాడి గుండెల మీదకు విసురుగా వచ్చి తాకింది. ఎగిరి గోడకు కొట్టుకున్నాడు వాడు. అంతమేర చర్మం లేచిపోయి నెత్తురు బయటకు చిమ్మింది.

అమృతరాజు ఆగలేదు.

పిచ్చిపట్టినట్టు బెల్టుతో ఇద్దర్నీ వాళ్ళ అరుపుల్నీ, బాధల్నీ పట్టించుకోకుండా ఆపకుండా పదినిముషాలసేపు కొట్టాడు.

ఆగిపోయాడు.

వాళ్ళిద్దరూ తలలు వాల్చేశారు.

పోలీసులు ఇంటరాగేషన్ గదిలోనించి బయటకు వచ్చిన అమృతరాజును భయంతో చూశారు.

"యస్. పి. సాబ్ ఫోన్ చేస్తే నాకు ఫోన్ చేసి చెప్పండి."

వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళేంతకి నర్మద ఏడుస్తూనే వుంది. అతడ్ని చూసి "వాళ్ళిద్దర్నీ చంపేశారా?" అన్నది.

తల వూపాడతను.

"ఎవరికీ తెలీలేదా?"

"లేదు."

"మీరు హత్యలు చేస్తారని కల్లో కూడా అనుకోలేదు."

"నేను కూడా అనుకోలేదు నర్మదా... తప్పలేదు."

"వాళ్ళిద్దరినీ మీరే చంపారని తెలిస్తే."

"తెలీకపోయినా బేబీని తీసుకురాగానే నేనే చెబుతాను."

"ఓ గాడ్!" తల పట్టుకుంది నర్మద.

అమృతరాజ్ సిగరెట్ కాల్చాడు.

గంట గడుస్తున్నప్పుడు ఫోన్ మోగింది.

"అమృతరాజ్‌ని."

"పని పూర్తయ్యిందా?"

"ఆ...."

"విషంతోనే చంపావా?"

"లేదు. బెల్టుతో ఊపిరాడకుండా కొట్టాను. తట్టుకోలేక చచ్చిపోయారు."

"థాంక్యూ....నువ్వు నీ మాట నిలబెట్టుకున్నావ్. నేను కూడా నా మాట నిలబెట్టుకుంటాను. పది నిముషాలు ఆగి చంద్రహిల్స్ దగ్గిరకు వచ్చెయ్యి. అక్కడ వున్న ఒకే ఒక్క పెద్ద చెట్టు దగ్గిర నీ బేబీ స్పృహ లేకుండా

వుంటుంది కంగారు పడకు. అమ్మ-నాన్న కావాలని యేడుస్తుంటే స్పృహ తప్పించాము అంతే. శ్రమ తీసుకుని పోలీసులతో రావటం అనవసరం. అక్కడ వుండేది నీ బేబీమాత్రమే. నువ్వు వచ్చేసరికి మేము వెళ్ళిపోతాం. బై అమృతరాజ్."

రిసీవరు పెట్టేశాడు.

"బేబీని వదిలిపెడుతున్నారా?" ఆత్రంగా అడిగింది నర్మద.

"అవును. బేబీని ఎక్కడ వదిలిపెడతారో చెప్పారు. నేను వెళ్ళి తీసుకువస్తాను. జాగ్రత్తగా వుండు."

క్షణం తర్వాత అమృతరాజు గాలితో పోటీపడి మోటారు సైకిలు నడుపుతున్నాడు.

* * *

ఫోన్ మోగింది.

అప్పటిదాకా అమృతరాజు బెల్టు దెబ్బల గురించి మాట్లాడుతున్న కానిస్టేబుల్ రిసీవర్ ఎత్తాడు.

"యస్. పి. స్పీకింగ్."

"సమస్కారం దొరా" ఫోన్‌కు సెల్యూట్ చేశాడు.

"సెల్‌లో వున్న ఆ ఇద్దరూ ఎలా వున్నారు?"

"అమృతరాజుగారు ఎన్ని దెబ్బలు కొట్టినా నోరు తెరవలేదు దొరా....చస్తారేమో భయంగా వుంది."

"ఏమిటీ అమృతరాజు దెబ్బలు కొట్టినా వాళ్ళు నోరు తెరవలేదా? అసలు వాళ్ళు బతికే వున్నారా?"

"ఉన్నారు దొరా."

"ఫూల్ ....వెళ్ళి చూసి వచ్చి ఆ తర్వాత చెప్పు."

రిసీవరు పెట్టి లోపలకు పరుగుదీశాడతను.

రెండు నిముషాలకు వచ్చి "స్పృహలో లేరు దొరా.... బతికే వున్నారు" చెప్పాడు.

"అమృతరాజు ఎక్కడికి వెళ్ళాడు?"

"ఇంటికి వెళ్ళారు దొరా. తమరు ఫోన్ చేస్తే ఇంటికి ఫోన్‌చేసి చెప్పమన్నారు. ఇప్పుడే చెబుతాను."

"వద్దు.... చెప్పింది చెయ్యి. అమృతరాజు ఇంటరాగేషన్ పేరుతో వాళ్ళిద్దర్నీ చంపుతాడు. అందుకే వాళ్ళకి స్టేషన్ మారుస్తున్నాను. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను జీపులో పంపుతున్నాను. ఈలోపల వాళ్ళిద్దరికీ స్పృహ తెప్పించి బేడీలు వేసివుంచండి. జీపు రాగానే వాళ్ళని జీపులో ఆ ఇన్‌స్పెక్టర్లతో పంపించండి."

"చిత్తం దొరా!"

"జాగ్రత్త ...వాళ్ళిద్దరూ పారిపోగూడదు."

రిసీవరు పెట్టేసి మరో ముగ్గురు కానిస్టేబుల్స్‌తో కలిసి ఇంటరాగేషన్ గదిలోకి పరిగెత్తాడతను.

పది నిముషాలకు ఆ కిరాయి గూండాలకు స్పృహ వచ్చింది చేతులు లాగి కట్టిన నైలాన్ తాళ్ళ నుండి విముక్తి దొరికింది, ఇద్దరి చేతులకూ కలిపి బేడీలు వేశారు. బట్టలు తొడిగారు.

"ఎక్కడికి తీసుకెళుతున్నారు!" అడిగాడు వొకడు.

"నోర్మయ్" కానిస్టేబుల్ అరిచాడు.

జీపు వచ్చింది.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు దిగారు.

"వీళ్ళేనా ఆ ఇద్దరూ?"

"అవును సార్!"

"అమృతరాజు చేతిలోపడి ఇంకా నోరు తెరవలేదా? బాగా మొండి మనుషులయి వుండాలి."

"అవును సార్.........మా కూడా ఆశ్చర్యంగా వుంది."

"ఊ....క్విక్....జీపులో ఎక్కించండి...."

ఇద్దర్నీ జీపులో ఎక్కించారు.

జీపు కదిలి దూసుకుపోయింది.

"ఎక్కడికి తీసుకెళుతున్నారు?" అనుమానంగా అడిగాడు బట్టతలవాడు.

"షటప్!"

ఐదు నిముషాలకు జీపు నిర్జనంగా వున్న మైదాన ప్రదేశంలోకి వచ్చింది.

"మాకు భయంగా వుంది" మళ్ళీ అన్నాడు వాడే.

"భయమెందుకురా బుద్ధూ....మమ్మల్ని గుర్తుపట్ట లేదా....మేం పోలీసులం కాదురా....మిమ్మల్ని విడిపించ టానికి జోగిందర్ ఎస్ పి. నాయక్‌లాగా మాట్లాడి వాళ్ళకు టోపీ వేయించాడు."

"ఓహో...." సంతోషంతో యిద్దరూ ఒకేసారి అరిచారు.

"మొత్తానికి పోలీసుల్నే మోసం చేశారు. లేకపోతే ఆ అమృతరాజ్ చేతిలో చచ్చిపోయేవాళ్ళం....ఇక వాడి అంతు చూడాలి."

జీపు ఆగిపోయింది.

"ఇక్కడ ఆపారేం...."

"దిగండి....జోగిందర్ ఇక్కడికి వచ్చి మిమ్మల్ని కలుసుకుంటానన్నాడు" ఒక ఇన్‌స్పెక్టర్ వేషంలో వున్నతను చెప్పాడు.

ఇద్దరూ దిగారు.

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు, వారికి పత్రికలన్నీ రిజిష్టర్ లేదా బుక్ పోస్టులో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా రు. 90/- చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

3. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

4. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియ జేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై- మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి రెండేసి నెలలకొకసారి V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యం కూడా వుంది. ఈ పద్ధతిలో రెండు నెలలకొకసారి పత్రికల ఖరీదు రు. 30/-లు చెల్లించి కాపీలు పొందవచ్చును. యీ సౌకర్యం కావలసివస్తే మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ! —పత్రికలకు గ్యారంటీ!!

"ఇంకెందుకు ఈ వేడీలు? తీసెయ్యండి" అన్నాడు బట్టతలవాడు.

"ప్రాణాలే పోగొట్టుకునేవాళ్ళకు వేడీలుంటే ఇబ్బం దేమిటి?"

"ఆ ....యేమిటి మీరు మాట్లాడేది?" భయంగా ఇద్దరూ అడిగారు.

"జోగిందర్ మీ ఇద్దర్నీ చంపెయ్యమన్నాడు."

"అన్యాయం.... ద్రోహం."

"ఏమో! నాకు తెలీదు. మీరు చావాలి....మీ వల్ల ప్రమాదం వుందిట....పోలీసుల దృష్టిపడిన మనుషులు బతకటానికి వీల్లేదని చెప్పమన్నాడు" అంటూనే సైలెన్సరు అమర్చిన పిస్తోలును బయటకు తీశాడతను.

"ప్లీజ్ ... వద్దు ...." ఉన్నట్టుండి వాళ్ళిద్దరూ వెనక్కు తిరిగి పరుగుదీయబోయారు.

కాని — అప్పటికే పిస్తోలు పేలింది.

గుండ్లు వాళ్ళిద్దరి ఛాతీలను చీల్చుకుంటూ దూసుకు వెళ్ళాయి. కిక్కురుమనకుండా నేలమీదకు ఒరిగిపోయారు ఆ కిరాయి గూండా లిద్దరూ.

నిముషానికి ఆ ప్రదేశంలో జీపు బయల్దేరిన చప్పు డయ్యింది.

* * *

చీకట్లో మోటార్ సైకిల్ని ఆపాడు అమృతరాజు. చంద్రహిల్స్ ప్రాంతం నిశ్శబ్దంతో నిండిపోయింది. ఎత్తుగా వున్న కొండలు చీకట్లో బాగా నల్లగా వున్నాయి.

దూరంగా చెట్టు కనపడుతోంది. ఎత్తుగా—

లైటు వెలతుర్లో చూశాడు.

చెట్టు మొదట్లో యెవరో పడుకున్నట్టుగా అనిపించింది.

శ్రీ మహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

మే 25 విడుదల !

1. సౌగంధి (డైరెక్టు నవల) — యద్దనపూడి సులోచనరాణి — 25-00
2. ఉషశ్రీ రామాయణం (సరళ వచనం) — 25-00
3. ఉషశ్రీ భారతం ,, — 25-00
4. ఉషశ్రీ సుందరకాండ ,, — 12-00
5. పదకేళి (100 పజిల్స్—ఆఖరున జవాబులతో) — 10-00
6. ఉద్యోగపరీక్షలు - విజయరహస్యం — P.V.K. ప్రసాదరావు — 7-50
7. కార్యాలయ - వాణిజ్యపదకోశము — R. వెంకటేశ్వరరావు — 12-00
8. చైతన్యదీపాలు — ఆమూరి వెంకటసీతారామమూర్తి — 20-00
9. మనోరథం (కథలు) — ద్విభాష్యం రాజేశ్వరరావు — 18-00

అడ్వాన్సు లేని ఆర్డర్సు అంగీకరింపబడవు.

పోస్టు ఖర్చులు అదనం

ఫోన్ నెం : 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్, గవర్నరు పేట,

విజయవాడ - 520 002

లైటాఫ్ చెయ్యకుండా మోటార్ సైకిలు ‹గి చెట్టు వైపు రెండడుగులు వేశాడతను. వాళ్ళెవరయినా అక్కడ వున్నారనే అనుమానం అతన్లో వుంది.

జాగ్రత్తగా చూశాడు.

చెట్టుపక్కనే కొండ అంచు. అంతా చీకటి. అక్కడ ఎవరూ దాక్కునివున్నా తెలీదు.

ఎటువంటి అలికిడీ వినపడలేదు.

ఎవరు?

చెట్టుకింద పడుకున్నది బేబీయేనా?

అవును. ఐవుండాలి.

గబగబా నడిచాడు,

"అమృతరాజ్. అక్కడే ఆగు."

ఉలిక్కిపడ్డాడు. తన అనుమానం నిజమే అయ్యింది. ఎవరో కొండ అంచున చీకట్లో దాక్కున్నారు.

ఎందుకు?

"ఎవర్నువ్వు?"

"నే నెవరో నీకు చెప్పినా ప్రమాదంలేదు. నా పేరు జోగిందర్. నీ కోసమే ఇక్కడ కాచుకుని వున్నాను."

"ఎందుకు?"

"నిన్ను చంపటానికి."

"ఎందుకు? నువ్వు చెప్పినట్టు ఆ కిరాయి గూండాల ప్రాణాలు తీసినందుకా?"

పెద్దగా నవ్వాడు జోగిందర్. (సశేషం)

Edited and Published by S. DAMODAR REDDY 3-4-554 Narayanaguda, Hyderabad-500 029, and Printed at Kranti Press, Madras - 600 001.

Blank Page


Regd. no: H/HD-48
PRABHAKAR